thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 122 | కరీంనగర్ శుక్రవారం, 11 జులై 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## చైనా సరికొత్త హైడ్రోజన్ బాంబు

న్యూఢిల్లీ : అణ్వస్త్రాల తరహాలో కాకుండా సాధారణ బాంబుల్లోనే అత్యధిక విధ్వంసం సృష్టించగల హైడ్రోజన్ బాంబును చైనా విజయవంతంగా పరీక్షించింది. ఏకంగా 1000 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతను వెలువరిస్తూ, కొన్ని సెకన్ల పాటు అగ్ని గోళం (ఫైర్ బాల్) నిలిచి ఉండే ఈ బాంబులతో.. తీవ్రమైన విధ్వంసం జరగడమే కాదు అల్యూమినియం అల్లాయ్ వంటి లోహాలు కరిగి, రక్షణ పరికరాలు, సామగ్రి దెబ్బతింటాయని చెబుతున్నారు. చైనా చేసిన ఈ ప్రయోగాత్మక పరీక్ష వివరాలతో సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ పత్రిక తాజాగా కథనాన్ని ప్రచురించింది. చైనా షిప్ బిల్డింగ్ కార్పొరేషన్ పరిధిలోని '705 రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్' ఈ హైడ్రోజన్ బాంబు పరీక్షను నిర్వహించినట్టు తెలిపింది.



# బీసీ రిజర్వేషన్లకు పచ్చజెండా!

## మంత్రి మండలి కీలక నిర్ణయం!!

హైదరాబాద్ : రాష్ట్రంలో సగం జనాభాకు మించి ఉన్న బీసీలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో జరిగిన మంత్రివర్గ సమావేశం మరో శుభవార్తను ప్రకటించింది. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. మార్చి నెలలో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లోనే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లులను ప్రభుత్వం ఆమోదించింది. విద్యా ఉద్యోగాలతో పాటు స్థానిక సంస్థల్లోనూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్స్ ప్రాతినిధ్యం కల్పించే రెండు బిల్లులను అదే రోజు అసెంబ్లీలో ఆమోదించింది. ఇటీవలే పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన అంశంపై హైకోర్టు కూడా నెలాఖరులోపు రిజర్వేషన్స్ ఖరారు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. వీటన్నింటినీ చర్చించిన మంత్రివర్గం స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయం తీసుకుంది. సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే బీసీ డెడికేటేడ్ కమిషన్‌ను నియమించింది. రాష్ట్ర ప్రణాళిక విభాగం ఆధ్వర్యంలో కులగణన చేపట్టింది. వీటి ఆధారంగానే అసెంబ్లీలో 42 శాతం రిజర్వేషన్ల బిల్లును ఆమోదించింది. అందుబాటులో ఉన్న డేటా ఆధారంగా, జనాభా ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేసేందుకు తదుపరి చర్యలు చేపట్టాలని తీర్మానించింది. బీసీల రిజర్వేషన్లను ఖరారు చేసేందుకు గ్రామ పంచాయతీ సర్పంచ్, ఎంపీటీసీలకు మండలం యూనిట్‌గా, ఎంపీపీ, జడ్పీటీసీలకు జిల్లా యూనిట్‌గా, జడ్పీ చైర్మన్లకు రాష్ట్రం యూనిట్‌గా పరిగణిస్తారు. బీసీ రిజర్వేషన్ల పెంపునకు అనుగుణంగా రాష్ట్రంలో అమల్లో ఉన్న పంచాయతీరాజ్ చట్టం-2018 సవరణలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. త్వరలోనే ఈ చట్టంలో చేయాల్సిన సవరణలకు అవసరమైన చర్యలు చేపడుతుంది. రాష్ట్రంలో కొత్తగా రెండు ప్రైవేట్ యూనివర్సిటీల ఏర్పాటుకు కేబినేట్ ఆమోదం తెలిపింది. ఎయిమిటీ యూనివర్సిటీ, సెయింట్ మేరీ రిహాబిలిటేషన్ యూనివర్సిటీలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. AMITY యూనివర్సిటీలో మన తెలంగాణ విద్యార్థులకు, అంటే మన స్థానిక విద్యార్థులకు 50 శాతం అడ్మిషన్లకు అవకాశం కల్పించాలనే నిబంధనను ప్రభుత్వం విధించింది. సంగారెడ్డి జిల్లాలో ఇటీవల రెండు కొత్త మున్సిపాలిటీలు ఏర్పడ్డాయి. కొత్తగా ఏర్పడ్డ జిన్నారం, ఇంద్రీశం మున్సిపాలిటీల పరిధిలో చేర్చే 18 గ్రామ పంచాయతీలను డీ లిస్టింగ్ చేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో అధునాతనంగా గోశాలల ఏర్పాటు, నిర్వహణపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో ముగ్గురు అధికారులతో కమిటీ ఏర్పాటు చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. వచ్చే కేబినేట్ సమావేశంలోపు కమిటీ తమ నివేదికను అందించాలని గడువు విధించింది. ఇప్పటికే ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పశుసంవర్ధక శాఖ రూపొందించిన పవర్ పాయింట్ ప్రజంటేషన్ను, కొత్తగా నిర్మించే గోశాల డిజైన్లను మంత్రివర్గ భేటీలో ప్రదర్శించారు.

రాష్ట్రంలో 306 గోశాలలున్నాయి. హైదరాబాద్లో ఎన్కేపల్లి, వెటర్నరీ యూనివర్సిటీ, వేములవాడ, యాదగిరిగుట్టలో అత్యాధునికంగా గోశాలలు నిర్మించాలని నిర్ణయించారు. వీటితో పాటు రాష్ట్రంలో ఉన్న గోశాలల రిజిస్ట్రేషన్లు, వాటి నిర్వహణపై సమగ్ర విధాన పత్రం రూపొందించాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది.

**కేబినెట్‌లో కొత్త సంప్రదాయం...** ఈసారి రాష్ట్ర మంత్రివర్గం కేబినెట్ భేటీలకు సంబంధించి కొత్త సంప్రదాయాన్ని ప్రారంభించింది. ఇప్పటివరకు జరిగిన కేబినెట్ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలు, అమలుపై సమీక్ష జరిపింది. 2023 డిసెంబర్ 7వ తేదీ నుంచి ఇప్పటి వరకు 18 కేబినెట్ సమావేశాలు జరిగాయి. ఈరోజు 19వ సమావేశం జరిగింది. గతంలో జరిగిన సమావేశాల్లో మొత్తం 327 అంశాలను చర్చించింది. వీటిలో 321 అంశాలను కేబినెట్ ఆమోదించింది. వీటి అమలు పురోగతిని శాఖలవారీగా అధికారులతో మంత్రివర్గం చర్చించింది.

**కొత్తగా 22 వేల ఉద్యోగాలు...** ఈ ఏడాదిన్నర వ్యవధిలో రాష్ట్ర ప్రభుత్వం 60 వేల ఉద్యోగాలను భర్తీ చేసింది. వీటితో పాటు మరో 17084 ఉద్యోగాల నియామక ప్రక్రియ వివిధ దశల్లో ఉంది. కొత్తగా 22033 ఉద్యోగాలకు త్వరలో నోటిఫికేషన్లు ఇవ్వాలని మంత్రివర్గం చర్చించింది. వివిధ విభాగాల్లో పని చేస్తున్న ప్రతీ ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల పనితీరును సమీక్షించేందుకు వీలుగా వారి ఆధార్, పూర్తి వివరాలు సేకరించాలని ఆర్థిక శాఖను మంత్రివర్గం ఆదేశించింది. ప్రభుత్వ ఉద్యోగుల హాజరుతో పాటు విధినిర్వహణలో జవాబుదారీతనం పెంచేందుకు అవసరమైన సంస్కరణలు తీసుకురావాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఇప్పటికే ఉద్యోగులకు సంబంధించి నియమించిన అధికారుల కమిటీకి ఈ బాధ్యత అప్పగించాలని నిర్ణయించారు. రెండు నెలల్లో పూర్తిస్థాయి నివేదికను సమర్పించాలని ఆదేశించింది.



# అక్కడా... ఇక్కడా... అదే లొల్లి!

## పక్కలో బల్లాలవుతున్న తోబుట్టువులు!!

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్.. రాష్ట్రాలుగా విడిపోయినా మిగిలిన ఏ విషయంలోనూ విడిపోలేదనే చెప్పొచ్చు. ఒకప్పుడు మద్రాస్ తో ఆంధ్రులకు ఎలాంటి సంబంధం ఉండేదో అంతకంటే ఎన్నో రెంట్లు ఎక్కువ అనుబంధం ఇరు రాష్ట్రాల మధ్య ఇప్పుడూ కొనసాగుతోంది! దీంతో.. ఇరు రాష్ట్ర రాజకీయాల్లో ఉన్న రెండు కుటుంబాలు, అందులోని ఆడపడుచులకు సంబంధించిన ఆసక్తికర చర్చ హాట్ టాపిక్ గా మారింది. అవును... రాజశేఖర్ కుమార్తె షర్మిల, చంద్రశేఖర్ కుమార్తె కవిత లు ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో హాట్ టాపిక్ అనే చెప్పాలి! ఉమ్మడి రాష్ట్ర రాజకీయంలో వైఎస్సార్ పాత్ర గురించి ఎంత చెప్పినా తక్కువే అని అంటారు.. తెలంగాణ రాజకియాలను కేసీఆర్ లేకుండా ఊహించలేమని కొంతమంది చెబుతారు. అలాంటి ఉద్దండులకు వీరు ముద్దుల కుమార్తెలు! ఇదే సమయంలో.. వీరిద్దరూ నోరు మాట్లాడటం మొదలుపెడితే.. తమ తండ్రుల గురించే మాట్లాడతారు. వీరిద్దరికీ వారిద్దరే హీరోలు. వీరి రాజకీయ భవిష్యత్తుకు వారే అన్నీ! వారి వారి తండ్రుల పేర్లే వీరి బలాలూ, బలగాలు! కట్ చేస్తే... ఇద్దరికీ వారి వారి అన్నలే విలన్లు! ఇన్ని సమపోలికలు ఉన్న వీరికి రాజకీయంగా ఓ అతిపెద్ద వ్యత్యాసం ఉంది! అదేమిటంటే... తండ్రి హీరో, అన్న విలన్, ఇద్దరి భర్తల పేర్లు అనీల్! ఈ పోలికల సంగతి పక్కనపెడితే... తెలంగాణ ఉద్యమ సమయంలో కేటీఆర్ పాత్రతో పాటు కవిత పాత్ర అత్యంత కీలకమనే చెప్పాలి. ఇద్దరూ ఎవరి స్థాయిలో వారు పోరాడారు! తెలంగాణ కోసం సాంస్కృతిక కార్యక్రమాలు జరుపుతూ ప్రజలను జాగృతం చేసిన చరిత్ర కవిత కు ఉంది. అయితే.. టీఆరెస్స్ (ప్రస్తుత బీఆరెస్స్) అభివృద్ధిలో కవిత కంటే కేటీఆర్ పాత్ర కాస్త ఎక్కువని చెబుతుంటారు! ప్రధానంగా రెండోసారి అధికారంలోకి రావడంలో! అయితే.. పదవుల విషయంలో కవితకు తండ్రి కేసీఆర్ అయినా, అన్న కేటీఆర్ అయినా ఉన్నంతలో మంచి గౌరవమే ఇచ్చారని చెబుతారు. ఆమె ఎంపీగా పనిచేశారు. టర్వాత ఓటమి పాలైతే ఎమ్మెల్సీ ఇచ్చారు!

ఉన్నంతంలో ఆమెకు రాజకీయ పదవులు, అధికారిక ప్రోటోకాళ్లు దూరం కాకుండానే చూసుకున్నారు కేసీఆర్, కేటీఆర్ అని చెబుతారు! ఇక ఢిల్లీ లిక్కర్ స్కాం వ్యవహారం అయితే బీఆరెస్స్ కు, కేసీఆర్, కేటీఆర్ లకు పెద్ద తలనొప్పులే తెచ్చిపెట్టిందని చెబుతారు! కట్ చేస్తే... వైసీపీ విజయంలో, జగన్ జైల్లో ఉన్నప్పుడు తన తల్లితో కలిసి చెల్లెల్లు షర్మిల సుమారు 16నెలలు పార్టీకి చేసిన సేవ గొప్పదనే చెప్పాలి! నాడు ఆమె ఆ స్థాయిలో ధైర్యం చేసి ముందుకు సాగకపోతే.. పార్టీకి పునాదుల సమయంలోనే ఊహించని స్థాయిలో ఇబ్బందులు ఎదురయ్యేవని చెబుతారు! అయితే 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆమెకు దక్కింది ఏమిటి? వారి వ్యక్తిగత కుటుంబ అస్తుల సంగతి కాసేపు పక్కనపెడితే.. జగన్ ఆమెకు ఎలాంటి పదవులూ ఇవ్వలేదు! అయితే... పదవులన్నీ ఇంట్లో వాళ్లే తీసుకోకూడదని వైసీపీ వాళ్లు సమర్థించుకున్నా... షర్మిలకు ఎలాంటి పదవి ఇచ్చినా అది ప్రజల నుంచి ఎలాంటి అభ్యంతరానికి అవకాశం ఇవ్వదు! జగనన్న వదిలిన బాణంపై ఆమెకు ప్రజల్లోనూ, కార్యకర్తల్లోనూ ఐడెంటిటీ ఉంది! దీంతో.. ఆమె తెలంగాణలో పార్టీ పెట్టి, దాన్ని కాంగ్రెస్ లో కలిపేసి, ఇప్పుడు అదే పార్టీకి ఏపీ చీఫ్ గా ఉన్నారు! ఆమె రాజకీయ భవిష్యత్తు ఇక హస్తం గుర్తు తోనే అని ఆమె ఫిక్సైనట్లు కనిపిస్తున్నారు. తన తండ్రి వైఎస్సార్ - కాంగ్రెస్ పార్టీ.. వేరు వేరు కాదనేది ఆమె మాటగా వినిపిస్తుంటుంది! కవిత మాత్రం తమ నాయకుడు కేసీఆరే అని చెబుతున్నారు!

ఇలా పైకి ఇద్దరి పరిస్థితి ఒకటే అన్నట్లుగా పైకి కనిపిస్తున్నా.. ఇద్దరి గతం పూర్తి వైవిధ్యం, ప్రస్తుతానికి కనిపిస్తున్న రాజకీయ భవిష్యత్తు విభిన్నం అనే చెబుతుంటారు రాజకీయ విశ్లేషకులు. ఆ సంగతి అలా ఉంటే... ఇక వీరిద్దరి అన్నల విషయానికొస్తే... వారి వారి రాజకీయాలకు చెల్లెల్లు కచ్చితంగా నెగిటివ్ ప్రభావం చూపిస్తున్నారనే చెప్పాలి! ప్రత్యర్థులకు అవకాశాలు ఇస్తున్నారనే అంటారు! 2024 ఎన్నికల్లో వైసీపీ ఘోర ఓటమి పాలవ్వడానికి షర్మిల మాత్రమే కారణం కాకపోవచ్చు కానీ... ఆమె కూడా ఒక కారణం అని చెప్పి తీరాలనేది చాలా మంది అభిప్రాయం! పైగా... ఆమె అధికార కూటమి ప్రభుత్వంపై పోరాటం అని చెబుతున్నాప్పటికీ... ప్రధానంగా జగన్ పైనే ప్రత్యక్ష, పరోక్ష రాజకీయ, వ్యక్తిగత పోరాటం అనేది సుస్పష్టం! ఈ విషయంలో ఆమె ఇప్పట్లో తగ్గేలా కనిపించడం లేదని అంటారు.. భవిష్యత్తులో జాతీయ రాజకీయాల్లోని సమీకరణలు మారేవరకూ! ఇక కవిత విషయానికొస్తే... వచ్చే ఎన్నికల్లో కేటీఆర్ రాజకీయ భవిష్యత్తుకు ఆమె ఎలాంటి అడ్డు అనేది ఆసక్తికర విషయం! వచ్చే ఎన్నికల్లో బీఆరెస్స్ అధికారంలోకి వస్తే కేసీఆర్ మాత్రమే సీఎం అనేది అటు కేటీఆర్, ఇటు హరీష్ రావు చెబుతున్నారు. కాకపోతే టాప్ 2 కేటీఆర్ అని అంటున్నారు. ఇక్కడే కవిత కు సమస్య అనే విశ్లేషణలు వినిపిస్తుంటాయి!ల ఈ నేపథ్యంలోనే... జగన్, కేటీఆర్ ఎప్పుడైనా ఫోన్లు మాట్లాడుకున్నా.. వ్యక్తిగతంగా కలిసినప్పుడు మాట్లాడినా.. వారిద్దరూ "అ ఆ" సినిమాలోని ... "శత్రువులు ఎక్కడో ఉండరన్నా... చెల్లెళ్ళ రూపంలో ఇంట్లోనే ఉంటారు!" అని చెప్పుకునే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని అంటున్నారు నెటిజన్లు! ఇది (ప్రస్తుతానికి) వారి విషయంలో అయితే నిజమేనా? లేక, డైలాగ్ రివర్సా..??




హైదరాబాద్: వరంగల్ జిల్లా కాంగ్రెస్ నేతల పంచాయితీ మరోసారి గాంధీభవన్‌కు చేరింది. క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవితో వరంగల్ కాంగ్రెస్ నేతలు సమావేశమయ్యారు. ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, కుడా ఛైర్మన్ వెంకట్రామిరెడ్డి గాంధీ భవన్‌కు వచ్చారు.

కొండా మురళి అంశంపై కమిటీ ముందు వాదనలు వినిపించారు. కాంగ్రెస్ నేతలను ఉద్దేశించి తాను చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం కావడంతో ఇటీవల క్రమశిక్షణ కమిటీ ఇచ్చిన నోటీసుకు కొండా మురళి వివరణ ఇచ్చారు. తాజాగా ఆయన వ్యతిరేక వర్గం ఇవాళ వాదనలు వినిపించింది.



# బాబు 'బనకచర్ల' వ్యూహం..

## తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యర్థులు షేక్!

హైదరాబాద్ / అమరావతి : ఏపీ సీఎం చంద్రబాబు భారీ వ్యూహం పన్నారా? ఏకకాలంలో ఇద్దరు ప్రత్యర్థులను దెబ్బతీశారా? తెలంగాణలో కెసిఆర్, ఏపీలో జగన్మోహన్ రెడ్డిని ఆత్మ రక్షణలో నెట్టారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. జరుగుతున్న పరిణామాలు అలానే ఉన్నాయి. పోలవరం- బనకచర్ల ప్రాజెక్ట్ అనుసంధానం వెనుక భారీ వ్యూహం ఉన్నట్లు అర్థమవుతోంది. ఈ ప్రాజెక్టుతో రాయలసీమ సస్యశ్యామలం అవుతుందని చంద్రబాబు భావిస్తున్నారు. అయితే తెలంగాణ జల హక్కులను కాలరాసే విధంగా ఉందని రేవంత్ అభిప్రాయపడుతున్నారు. ఇక్కడ రాయలసీమ ప్రయోజనాల కోసం అంటూ చంద్రబాబు చెప్పడం ద్వారా జగన్మోహన్ రెడ్డిని దెబ్బ కొడుతున్నారు. తెలంగాణ జల ప్రయోజనాలను విస్మరించారని కెసిఆర్ పై రేవంత్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తుతున్నారు.

**రాజకీయ స్నేహం..** ఉభయ తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులుగా వ్యవహరించిన జగన్మోహన్ రెడ్డి, కెసిఆర్ ల మధ్య రాజకీయ స్నేహం కొనసాగింది. అయితే అది రాష్ట్ర ప్రయోజనాలకు కాకుండా.. రాజకీయ ప్రయోజనాలకు పరిమితం అయిందన్న విమర్శ ఉంది. ఇద్దరూ కలిసి విందులు చేశారు. వినోదాల్లో పంచుకున్నారు. కానీ ఆయా రాష్ట్రాల ప్రయోజనాలను మాత్రం దెబ్బ తీశారు.

ఇప్పుడు దీనినే ఉభయ రాష్ట్రాల్లో ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఇద్దరు సీఎంలు నిర్ణయించుకున్నట్లు అర్థమవుతోంది. తాజాగా తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో కెసిఆర్ రాజీ పడిపోయారని విమర్శించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల జల పంపకాల్లో.. తెలంగాణను ప్రత్యేకంగా పరిగణించాలన్న చిన్న లాజిక్ ను కెసిఆర్ మరిచిపోయారని ఎద్దేవా చేశారు. హైదరాబాద్ నీటి వాటాను పోను.. మిగతా జలాలను తెలుగు రాష్ట్రాలు పంచుకోవాల్సిన విషయం కెసిఆర్ కు తెలియదా అంటూ నిలదీశారు. తద్వారా తెలంగాణ సమాజంలో కేసీఆర్ వ్యవహార శైలిని ఎండగట్టారు. రాజకీయంగా దెబ్బతీశారు.

**రాయలసీమలో జగన్ కు దెబ్బ :** రాయలసీమ ప్రయోజనాల కోసమే బనకచర్ల ప్రాజెక్టు అంటూ చెబుతున్నారు ఏపీ సీఎం చంద్రబాబు. అయితే తెలంగాణ నుంచి అభ్యంతరాలు వ్యక్తం అవుతున్న తరుణంలో.. కేంద్ర ప్రభుత్వం వ్యూహాత్మకంగా అనుమతులు నిలిపివేసింది. తద్వారా తెలుగు రాష్ట్రాల్లో బనకచర్ల ప్రాజెక్ట్ అంశం విస్తృత ప్రచారంగా మారింది. ఏపీ ప్రయోజనాలకు ఈ ప్రాజెక్టు కీలకం. ముఖ్యంగా రాయలసీమ ప్రయోజనాల కోసం ఈ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలన్నది చంద్రబాబు లక్ష్యం. తద్వారా ఇన్ని రోజులు జగన్మోహన్ రెడ్డి చేయలేని పని.. తాను చేసే ప్రయత్నం చేస్తున్నానని రాయలసీమ సమాజం గుర్తించేలా చేస్తున్నారు చంద్రబాబు. అదే సమయంలో జగన్మోహన్ రెడ్డిని ఆత్మరక్షణలో పడేశారు. ఇన్ని రోజులు తన రాజకీయ ప్రయోజనాల కోసం రాయలసీమను వాడుకున్నారు జగన్. ఇప్పుడు అదే రాయలసీమ కోసం చంద్రబాబు సర్కార్ ఒక ప్రాజెక్టును తలపెడితే.. దానికి అభ్యంతరాలు వస్తుంటే.. కనీసం నోరు తెరవడం లేదు. ఇది పొలిటికల్ గా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి డామేజ్ చేస్తుందని ఆ పార్టీ శ్రేణులు ఆందోళనతో ఉన్నాయి.

**హైదరాబాదులో పట్టు బిగించే వ్యూహం..** హైదరాబాదులో సీమాంధ్ర సెటిలర్స్ అధికం. అయితే ఇప్పుడు రేవంత్ సర్కార్ హైదరాబాద్ జలాల కోసం గట్టిగానే పోరాటం చేస్తోంది. కేవలం చంద్రబాబు బనకచర్ల ప్రాజెక్టు ప్రతిపాదన వల్లే.. హైదరాబాద్ నగరానికి కేసీఆర్ అన్యాయం చేశారని రేవంత్ వ్యాఖ్యానించారు. గత ఎన్నికల్లో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే కెసిఆర్ పార్టీ ఎక్కువగా గెలిచింది. కానీ అదే హైదరాబాద్ జల అవసరాలను కెసిఆర్ విస్మరించారని రేవంత్ చెబుతున్నారు. ఈ అంశం ప్రజల్లోకి వెళితే హైదరాబాదులో కెసిఆర్ పార్టీకి డ్యామేజ్ తప్పదు. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో కేసీఆర్ పార్టీ బలహీనపడుతోంది. అంటే చంద్రబాబు వేసిన వ్యూహానికి తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ ప్రత్యర్థులు చిత్తయ్యేలా ఉన్నారు. అయితే చంద్రబాబు వ్యూహానికి వారు విరుగుడుగా ఎలాంటి వ్యూహాలు రూపొందిస్తారో చూడాలి.




## ఫోన్ ట్యాపింగ్ కేసు.. ఢిల్లీకి సిట్ అధికారులు.. ఎందుకంటే

హైదరాబాద్, జులై 10: ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసుకు సంబంధించి సిట్ అధికారులు ఢిల్లీకి వెళ్లారు. వెస్ట్ జోన్ డీసీపీ విజయ్ కుమార్, సిట్ అధికారి ఏసీపీ వెంకటగిరి ఢిల్లీకి చేరుకున్నారు. ఇప్పటివరకూ ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావును సిట్ అధికారులు ఐదుసార్లు విచారించారు. ఐదు సార్లు సుమారు నలభై గంటలపాటు ప్రభాకర్‌రావును విచారించింది సిట్. అయితే విచారణలో సమాధానాలు చెప్పకుండా అధికారుల సహనాన్ని పరీక్షించారు ఎస్ఐబీ మాజీ చీఫ్. ఈ క్రమంలో ప్రభాకర్ రావు విచారణకు సహకరించకపోవడంతో అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. సుప్రీంకోర్టులో ప్రభాకర్ రావుకు ఉన్న రిలీఫ్ రద్దు చేయాలంటూ పిటిషన్ దాఖలు చేయాలని సిట్ అధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగానే డీసీపీ విజయ్ కుమార్, ఏసీపీ వెంకటగిరి ఢిల్లీకి వెళ్లారు. ఈరోజు (గురువారం) సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నారు సిట్ అధికారులు. పిటిషన్‌లో ప్రభాకర్ రావు మినహాయింపులు రద్దు చేయాలని కోరనున్నారు. ప్రభాకర్ రావును కస్టోడియల్ విచారణ చేస్తే కీలకమైన విషయాలు వెలుగు చూస్తాయని సిట్ అధికారులు భావిస్తున్నారు. మరోవైపు ప్రభాకర్ రావును ఆగస్టు ఐదు వరకు అరెస్టు చేయవద్దంటూ సుప్రీంకోర్టు ఇదివరకే ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో సిట్ అధికారులు ఢిల్లీకి వెళ్లి సుప్రీంకోర్టులో పిటిషన్ వేయాలని నిర్ణయం తీసుకున్నారు. అయితే, ఇప్పటివరకూ సిట్ అధికారులను ప్రభాకర్ రావు తప్పుదోవ పట్టించే విధంగానే సమాధానాలు చెబుతూ వచ్చారు. తనకేమీ సంబంధం లేదని, తన పైస్థాయి అధికారులు ఇచ్చిన ఆదేశాలనే అమలు చేశానని, వ్యక్తిగతంగా ఫోన్ ట్యాపింగ్ చేయమంటూ ఎవరికీ ఉత్తర్వులు ఇవ్వలేదంటూ చెప్పుకొచ్చారు. కానీ ఈ కేసులో అరెస్ట్ అయిన ఐదుగురు నిందితులు ఇచ్చిన స్టేట్‌మెంట్ ప్రకారం.. ప్రభాకర్ రావు ఆదేశాల మేరకే తాము ఇదంతా చేశామని చెప్పుకొచ్చారు. ఈ క్రమంలో ఆగస్టు 5 వరకు ప్రభాకర్ రావును అరెస్ట్ చేయొద్దంటూ సుప్రీంకోర్టు ఆదేశాలు ఇవ్వడంతో.. సిట్ అధికారులకు ఆయన డిఫెన్సివ్ మోడ్‌లోనే సమాధానాలు చెబుతూ వస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సుప్రీం ఇచ్చిన మినహాయింపులను రద్దు చేస్తే ఎస్ఐబీ మాజీ చీఫ్‌ను కస్టోడియల్ విచారణకు తీసుకునే అవకాశం ఉంటుంది. ఈ మేరకు ప్రభాకర్ రావుకు ఇచ్చిన మినహాయింపులు రద్దు చేయాలని సుప్రీంకోర్టులో పిటిషన్ వేయాలని సిట్ అధికారులు నిర్ణయించారు.




హైదరాబాద్: బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్లకు సంబంధించి 29 మంది సినీ సెలబ్రిటీలు, కంపెనీలపై ఈడీ కేసులు నమోదు చేసింది. సినీ నటులు విజయ్ దేవరకొండ, రానా, మంచు లక్ష్మి, ప్రకాశ్‌రాజ్, నిధి అగర్వాల్, అనన్య నాగళ్ల, శ్రీముఖి తదితరులపై సైబరాబాద్ పోలీసుల ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ విచారణ జరపనుంది. సినీ సెలబ్రిటీలు, యూట్యూబర్స్, ఇన్‌ఫ్లూయెన్సర్లను పీఎంఎల్ఏ కింద విచారించనుంది. నిషేధిత బెట్టింగ్ యాప్‌లకు ప్రచారం చేసిన వ్యవహారంలో యాంకర్లు, బుల్లితెర నటులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ల నుంచి సినీ ప్రముఖుల వరకూ అందరిపైనా ఇప్పటికే తెలంగాణ పోలీసులు కేసులు నమోదు చేశారు. నటులు రానా దగ్గుబాటి, ప్రకాశ్‌రాజ్, విజయ్ దేవరకొండ, మంచు లక్ష్మి, ప్రణీత, నిధి అగర్వాల్, అనన్య నాగళ్ల, వైకాపా అధికార ప్రతినిధి శ్యామల, బుల్లితెర నటులు, ఇన్‌ఫ్లుయెన్సర్లు శ్రీముఖి, వర్షిణి సౌందరరాజన్, సిరి హనుమంతు, వసంతి కృష్ణన్, శోభాశెట్టి, అమృతాచౌదరి, నయనిపావని, నేహాపఠాన్, పండు, పద్మావతి, ఇమ్రాన్‌ఖాన్, విష్ణుప్రియ, హర్షసాయి, భయ్యా సన్నీయాదవ్, టేస్టీ తేజ, రీతూచౌదరి, బండారు సుప్రీత తదితరుల పేర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. బీఎన్ఎస్‌లోని 318(4), 112, రెడ్‌విత్ 49, తెలంగాణ గేమింగ్ యాక్ట్‌లోని 3, 3(ఎ), 4 సెక్షన్లు, ఐటీ చట్టం 2000, 2008లోని 66డి సెక్షన్ల కింద ఈ కేసు నమోదైంది.

హైదరాబాద్ పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ దర్యాప్తు చేయనుంది. చట్టవిరుద్ధ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవాలంటూ సెలబ్రిటీలు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు విస్తృతంగా ప్రచారం చేశారని ఆరోపణలున్నాయి. ఇందుకు వారు భారీగా కమీషన్, పారితోషికం తీసుకున్నారని పలువురు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ యాప్‌ల కారణంగా అప్పులపాలై అనేక మంది ఆత్మహత్యలు చేసుకోగా, చాలా కుటుంబాల్లో ఆర్థిక సంక్షోభం నెలకొందని పోలీసులు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు.




కరీంనగర్: మానకొండూరు నియోజకవర్గంలో పొలిటికల్ హీట్ ఒక్కసారిగా పెరిగిపోయింది. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మధ్య వార్ నడుస్తోంది. కామలీలల కవ్వంపల్లి అంటూ బీఆర్ఎస్ పోస్టర్ రిలీజ్ చేయగా.. రాసలీలల రసమయి అంటూ కాంగ్రెస్ పార్టీ పోస్టర్ రిలీజ్ చేసింది. ప్రస్తుతం ఈ రెండు పార్టీ నేతల పోస్టర్లు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి.

కాగా, గుండ్లపల్లి నుంచి పొత్తూరు వరకూ డబుల్ రోడ్ విషయంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మధ్య వివాదం నడుస్తోంది. 'రోడ్డు ఇంకెప్పుడు పూర్తిచేస్తావ్?.. మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కమీషన్ల నారాయణ' అంటూ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ తీవ్ర విమర్శలు చేశారు. అంతేకాకుండా సోషల్ మీడియాలో కామలీలల కవ్వంపల్లి అంటూ బీఆర్ఎస్ పోస్టర్ రిలీజ్ చేసింది. దీంతో ఎమ్మెల్యే వర్గం ప్రతి దాడికి దిగింది. ప్రతీకారంగా రాసలీలల రసమయి అంటూ కాంగ్రెస్ పోస్టర్ రిలీజ్ చేసింది. ఇలా ఈ రెండు పార్టీల నేతల మాటలు వివాదానికి తెరలేపాయి. మరోవైపు సోషల్ మీడియాలోనూ కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ గా వార్ నడుస్తోంది.




హైదరాబాద్: నగరంలోని కూకట్‌పల్లి పరిధిలో జరిగిన కల్తీ కల్లు ఘటన నేపథ్యంలో ఎక్సైజ్‌శాఖ అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టారు. ఐదు బృందాలుగా ఏర్పడి వివిధ కల్లు దుకాణాల నుంచి నమూనాలను సేకరించి.. నారాయణగూడలోని ల్యాబ్‌లో పరీక్షలు నిర్వహించారు. కొన్ని దుకాణాల్లో ఆల్ప్రాజోలం మత్తుమందును కలిపి కల్లు కల్తీ చేసినట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో పలు దుకాణాల లైసెన్స్‌లను రద్దు చేసినట్లు బాలానగర్ ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు.




హైదరాబాద్: మాజీ సీఎం, భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ సోమాజిగూడలోని యశోద ఆసుపత్రిలో చేరారు. వైద్యుల సూచన మేరకు ఆయన అడ్మిట్ అయ్యారు. కేసీఆర్‌కు మరోసారి డాక్టర్లు వైద్య పరీక్షలు చేస్తున్నారు. ఈ నెల 3న కూడా ఆయన యశోద ఆసుపత్రిలో చేరారు. అప్పుడు బ్లడ్ షుగర్, సోడియం స్థాయిలు మానిటర్ చేయడానికి రెండ్రోజులు ఆసుపత్రిలోనే ఉండాలని వైద్యులు సూచించారు. ఆరోగ్యం కుదుటపడటంతో ఈనెల 5న డిశ్చార్జి అయ్యారు. వారం రోజుల పాటు విశ్రాంతి తీసుకోవాలని, తర్వాత తర్వాత పరీక్షలు చేయాల్సి ఉంటుందని డిశ్చార్జి సమయంలో వైద్యులు తెలిపారు. ఈక్రమంలో వైద్య పరీక్షల కోసం కేసీఆర్ మళ్లీ యశోద ఆసుపత్రిలో చేరారు.






## రూ.5కే ఇడ్లీ, పూరి, ఉప్మా.. ఇందిరమ్మ క్యాంటీన్లలో అల్పాహారం

హైదరాబాద్ : ఇందిరమ్మ క్యాంటీన్లలో అల్పాహారం అందించాలని జీహెచ్ఎంసీ నిర్ణయించింది. హరే కృష్ణ మూవ్‌మెంట్ భాగస్వామ్యంతో గ్రేటర్‌లోని 150 కేంద్రాల్లో త్వరలో అల్పాహారం(టిఫిన్) అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. భోజనంలానే రూ.5కే పౌరులకు అల్పాహారం అందించనున్నారు. ఒక్కో అల్పాహారానికి రూ.19 ఖర్చు కానుండగా.. అందులో రూ.14 జీహెచ్ఎంసీ భరించనుంది.


లబ్ధిదారుల నుంచి రూ.5 వసూలు చేస్తారు. ఇడ్లీ, ఉప్మా, పొంగల్, పూరి, వడ వంటివి క్యాంటీన్లలో ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు అందించనున్నారు. ఇందుకు ఇప్పటికే ఉన్న అన్నపూర్ణ క్యాంటీన్లను ఆధునీకరిస్తున్నారు. 10/40 పరిమాణంలో 60 కేంద్రాలు, 10/20 పరిమాణంలో 79 కేంద్రాలు సిద్ధమవుతున్నాయి. వీటికి రూ.11.29 కోట్లు ఖర్చు కానుంది. మరో 11 కేంద్రాలను ఇందిరమ్మ క్యాంటీన్లుగా మార్చేందుకు రూ.13.75 లక్షలు వెచ్చిస్తున్నారు. మొత్తంగా క్యాంటీన్ల ఏర్పాటుకు రూ.11.43 కోట్లు ఖర్చు కానుండగా.. జూలై మూడో వారంలో రూ.3 కోట్లు, ఆగస్టు మొదటి వారంలో రూ.4 కోట్లు, ఆగస్టు చివరి వారంలో రూ.4.43 కోట్లు విడుదల చేయాలని భావిస్తున్నారు. గురువారం జరిగే స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఈ ప్రతిపాదనపై చర్చించనున్నారు. అల్పాహారానికి యేటా రూ.15.33 కోట్లు అవసరమని జీహెచ్ఎంసీ అంచనా వేసింది. ప్రస్తుతం గ్రేటర్‌లోని 150 కేంద్రాల్లో మధ్యాహ్నం భోజనం రూ.5కే అందిస్తున్నారు. ఒక్కో భోజనానికి రూ.27.50 ఖర్చవుతుండగా.. రూ.22.50 జీహెచ్ఎంసీ భరిస్తూ.. లబ్ధిదారుల నుంచి రూ.5 వసూలు చేస్తున్నారు. అన్నం, ఏదైనా కూర, పప్పు, పచ్చడి అందిస్తున్నారు. నిత్యం 30 వేల మందికిపైగా ఇందిరమ్మ క్యాంటీన్లలో భోజనం చేస్తున్నారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో సత్తా చాటుదాం..



హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో సత్తా చాటుదామని బీఆర్ఎస్ శ్రేణులకు ఎమ్మెల్యే హరీశ్‌రావు పిలుపునిచ్చారు. మాజీ మంత్రులు మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్(%దీ=ా%) హైదరాబాద్ మైనార్టీ విభాగం సమావేశాన్ని తెలంగాణ భవన్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ తమది సెక్యులర్ ప్రభుత్వమని చెప్పుకొనే కాంగ్రెస్.. 20 నెలలు గడుస్తున్నా ఒక్క మైనార్టీనేతను మంత్రిగా చేయలేదన్నారు. హైడ్రా, మూసీ పేర్లతో రేవంత్ సర్కార్ ముస్లింల ఇళ్లను కూల్చి వారికి గూడులేకుండా చేసిందన్నారు. మైనార్టీల కోసం ఎన్నికలప్పుడు హామీలు గుప్పించిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చాక వాటి అమలును పట్టించుకోవడంలేదని విమర్శించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ కు బుద్ధిచెప్పాలని మహమూద్‌అలీ, తలసాని, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ మైనార్టీలను కోరారు.

## కల్తీకల్లు మృతుల కుటుంబాలకు ప్రభుత్వం పరిహారం ఇవ్వాలి: రామచందర్‌రావు



హైదరాబాద్: కూకట్‌పల్లి కల్తీ కల్లు ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.10 లక్షలు, బాధితులకు రూ.లక్ష చొప్పున పరిహారం ఇవ్వాలని భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. "కల్తీ కల్లు ఘటనలో అనధికారికంగా ఆరుగురు మృతి చెందారు. ఒకటి రెండు సీసాల కల్లు తాగిన వారి కిడ్నీలు దెబ్బతిన్నాయి. కల్తీ కల్లులో సైకో ట్రాఫిక్ సబ్ స్టన్స్ కలిపినట్లు స్పష్టంగా తెలుస్తోంది. ఎక్సైజ్ శాఖ కల్లు కాంపౌండ్ వారితో కుమ్మక్కైంది. ఈ ఘటన మొదటిసారి కాదు.. గతంలోనూ వెలుగు చూశాయి. ఎక్సైజ్ అధికారులు రోజూ కల్లు కాంపౌండ్‌లలో తనిఖీలు చేయాలి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వంచర్యలు తీసుకోవాలి" అని రామచందర్‌రావు అన్నారు.

## 'కుర్చీ ఇప్పుడు ఖాళీగా లేదు' అని ఆయనే అన్నారుగా..: కర్ణాటక సీఎం సిద్ధరామయ్య

కర్ణాటకలో సీఎంగా ఐదేళ్ల పాటు తానే కొనసాగుతానని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య (%ాఅఎఝతీఝఝఝష్ట%) తేల్చి చెప్పారు. ఓ ఆంగ్ల ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో నాయకత్వ మార్పుపై వస్తున్న ఊహాగానాలను ఆయన కొట్టిపారేశారు. డీకే శివకుమార్‌ను ముఖ్యమంత్రిగా చేయడం కోసం తనను కాంగ్రెస్ హైకమాండ్ రాజీనామా చేయమని కోరినట్లు జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమన్నారు. "సీఎంగా నేను ఐదేళ్లు ఉంటాను. ఈ విషయాన్ని నేను ఎప్పుడో స్పష్టంగా చెప్పాను. జులై 2వ తేదీన కూడా దీనిపై ప్రకటన విడుదల చేశాను. ఆ సమయంలో డీకే శివకుమార్ కూడా అక్కడే ఉన్నారు. ఆయన కూడా పోటీదారే. అందులో తప్పు ఏముంది. 'కుర్చీ ఇప్పుడు ఖాళీగా లేదు' అని ఆయనే అన్నారు" అని పేర్కొన్నారు. నాయకత్వం రొటేషన్‌పై పార్టీ హైకమాండ్ టైమ్‌లైన్ లేదా సూచనలు ఏమీ చేయలేదని సిద్ధరామయ్య వెల్లడించారు. రెండున్నర సంవత్సరాల అంశాన్ని ఎవరూ నిర్ణయించలేదన్నారు. హైకమాండ్ నిర్ణయం తీసుకొంటే తమకు చెబుతుందని.. వాటిని తాము అమలుచేస్తామన్నారు. ఇక పార్టీ నాయకత్వంపై కాంగ్రెస్ రణ్‌దీప్ సుర్జేవాలా ఎటువంటి ప్రశ్నలు లేవనెత్తలేదన్నారు. డీకే శివకుమార్‌కు మద్దతు ఇచ్చే కొద్దిమంది ఎమ్మెల్యేలు ఉన్నారని అంగీకరించారు. తాను నేడు రాహుల్‌గాంధీ అపాయింట్‌మెంట్ కోరానని అయితే ఇప్పటివరకు దానిపై ఎలాంటి కన్ఫర్మేషన్ లేదని చెప్పారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి ఆరోగ్యకరంగానే ఉందని సిద్ధరామయ్య వివరించారు. నిధుల కొరత లేదని.. తగినన్ని నిల్వలు ఉన్నాయన్నారు. ఒకట్రెండ్ ఇబ్బందులు ఉండొచ్చని.. అంతమాత్రాన రాష్ట్ర ప్రభుత్వం దివాలా తీసినట్లు కాదని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు ఏజెన్సీలను దుర్వినియోగం చేస్తోందని చెప్పారు. ముఖ్యంగా ఈడీ కాంగ్రెస్ నాయకులనే టార్గెట్ చేస్తోందని ఆరోపించారు. మరోవైపు ముఖ్యమంత్రిగా కొనసాగుతానని సిద్ధరామయ్య ప్రకటించిన అనంతరం తాను చేసేది ఏమీలేదని ఆ పీఠంపై కన్నేసిన డీకే శివకుమార్ నిర్వేదంతో వ్యాఖ్యలు చేశారు. తాను చేసిన ప్రయత్నాలు విఫలమైనా, ప్రార్థనలు విఫలం కాలేదని ఆయన పేర్కొన్నారు. రెండున్నరేళ్ల అనంతరం ముఖ్యమంత్రి పీఠం విషయంలో మార్పు ఉంటుందని కాంగ్రెస్ అధికారంలో వచ్చినప్పటినుంచి ప్రచారం జరుగుతోంది.



## ప్రతిభ ఉన్నా చిత్రసీమలో కొనసాగలేని శ్రీధర్ - జూలై 11...సూరపనేని శ్రీధర్ వర్ధంతి




సినిమా రంగంలో సమర్థత ఉండీ తగిన గుర్తింపు, అవకాశాలు రాని కళాకారులు ఎందరో. అలాంటి వారిలో అగ్ర భాగాన నిలుస్తాడు ఒకనాటి హీరో శ్రీధర్ (ముత్యాల ముగ్గు సినిమా ఫేం). చిత్రసీమలో ముత్యాల ముగ్గు చిత్రంతో అడుగిడి, సహజ నటునిగా పేరెన్నిక గన్నా, మూడు దశాబ్దాల కాలంలో ఆయన 150 చిత్రాలలో విభిన్న పాత్రలలో రాణించినా, ఆశించిన స్థాయిలో, రీతిలో ముందుకు వెళ్ళలేక పోయాడు. ప్రతిభావంతమైన కళాకారుడైన శ్రీధర్ ఏనాడు వేషాలకోసం అర్థించలేదు. తనకు అవకాశం వచ్చిన సినిమాలలో నటించాడు. హీరోవేషాలు వస్తున్నప్పుడు శ్రీధర్‌చే ఎన్టీఆర్ తనస్వంత చిత్రం శ్రీరామ పట్టాభిషేకంలో గుహుడు వేషం వేయించారు. దాంతో శ్రీధర్‌కు వచ్చే హీరోవేషాలు కూడా రాకుండా పోయాయి. అంతకుముందు ఎన్టీఆర్ గుహుడు వేషానికి డ్రైవర్ రాముడులో సెకండ్‌హీరో వేషానికి లింకుపెట్టి ఇచ్చారు. కానీ, డ్రైవర్ రాముడు చిత్రం హిట్‌కూడా శ్రీధర్‌ను మరిన్ని చిత్రాలలో హీరోని చేయలేక పోయాయి. సహాయ పాత్రలను తెచ్చి పెట్టాయి. ఇలా శ్రీధర్‌కు తాను నటించిన హిట్ చిత్రాలు ఆశించిన ప్రయోజనాన్ని కల్పించలేదు. జస్టిస్ చౌదరి సినిమాలో ఎన్టీ రామారావు కొడుకుగా నటించాడు. ఒకప్పుడు కృష్ణ నటించిన సినిమాలన్నింటి లోనూ శ్రీధర్ కనిపించేవాడు. అమెరికా అమ్మాయి, అడవి రాముడు, జస్టిస్ చౌదరి, కరుణామయుడు, ఈనాడు, బొమ్మరిల్లు, సీతా మహాలక్ష్మీ, యశోధకృష్ణ వంటి చిత్రాలు పేరు తెచ్చి పెట్టాయి. కృష్ణా జిల్లా, ఉయ్యూరు సమీపంలోని కుమ్మమూరు గ్రామంలో 1939 డిసెంబర్ 21 న ఒక దిగువ మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన శ్రీధర్, తల్లా? పెళ్లామా? చిత్రంతో తెలుగు జాతి మనది అనే పాటలో విద్యార్థిగా సినీ రంగ ప్రవేశం చేశాడు. మచిలీపట్నంలో ఇంటర్మీడియట్ పూర్తిచేసుకొని 1964లో హైదరాబాదుకు వచ్చి ప్రభుత్వ పనుల శాఖలో గుమాస్తాగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించాడు. ఉద్యోగం చేస్తూనే సాయంత్రం కళాశాలకు వెళుతూ బి.ఏ పూర్తిచేశాడు.

కళాశాల సాంస్కృతిక విభాగంలో క్రియా శీలకంగా పనిచేస్తూ కార్యదర్శి అయ్యాడు. పరీక్ష, చీకటి తెరలు, అఘాయిత్యం, సాలెగూడు, మండే కొండలు మొదలైన అనేక నాటకాలలో ప్రధాన పాత్రలు పోషించాడు. ఈయన ప్రధానపాత్ర పోషించిన మంచుతెర అనే నాటకానికి గాను ఆంధ్ర నాటక కళా పరిషత్ నుండి ద్వితీయ బహుమతి అందుకున్నాడు. తల్లా? పెళ్లామా? (1970), విశాలి (1973), చక్రవాకం (1974), దేవదాసు (1974), మాంగల్య భాగ్యం (1974), ముత్యాల ముగ్గు (1975), యశోద కృష్ణ (1975), శ్రీరామాంజనేయ యుద్ధం (1975), అమెరికా అమ్మాయి (1976), దొరలు దొంగలు (1976), బంగారు మనిషి (1976), భక్త కన్నప్ప (1976), వెలుగు బాటలు (1976), అడవి రాముడు (1977), తరం మారింది (1977), మనవడి కోసం (1977), అంగడి బొమ్మ (1978), ఇంద్ర ధనుస్సు (1978), కరుణా మయుడు (1978), గోరంత దీపం (1978), పల్లెసీమ (1978) బొమ్మరిల్లు (1978), శ్రీరామ పట్టాభిషేకం (1978), సీతామాలక్ష్మి (1978), జూదగాడు (1979), డ్రైవర్ రాముడు (1979), బొట్టు కాటుక (1979), ఆడది గడప దాటితే (1980), కలియుగ రావణాసురుడు (1980) కోడళ్ళొస్తున్నారు జాగ్రత్త (1980), పొదరిల్లు (1980), బంగారు బావ (1980), మంచిని పెంచాలి (1980), సంధ్య (1980), సంసార బంధం (1980), దేవుడు మావయ్య (1981), మా పెళ్ళి కథ (1981), ఆపద్బాంధవులు (1982), ఈనాడు (1982), జస్టిస్ చౌదరి (1982), డాక్టర్ మాలతి (1982), కిరాయి కోటిగాడు (1983), నేటి చరిత్ర (1990), గోవిందా గోవిందా (1994) తదితర చిత్రాలలో ప్రతిభా వంతంగా నటించాడు. మూడు దశాబ్దాల పాటు సాగిన సినీ ప్రస్థానంలో సుమారు 150 సినిమాలలో నటించిన శ్రీధర్ తెలుగు సినిమా రంగములో ముత్యాల ముగ్గు సినిమాతో గుర్తింపు పొందాడు. సినిమాలలో సరైన అవకాశాలు లేక, టివి సీరియల్ల కోసం అవకాశం వెతుక్కుంటూ వచ్చినా, నటించ డానికి ఇష్టపడలేదు.

ఆ సీరియళ్ళ నటిస్తే శ్రమ ఎక్కువ తప్పితే ఆర్థికంగా ఫలితాలు బహు తక్కువ అని తెలుసుకుని నటనకు దూరంగా ఉ న్నాడు. స్వంతచిత్ర నిర్మాణాలపై ఆసక్తి కనబరచలేదు. చివరికి రియల్ ఎస్టేట్ వ్యాపార రంగంలో ఉండి, విభిన్న పాత్రల్లో కనిపించిన శ్రీధర్ నటించిన చివరి చిత్రం గోవిందా గోవిందా. ఆయన ఊపిరితిత్తుల క్యాన్సర్ తో బాధపడుతూ, చికిత్స పొందుతుండగా గుండెపోటుతో జూలై 11, 2007 న మరణించాడు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# తెలంగాణ ప్రజలను భయాందోళనలకు గురి చేసిన స్కై లాబ్


## జూలై 11... స్కైల్యాబ్ భూవాతావరణం లోకి ప్రవేశించి విచ్ఛిన్నమైన దినం



స్కై లాబ్... ఈ పేరు నేటి తరానికి అంతగా తెలియక పోవచ్చు. దాదాపు అర్ధ శతాబ్ది క్రితం జనజీవనాన్ని అతలాకుతలం చేసిన సంఘటన. ప్రధానంగా తెలంగాణ అదీ ఉత్తర తెలంగాణ ప్రజలను తీవ్ర భయ భ్రాంతులకు గురిచేసిన నేపథ్యం. యాభై ఏళ్ల పైబడిన వారిని కదిలిస్తే ఈ నాటికీ వెంటనే గుర్తుకు వచ్చి, ఆనాటి తీవ్ర భయాందోళనల పరిస్థితులను కళ్ళకు కట్టినట్లు వివరించే అరుదైన సంఘటనల అపురూప అపూర్వ దృశ్యం. అంతరిక్షం లో మానవులచే నిర్మించిన పరిశోధనా ఉపగ్రహం లాంటి పరికరాల నిర్మిత అతిపెద్ద కేంద్రాన్ని స్కైలాబ్ అంటారు. భూమి గురుత్వాకర్షణ శక్తిని ఛేదించి మొదటి కృత్రిమ ఉపగ్రహం స్పుత్నిక్-1ని 1957-అక్టోబర్‌లో అప్పటి సోవియట్ యూనియన్ పంపించడంతో అంతరిక్ష పరిశోధనలు వేగం పుంజు కున్నాయి. ఆ తర్వాత అంతరిక్షం లోనే మానవుడు పరిశోధనా కేంద్రాన్ని (స్కైలాబ్) స్థాపించి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం, దానిలోనే ఉంటూ పరిశోధనలు చేస్తూ సౌర కుటుంబాన్ని గురించి ఎన్నో కొత్త విషయాలను తెలుసు కోవడానికి ఈ విజ్ఞానం ఉ పయోగించు కున్నాడు. ఈ కేంద్రాన్ని అమెరికా, రష్యా, ఇతర అభివృద్ధి చెందిన దేశాలు అంతరిక్షంలో పరిశోధనలు చేయడానికి నిర్మించాయి. ఈ అంతరిక్ష కేంద్రం భూమి పరిభ్రమించే లోపలి కక్ష్యతో నిర్మించబడింది. ఈ అంతరిక్ష కేంద్రం భూమికి 278 నుండి 460 కి. మీ. ఎత్తులో ఉండి, సరాసరి గంటకు 27, 743 కి. మీ. వేగంతో పరిభ్రమిస్తూ ఉండేది. ఇది రోజుకు 16 సార్లు భూమి చుట్టూ ప్రదక్షిణలు చేసేది. ఈ కేంద్రంలో వ్యోమగాములు ఉంటూ, భూగోళ వాతావరణ అధ్యయనానికి, సమాచార ప్రసార సాధనంగా స్కై లాబ్ ను వినియోగించు కున్నారు. స్కైలాబ్ మొదటి యునైటెడ్ స్టేట్స్ అంతరిక్ష కేంద్రం, నాసా ప్రారంభించింది. మే 14 1973, ఫిబ్రవరి 1974 మధ్య 24 వారాల పాటు క్రియాశీలంగా ఉంది. ఇది అంతరిక్ష పరిశోధక నౌక. అమెరికా అంతరిక్ష సంస్థ నాసా దీన్ని రూపొందించింది. కక్ష్యలోకి ప్రవేశపెట్టిన దీని జీవిత కాలం ఏడేళ్లు. అయితే అంతరిక్షం లోకి పంపిన తర్వాత దీన్ని భూమి మీదకు తిరిగి సురక్షితంగా ఎలా తీసుకు రావాలన్న విషయంలో నాసా సరిగా వ్యవహరించలేదు. అయితే ల్యాబ్ గతి తప్పడం మొదలైంది. ఉ పగ్రహా జీవిత కాలం ప్రణాళిక ప్రకారం 1974 లో స్కైల్యాబ్ జీవిత కాలం ముగిసిన తరువాత 8 -10 ఏళ్ళ వరకు కక్ష్యలోనే ఉండాల్సి ఉండగా, సౌర కార్యకలాపాలు ఎక్కువ కావడంతో ఉచ్ఛస్థాయిల్లో వాతావరణం పలుచబడి జీవిత కాలం సమయానికంటే ముందే స్కైల్యాబ్ భూ వాతావరణం లోకి ప్రవేశించింది. 1978 చివరలో స్కైలాబ్ నియంత్రణ కోల్పోయి గతి తప్పడం గుర్తించారు. చివరకు అది వేగంగా వచ్చి భూమిని ఢీకొనడం తప్ప వేరే మార్గం లేదని అంతా భావించారు. అదే విషయాన్ని నాటి ప్రధాన ప్రసార మాధ్యమం అయిన రేడియోల ద్వారా పదే పదే ప్రకటింప చేశారు. ఫలితంగా ప్రజలు విపరీత భయాందోళనలకు గురయ్యారు. ఇంకా భారత భూభాగంలోనే ఢీ కొంటుందన్న ప్రచారం ఊపందుకుంది. అదే సమయంలో తెలంగాణ ప్రాంతంలో... నిజామాబాద్ ఎక్కడైనా పడే అవకాశం ఉందంటూ పత్రికల్లో వెలువడ్డ వార్తలు మరింత ఆందోళనకు దారితీసింది. నాడు ఊరూరికీ పత్రికలు రాకున్నా, ఈ వార్తలు దావనంలా వ్యాపించాయి. నాటి ప్రధాన ప్రసార సాధనమైన రేడియో ఉన్న ఇళ్ళ వద్ద జనం గుమి కూడడం, భయాందోళనలకు లోనవడం సర్వ సాధారణంగా మారింది. తెలంగాణ మొత్తం స్కైలాబ్ బారిన పడుతుందన్న శరవేగ ప్రచారం చదువుకున్న, చదువులేని వారు అన్న తేడా లేకుండా తీవ్ర ఆందోళనలో ముంచెత్తి వేసింది. 1979లో జరిగిన ఈ సంఘటన మూడు వారాల పాటు ప్రతి ఆవాస ప్రాంతంలో ఆబాల గోపాలాన్ని కంటికి కునుకు లేకుండా చేసింది. స్కైలాబ్ వలన భూమికి భారీ నష్టం కలుగుతుందని శాస్త్రవేత్తలు కూడా ఆందోళన వ్యక్తం చేశారు. భూమి పై పడితే మహా ప్రళయం సంభవించి నట్టేనని భావించిన అనేక మంది ప్రజలు చాలామంది తమ జీవితాలకు అవే చివరి రోజులని భావించి ప్రాణాలను అరి చేతుల్లో పెట్టుకుని కాలం వెళ్ళ దీశారు. ఆకాశం నుంచి నక్షత్రం లాంటిది భూమిని ఢీకొన బోతోందని, దీంతో ప్రళయం వస్తుందని, మనుషులంతా చనిపోతారన్న ప్రచారం నానాటికీ అధికం అయింది. అయితే అంతరిక్షంలో 24 వారాల పాటు పనిచేసిన తరువాత, కక్ష్య క్షీణించి భూవాతావరణం లోకి ప్రవేశించి స్కై లాబ్ విచ్ఛిన్నమై పోయింది. అంతరిక్ష ముగ్గురు వ్యోమగాముల బృందం స్కైల్యాబ్ భూమిపై పడి నాశనమయ్యే లోపు తమకున్న పరిజ్ఞానంతో 1974 ఫిబ్రవరి 8 న భూమికి తిగి వచ్చేశారు. 1979 జూలై 11 న స్కైల్యాబ్ భూవాతావరణం లోకి ప్రవేశించి విచ్ఛిన్నమై పోయింది. స్కైలాబ్ కక్ష్య క్షీణించి, జూలై 11, 1979 న హిందూ మహాసముద్రం మీదుగా వాతావరణంలో కాలిపోయింది. దాని శకలాలు హిందూ మహా సముద్రం లోను, పశ్చిమా ఆస్ట్రేలియా లోనూ పడ్డాయి. ఇదిలా ఉంటే స్కై లాబ్ భూమిని ఢీకొని భారీ ప్రాణ, ఆస్తి తదితర నష్టం కలిగించ గలదనే ఉధృత ప్రచార నేపథ్యంలో...నాటి అవిభక్త ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి... 1979 జూలై 11న ప్రముఖ పుణ్యక్షేత్రం అయిన ధర్మపురిలో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం లో స్థానికుల సమక్షంలో, వేద పండితులతో కూడి భగవదారాధన లో గడపడం, ఆ తర్వాత హైదరాబాద్ కు తిరిగి వెళ్ళడం విశేషం..

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494**

# జూలై 11 - ప్రపంచ జనాభా దినోత్సవ ప్రకటిత దినం





1987లో ఈ రోజున ప్రపంచ జనాభా తొలిసారిగా 5 బిలియన్ల మైలురాయిని అధిగమించింది. అదే తరుణంలో ఐక్యరాజ్య సమితి 1989లో జూలై 11ను 'ప్రపంచ జనాభా దినోత్సవం'గా ప్రకటించింది. జనాభా పెరుగుదలతో ముడిపడి ఉన్న వనరుల కొరత, వాతావరణ మార్పులు, ఆహార సురక్ష, పౌష్టికాహారం లభ్యత వంటి విషయాలపై అంతర్జాతీయంగా అవగాహన పెంపొందించాలన్నదే దీని ఉద్దేశ్యం. భారతదేశం ఈ దినాన్ని విశేషంగా పాటిస్తూ, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వివిధ ప్రచార కార్యక్రమాలు, చైతన్య సదస్సులు, యువతలో అవగాహన పెంపు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తోంది. జూలై 11 అనే ఒక నిర్దిష్ట తేదీ, కాలగమనంలో మానవాళికి, ముఖ్యంగా భారతదేశానికి కూడా మర్మమైన సందేశాలను అందించే ఘట్టంగా నిలిచింది. ఈ తేదీ ప్రపంచ చరిత్రలో సాంకేతిక విజ్ఞానం, సామాజిక సంధుల, రాజకీయ ప్రకంపనల, మానవ విలువల కలయికగా పరిణతమైందని చెప్పవచ్చు. జూలై 11 భారతదేశంలో ఎన్నో కీలక సంఘటనలకు వేదిక అయింది. 1997లో తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత అక్రమ ఆస్తుల కేసులో అరెస్టయ్యారు. ఆ రోజు చెన్నైలో పోలీసులు ఆమె నివాసాన్ని ముట్టడి చేసి అరెస్టు చేయడం దేశవ్యాప్తంగా రాజకీయ ప్రకంపనలు కలిగించింది. ఆమె అరెస్టు దక్షిణ భారత రాజకీయాలకు ఒక మలుపు తెచ్చింది. జాతీయ మీడియా అంతటా ఈ ఘటన ప్రధాన శీర్షికగా మారింది. 1979లో ఇదే రోజున అమెరికా తొలితరం అంతరిక్ష ప్రయోగశాల స్కైలాబ్ భూమిపైకి పతనం అయింది. భూమి ఆకర్షణకు లోనై అది దగ్ధమై పాశ్చాత్య ఆస్ట్రేలియా మరియు భారత మహాసముద్రం ప్రాంతాల్లో తుది మిగులు భాగాలు పడిపోయాయి. అప్పట్లో ఈ వార్త భారతదేశ గ్రామీణ ప్రాంతాల్లో కూడా భయాందోళన కలిగించింది. "స్కైలాబ్ పడిపోతోంది" అన్న ఊహాగానాలు ప్రజల్లో ఆందోళనకు దారితీశాయి. ఈ తేదీన భారత విజ్ఞాన రంగానికి వెలుగు నిచ్చిన శతేంద్రనాథ్ బోస్ వంటి శాస్త్రవేత్త జన్మించిన దినం కూడా కావడం విశేషం. 1894 జూలై 11న జన్మించిన బోస్, అల్బర్ట్ ఐన్‌స్టీన్‌తో కలిసి బోస్-ఐన్‌స్టీన్ గణిత సూత్రాలను అభివృద్ధి చేశారు. ఆయన పేరు మీదే "బోసాన్" అనే ఉపకణాన్ని నామకరణం చేయడం భారత శాస్త్రీయ కీర్తిని ప్రపంచానికి చాటి చెప్పింది. బోస్ స్ఫూర్తి భారత యువ శాస్త్రవేత్తలకు మార్గదర్శిగా నిలుస్తోంది. జూలై 11న జన్మించిన మరెన్నో విశిష్ట వ్యక్తులలో అమెరికా అధ్యక్షుడు జాన్ క్విన్సీ అడమ్స్, సాహిత్య రచయిత ఇ. బి. వైట్, ఫ్యాషన్ డిజైనర్ జార్జియో ఆర్మానీ వంటి వారు ఉన్నారు. వీరి జన్మదినాలు ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందినవే అయినా, భారత దేశానికి శతేంద్రనాథ్ బోస్ జన్మదినం ఎంతో గర్వకారణమైనది. భారతదేశ దృష్టిలో జూలై 11 కేవలం ఒక తేదీ మాత్రమే కాదు - అది జనాభాపై ఆలోచనకు, శాస్త్ర స్ఫూర్తిపై గౌరవానికి, రాజకీయ చైతన్యానికి, భూమి మీద మానవుడి బాధ్యత గుర్తించేందుకు ఓ గుర్తింపు దినంగా నిలుస్తోంది. జనాభా విపరీతంగా పెరుగుతున్న దేశంగా భారతదేశం ఈ దినాన్ని ఉపయోగించుకుని, అవగాహన పెంపు, సమర్థ వనరుల వినియోగం, సమగ్ర అభివృద్ధి లక్ష్యాల వైపు పయనించాల్సిన అవసరం ఉంది. జూలై 11 ఈ విషయాల్ని గుర్తు చేస్తూ, గతానికి గౌరవం, వర్తమానానికి విశ్లేషణ, భవిష్యత్తుకు మార్గదర్శనం చేయగల ప్రత్యేకమైన దినంగా నిలుస్తోంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494**

# బోస్ స్ఫూర్తి... బోసాన్ కాంతి

## భారత భౌతిక విజ్ఞానానికి బోసాన్ ప్రకాశం - శతేంద్రనాథ్ బోస్ - జూలై 11 - శతేంద్రనాథ్ బోస్ జయంతి



శాస్త్ర జ్ఞానంలో కొందరి పేర్లు శాశ్వతంగా ప్రకాశిస్తుంటాయి. విజ్ఞానాన్ని హృదయంతో ప్రేమించి, సమాజానికి అంకితం చేసిన వ్యక్తుల కీర్తి కాలానికి పరిమితం కాజాలదు. అలాంటి అరుదైన మేధావుల్లో శతేంద్రనాథ్ బోస్ పేరు భారత దేశానికి గర్వంగా నిలుస్తుంది. 1894 జూలై 11న బెంగాల్‌లో జన్మించిన బోస్, భౌతిక శాస్త్ర రంగంలో ఒక మహత్తర విప్లవానికి బాటలు వేసిన వ్యక్తి. ఆయన పేరుతోనే "బోసాన్" అనే కణానికి నామకరణం జరగడం, ప్రపంచ శాస్త్రీయ పురోగతిలో భారత దేశం తన ముద్ర వేసిన ఘట్టంగా నిలిచింది. కలకత్తాలో విద్యాభ్యాసాన్ని పూర్తిచేసిన బోస్, చిన్న వయస్సులోనే గణిత శాస్త్రం, భౌతిక శాస్త్రం పట్ల తన లోతైన అవగాహనతో విశేష గుర్తింపు పొందారు. అణు, రేణు స్థాయిలో కణాల ప్రవర్తనపై ఆయన చేసిన పరిశోధనలు భౌతిక శాస్త్రానికి కొత్త దారులు చూపించాయి. 1924లో గ్యాస్ కణాల ప్రవర్తనపై రాసిన తన పరిశోధనా పత్రాన్ని బోస్ ఐన్‌స్టీన్‌కు పంపారు. ఐన్‌స్టీన్ ఆ పత్రానికి తన గణిత సిద్ధాంతాన్ని జోడించి, "బోస్-ఐన్‌స్టీన్ గణిత సిద్ధాంతం"గా ప్రచురించారు. అది ఆవిష్కరణాత్మకమైన క్వాంటం సిద్ధాంతాల ప్రాతిపదికగా మారింది. ఈ గణిత సిద్ధాంతంలో ప్రతిపాదించిన విశిష్ట కణాలకు బోస్‌ను స్మరించేందుకు "బోసాన్‌లు" అనే పేరు పెట్టారు. ఇవి %అత్‌వస్త్రవతీ ంజూఱఅ% కలిగిన కణాలు ఎ భౌతిక శాస్త్రంలోని నాలుగు మూల శక్తుల పరస్పర చర్యలకు బాధ్యత వహిస్తాయి. ఫోటాన్, గ్లుయాన్, డబ్ల్యూ, జెడ్, హిగ్స్ బోసాన్ వంటి కణాల ఉనికి, ప్రవర్తనల భౌతికతకు బోస్ సిద్ధాంతమే మూలాధారం. ఇవి ఫెర్మియన్‌లకు విరుద్ధంగా, ఒకే శక్తి స్థాయిలో అనేక బోసాన్‌లు ఒకే సారి ఉండగలవు. ఇది "బోస్-ఐన్‌స్టీన్ కండెన్సేట్" అనే విప్లవాత్మక భావనకు ఆధారం. శతేంద్రనాథ్ బోస్ విద్యావేత్తగా మాత్రమే కాకుండా, స్ఫూర్తిదాయక ఉపాధ్యాయుడిగా, దేశానికి అంకితమైన శిక్షణా దాతగా జీవించారు. ఆయన అధ్యాపక జీవితంలో అనేక మంది యువ శాస్త్రవేత్తల జీవితాల్లో వెలుగులు నింపారు. గణిత సూత్రాలను మాత్రమే కాకుండా, భౌతిక తత్వాన్ని సుస్పష్టంగా అధ్యయనం చేసి విజ్ఞానాన్ని ప్రజలకు చేరువ చేశారు. భారత ప్రభుత్వం ఆయన సేవలను గుర్తించి పద్మ విభూషణ్‌తో సత్కరించినప్పటికీ, నోబెల్ బహుమతి మాత్రం ఆయనకు లభించలేదు. అయినా ప్రపంచ శాస్త్రీయ సమాజం ఆయన మేధస్సుకు అంగీకారంగా నమస్సులు అర్పిస్తోంది. 2012లో హిగ్స్ బోసాన్‌ను సెర్న్‌లోని లార్జ్ హాడ్రాన్ కోలైడర్‌లో కనుగొనడం ద్వారా బోస్ సిద్ధాంతాల ప్రామాణికత మరింత బలపడింది. దీనివల్ల "స్టాండర్డ్ మోడల్"గా పిలువబడే ఆధునిక భౌతిక శాస్త్ర నిర్మాణం పటిష్టమైంది. శతాబ్దాల తర్వాత కూడా బోస్ సిద్ధాంతాలు నేటి శాస్త్రీయ ప్రయోగాలకు మార్గ నిర్దేశకంగా నిలవడం ఆయన విజ్ఞాన పరిపక్వతకు ప్రతీక. శతేంద్రనాథ్ బోస్ జీవితం ఎ దేశభక్తి, విజ్ఞాన పిపాస, వినయ శీలత, సమర్పణ ఎ అనే నాలుగు మూల స్తంభాలపై నిలబడిన జీవన శిఖరం. ఆయన జీవిత విశిష్టత విద్యార్థులకు, యువ శాస్త్రవేత్తలకు ప్రేరణ. జూలై 11ను కేవలం ఆయన జయంతిగా కాక, భారత శాస్త్ర విజ్ఞానానికి వెలుగు ప్రసాదించిన గొప్ప దినంగా భావించాలి. ఎందుకంటే, భౌతికశాస్త్ర విశ్వంలో "బోస్" అనే నామం శాశ్వతంగా ప్రకాశించేందుకు పునాది వేసినవారు ఆయనే.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494**




యెమెన్‌లో వ్యాపార భాగస్వామిని హత్య చేసిన కేసులో కేరళ నర్సు నిమిష ప్రియ కు మరణశిక్ష పడిన సంగతి తెలిసిందే. ఈనెల 16న ప్రియకు ఉరిశిక్ష అమలుకానున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసుపై నమోదైన పిటిషన్‌ను విచారించేందుకు తాజాగా అత్యున్నత న్యాయస్థానం అంగీకరించింది. మరణశిక్ష నుంచి నిమిషను రక్షించేందుకు దౌత్య మార్గాన్ని ఉపయోగించాలని కేంద్రాన్ని ఆదేశించాలని కోరుతూ సుప్రీం లో పిటిషన్ దాఖలైంది. తాజాగా ఈ పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీంకోర్టు ధర్మాసనం అంగీకరించింది. దీనిపై తదుపరి విచారణ ఈనెల 14న ఉండనున్నట్లు తెలిపింది. కాగా.. 16న మరణశిక్ష అమలు నేపథ్యంలో దౌత్య చర్చలకు కేవలం రెండు రోజులు మాత్రమే ఉంటుందని, అది ప్రభావం చూపకపోవచ్చని సీనియర్ న్యాయవాది రాజేంత్ బసంత్ పేర్కొన్నారు. కాబట్టి త్వరగా విచారణ జరపాలని కోరారు. ఈసందర్భంగా షరియత్ చట్టం ప్రకారం బాధిత కుటుంబసభ్యులకు నష్ట పరిహారం చెల్లిస్తే నిమిషను విడుదల చేయవచ్చని ఆయన ధర్మాసనానికి తెలిపారు. పాలక్కాడ్ జిల్లాకు చెందిన నిమిష.. నర్సు కోర్సు పూర్తిచేసిన తర్వాత 2008లో యెమెన్‌కు వెళ్లారు. 2011లో వివాహం చేసుకున్న ఆమె అక్కడే ఓ క్లినిక్ తెరవాలనుకొన్నారు. యెమెన్ చట్టాల ప్రకారం.. ఆ దేశానికి చెందిన తలాల్ అదిబ్ మెహదీని ఆమె వ్యాపార భాగస్వామిగా చేసుకుంది. వీరిద్దరూ కలిసి అల్‌అమన్ మెడికల్ కౌన్సిల్ అనే సెంటర్‌ను ప్రారంభించగా.. అది కొంతకాలం సజావుగా సాగింది. భర్త, కుమార్తె కేరళకు వెళ్లిపోయాక.. నిమిష ప్రియకు మెహదీ నుంచి వేధింపులు మొదలయ్యాయి. 2017లో అక్కడినుంచి పారిపోయేందుకు ఆమె ప్రయత్నించింది. మెహదీకి మత్తుమందు ఇచ్చి, తన పాస్‌పోర్టు లాక్కోవాలని భావించింది. ఈ ప్రయత్నంలో మత్తుమందు మోతాదు ఎక్కువకావడంతో మెహదీ చనిపోయాడు. ఈ కేసును విచారించిన కోర్టు ఆమెకు మరణశిక్ష విధించింది. గత ఏడాది నిమిష తల్లి ప్రేమకుమారి యెమెన్ వెళ్లారు. బాధిత కుటుంబానికి నష్ట పరిహారం ఇచ్చి తన కుమార్తెను కాపాడుకునేందుకు ప్రయత్నించినప్పటికీ అవి ఫలించలేదు.

చురకలు

## సంపాదకీయం

# అమెరికా సైన్స్ పతనమా? భారత్‌కు అవకాశమా?

ఒకప్పుడు ప్రపంచ విజ్ఞాన రంగానికి కేంద్రంగా వెలుగొందిన అమెరికాలో ప్రస్తుతం ఓ చర్చ తీవ్రంగా నడుస్తోంది. "అమెరికా సైన్స్ పతనానికి చేరుకుందా?" శతాబ్దాలుగా అంతరిక్షం, బయోటెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, వైద్య పరిశోధనలు వంటి ఎన్నో రంగాల్లో అమెరికా తన ఆధిపత్యాన్ని చాటుకుంది. కానీ ఇటీవల కాలంలో ట్రంప్ పాలనలో తీసుకున్న కొన్ని నిర్ణయాలు అక్కడి శాస్త్రీయ సమాజంలో తీవ్ర ఆందోళనను రేకెత్తించాయి. ఇది భారత్ లాంటి దేశాలకు ఓ సువర్ణావకాశంగా మారనుందా అనే కోణం నుంచి పరిశీలిద్దాం.


**- ట్రంప్ పాలనలో శాస్త్రీయ రంగానికి షాక్...** డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ముఖ్యంగా 2017–2021 మధ్య అమలు చేసిన కొన్ని విధానాలు అమెరికా సైంటిఫిక్ కమ్యూనిటీని తీవ్రంగా ప్రభావితం చేశాయి: సైన్స్ బడ్జెట్ కోతలు వల్ల ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్ ఏజెన్సీ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్, నాసా వంటి కీలక పరిశోధనా సంస్థల బడ్జెట్లను భారీగా తగ్గించారు. ఇది అనేక ప్రాజెక్టుల పురోగతిని నిలిపివేసింది. గ్లోబల్ వార్మింగ్‌ను 'అవాస్తవం' అన్న వాదనలతో పర్యావరణ మార్పులపై శాస్త్రీయ నివేదికలను ట్రంప్ బహిరంగంగా తిరస్కరించడం, గ్లోబల్ వార్మింగ్ ఒక బూటకమని వాదించడం పరిశోధకులను నిరాశపరిచింది. దీనివల్ల పర్యావరణ పరిశోధనలకు స్పష్టమైన మార్గనిర్దేశం లేకుండా పోయింది. సైంటిస్టుల వలసపై నిబంధనలు విధించి.. విదేశీ శాస్త్రవేత్తలు అమెరికాకు వచ్చి స్థిరపడటం కఠినతరం కావడంతో, ప్రపంచ స్థాయి మేధావులు అమెరికా వైపు చూడటం తగ్గింది. ఇది సైంటిఫిక్ ఇన్నోవేషన్‌లో కీలకమైన అంతర్జాతీయ సహకారాన్ని దెబ్బతీసింది.

**- నాసా, అమెరికా సైంటిస్టుల ఆందోళన...** ట్రంప్ ప్రభుత్వ విధానాలపై నాసా సహా అనేక ప్రభుత్వ పరిశోధనా సంస్థలకు చెందిన శాస్త్రవేత్తలు తీవ్రంగా స్పందించారు. "మేము పరిశోధన కోసం పోరాడాల్సిన పరిస్థితి వచ్చిందంటే అది అమెరికా విజ్ఞాన రంగానికి హెచ్చరిక" అని నాసాకు చెందిన ఒక సీనియర్ శాస్త్రవేత్త వ్యాఖ్యానించారు. బడ్జెట్ కోతలతో ఎన్నో ప్రాజెక్టులు వాయిదా పడటం లేదా రద్దు కావాల్సి రావడం పట్ల వారు ఆవేదన వ్యక్తం చేశారు. పర్యావరణ రంగంలో పనిచేసే పరిశోధకులు "సైన్స్‌ను రాజకీయంగా వాడుకో వద్దు" అంటూ పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు చేశారు.

**- భారత్‌కు ఇది అవకాశమేనా?...** అమెరికాలో సైన్స్‌కి ఎదురవుతున్న ఈ సంక్షోభం భారత్‌కు ఓ బలమైన అవకాశాన్ని అందిస్తుంది. విదేశాల్లో ఉన్న భారతీయ శాస్త్రవేత్తలు, ఇతర దేశాల మేధావులు ఇప్పుడు భారత్ వైపు చూస్తున్నారు. "అక్కడ భద్రత లేని రీసెర్చ్‌కి, ఇక్కడ నెమ్మదిగా ఎదుగుతున్న అవకాశాలే మేలు" అనే అభిప్రాయం బలపడుతోంది. ప్రభుత్వ ప్రోత్సాహకాలు కలిసివస్తున్నాయి. ISRO, DRDO, CSIR వంటి ప్రభుత్వ సంస్థలు, కొత్తగా ఏర్పడుతున్న AI/క్వాంటం స్టార్టప్స్ పరిశోధనలకు అందిస్తున్న ప్రోత్సాహం గణనీయంగా పెరుగుతోంది. ఇది భారతదేశంలో బలమైన పరిశోధన వాతావరణాన్ని సృష్టిస్తోంది. అమెరికా బడ్జెట్ కోతలతో ఇబ్బందులు పడుతున్నందున, కొన్ని రీసెర్చ్ పనులను ఇతర దేశాలకు ఔట్‌సోర్స్ చేసే అవకాశం ఉంది. ఇది భారతీయ సంస్థలకు, పరిశోధకులకు కలిసి వచ్చే అవకాశం.

**- ట్రంప్ , హిట్లర్ పోలిక?...** ఒక విచిత్రమైన పోలిక ఇప్పుడు శాస్త్రీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. హిట్లర్ పాలనలో జర్మనీలో శాస్త్రవేత్తలపై తీవ్ర ఆంక్షలు విధించబడ్డాయి. దీనివల్ల ఎంతో మంది ప్రముఖ శాస్త్రవేత్తలు అమెరికాకు వలస వెళ్లారు. ఇప్పుడు అదే అమెరికాలో శాస్త్రవేత్తల వలసను ఆపే విధానాలు తీసుకోవడం, పరిశోధనలకు నిధులు తగ్గించడం చూస్తుంటే, "హిట్లర్ చేసిన తప్పును ట్రంప్ తిరిగి చేస్తున్నాడా?" అనే సందేహం కలుగుతోంది. చరిత్ర పునరావృతమవుతుందా అనే ప్రశ్న తలెత్తుతోంది. అమెరికాలో శాస్త్రవేత్తల ఆందోళనలు, బడ్జెట్ కోతలు, పర్యావరణ నిబంధనలపై వ్యతిరేకత ఇవన్నీ కలిపి అమెరికా విజ్ఞాన రంగానికి ఒక హెచ్చరిక గంటలా మారాయి. అయితే ఇదే సమయంలో భారత్ వంటి దేశాలకు ప్రపంచ స్థాయిలో తమ సత్తాను నిరూపించుకోవడానికి ఇది ఒక గోల్డెన్ ఛాన్స్. విజ్ఞానం అనేది ఏ ఒక్క దేశానికో, రాజ్యాధికారానికో పరిమితం కాదు. ఎవరు అంకిత భావంతో, నిబద్ధతతో పనిచేస్తే వారిదే అవుతుంది. ఇప్పుడు ఈ అవకాశాన్ని భారత శాస్త్రవేత్తలు అందిపుచ్చుకుంటారా, లేదా అనేది వేచి చూడాలి.

# పాత తరం మహా నటుడు సిఎస్ఆర్ - జూలై 11... అభినవ శకుని జయంతి




సి.ఎస్.ఆర్ గా సుపరిచితులై, సి.ఎస్.ఆర్ అంజనేయులు అని పిలువబడే చిలకాలపుడి సీతా రామ అంజనేయులు ఒక ప్రసిద్ధ పాత తరం తెలుగు థియేటర్ రంగస్థల, సినిమాల నటుడు. రంగస్థల నాటక రచనలు మరియు పౌరాణిక పాత్రలను పోషించడం ద్వారా ఆయన బాగా పేరు పొందిన ఆ నాటి ప్రసిద్ధ కళాకారులలో ఒకడు. అనేక రంగస్థల నాటకాల్లో నటించాడు. 175 కి పైగా సినిమాల్లో ప్రధాన పాత్రలు మరియు పౌరాణిక పాత్రలను పోషించాడు. ఆయన ఆనాటి ప్రధాన నటులలో ఒకరు. ఎన్.టి.ఆర్ మరియు ఎ.ఎన్.ఆర్ వంటి నటుల ప్రవేశానికి ముందు, 1930 ల చివరలో అంజనేయులు ఒక ప్రధాన నటుడు. సి.ఎస్.ఆర్ గా ప్రసిద్ధి చెందిన చిలకాలపుడి సీతారామ అంజనేయులు (11 జూలై 1907 – 8 అక్టోబర్ 1963) 1907 జూలై 11 న ఆంధ్రప్రదేశ్‌లోని మచిలిపట్నం సమీపంలోని చిలకాలపుడి వద్ద తెలుగు ఆయన బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడు. తండ్రి లక్ష్మీ నరసింహ మూర్తి రెవెన్యూ విభాగంలో పని చేసేవాడు. గుంటూరు జిల్లా పొన్నూరులో పాఠశాల చివరి అధ్యయనాల తరువాత, ఆయన కొంతకాలం సహకార పర్యవేక్షకుడిగా పనిచేశాడు. తదుపరి చదువులకు బదులుగా, నాటక రంగంలోకి ప్రవేశించడానికి ఎంచు కున్నాడు. బాల్యం నుండే నాటకం పట్ల ఆయనకు ఆసక్తి మెండుగా ఉండేది. చాలా తక్కువ వ్యవధిలో, నటన మరియు నాటక రంగంలో అగణిత ఖ్యాతిని పొందాడు. పాడటం ఆయనకు దేవుడిచ్చిన వరం. కవితలు చాలా బాగా రాసే వాడు. తక్కువ సమయంలో, ఆయన స్థానం నరసింహారావు , డివి సుబ్బారావు , పారుపల్లి, తదితరులతో పోల్చదగిన స్థితికి చేరుకున్నాడు. ఆయన పనిచేసిన చాలా సినిమాలు తెలుగులో ఉన్నాయి. "భక్త కుచేల" వంటి కొన్ని సినిమాలు మలయాళం లేదా ఇతర భాషలలో ఉన్నాయి. ఆయన 1932 లో "రామ పాదుకా పట్టాభిషేకం" చిత్రంతో సినీ పరిశ్రమలోకి ప్రవేశించాడు. ఆయన శ్రీ కృష్ణ తులాభారం లో కృష్ణునిగా, రామదాసులో భక్త రామదాసుగా, తుకారంలో భక్త తుకారంగా గుర్తింపు పొందాడు. ఆయన సహజ గాయకుడు, ముఖ్యంగా కవితలలో దిట్ట. అంటరాని తనంపై పతిత పావనా అనే నాటకానికి ఆయన దర్శకత్వం వహించాడు. తన తుకారాం నాటకాన్ని ఆడటం ద్వారా విరాళాల ద్వారా సేకరించిన 10,000 రూపాయల డబ్బును సుభాస్ చంద్రబోస్ సంబంధిత భారత జాతీయ సైన్యానికి అంద జేశాడు. ఆయనకు ఇద్దరు చెల్లెళ్ళు మరియు ఇద్దరు తమ్ముళ్ళు ఉండగా, ఒక సోదరుడు, నాగేశ్వర రావు సహా సినిమాలకు అసిస్టెంట్ దర్శకుడు (సువర్ణ సుందరి, గుణ సుందరి, మాయా బజార్) మరో సోదరుడు సి. వెంకట రత్నం (సివి రత్నం అని పిలుస్తారు) భరణి పిక్చర్స్ మరియు స్టూడియోస్‌తో ఉన్నారు. నటి భానుమతి రామకృష్ణ నిర్మించిన అన్ని చిత్రాలకు ప్రొడక్షన్ మేనేజర్‌గా ఉన్నారు. 1932 రామ పాదుకా పట్టాభిషేకం, 1936 ద్రౌపది వస్త్రపారాణం, 1938 తుక్కారాం, 1939 జయప్రద, 1941 తల్లి ప్రేమ, కృష్ణ మాయ, 1942 సుమతి, 1945 మాయా లోకం, 1947 రత్నమాల , 1949 జీవితం, 1950 పరమా నందయ్య శిష్యుల కథ, 1951 పాతాళ భైరవి, 1952 పెళ్ళి చేసి చూడు, 1953 చండి రాణి, దేవదాసు, 1954 కన్యాదానం, చక్రపాణి, 1955 కన్యాసుల్కం రామప్ప పంతులు , రోజులు మారాయి, జమీందార్, 1956 భలే రాముడు, చిరం జీవులు, 1957 భాగ్య రేఖ, మాయా బజార్, సువర్ణ సుందరి, 1958 అప్పు చేసి పప్పు కూడు, రామదాసు, 1959 ఇల్లరికం, 1960 అన్నపూర్ణ, మహాకవి కాళిదాసు, 1961 జగదేక వీరుని కథ, భక్త కుచేల, కుచేలన్ మలయాళ సినిమా, 1962 చిట్టి తమ్ముడు, అనార్కలి, 1964 బొబ్బిలి యుద్ధం, చిత్రాలలో ప్రద ర్శిత విభిన్న పాత్రల పోషణలో లీనమై, చేసిన కృషికి ప్రశంసా పాత్రుడు అయినాడు. ఆయన పరిశ్రమలో మూడు దశాబ్దాలు పని చేశాడు. శ్రీకృష్ణ , రామదాసు , సారంగాధర, భవని శంకర, తుకారాం , సత్య వంత వంటి పౌరాణిక మరియు చారిత్రక పాత్రలను పోషించి, నటనా కౌశలాన్ని ప్రదర్శించాడు. 1937 లో సూపర్ హిట్ అయిన భక్త రామదాసులో ఆయన నటన ప్రశంసలు అందుకుంది. 1950 వ దశకంలో, సి ఎస్ ఆర్ "పాతాళ భైరవి" చిత్ర రాజంలో లో ఉజ్జయిని రాజుగా కనిపించాడు. ఈ చిత్రం బ్లాక్ బస్టర్. భారత దేశపు మొదటి అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో పాతాళ భైరవిని ప్రదర్శించారు. దర్శకుడు పి.పుల్లయ్య మొదటి విజయ వంతమైన చిత్రాల్లో ఒకటిగా 1953 చిత్రం దేవదాసులో, భార్యగా మహానటి సావిత్రితో కలిసి వితంతు ముసలి భర్తగా జమీందార్ పాత్రను పోషించాడు. శకుని పాత్రలో మహా భారతం, మాయా బజార్ లో న భూతో న భవిష్యతిగా నటించాడు. పాతాళ భైరవి మొదటి అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో ప్రదర్శించారు. ఆయన చిత్రం "చిట్టి తమ్ముడు" 1962 లో అతని కళ్ళ ముందు విడుదలైన చివరి చిత్రం, కానీ "బొబ్బిల్లి యుద్ధం" అతని చివరి చిత్రం, ఆయన మరణం తరువాత 1964 లో విడుదలైంది. సిఎస్ఆర్ అక్టోబర్ 8, 1963 న 56 సంవత్సరాల వయస్సులో మరణించాడు, పరిశ్రమపై తన ముద్రలను శాశ్వతంగా వదిలి వెళ్ళాడు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# తెలంగాణ ఆర్థర్ కాటన్ అలీ నవాజ్ జంగ్ బహదూర్

## తెలంగాణ నీటిపారుదల పితామహుడు అలీ నవాజ్ జంగ్ బహదూర్ - జూలై 11...తెలంగాణ ఇంజనీర్ల దినోత్సవం

తెలంగాణ ఇంజనీర్ల దినోత్సవం ప్రతి సంవత్సరం జూలై 11న తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించ బడుతుంది. హైదరాబాదుకు చెందిన ఇంజనీరు అలీ నవాజ్ జంగ్ బహదూర్ జన్మదినమైన జూలై 11ను తెలంగాణ ప్రభుత్వం 2014లో తెలంగాణ ఇంజనీర్ల దినోత్సవంగా ప్రకటించి, ఆయన జయంతి ఉత్సవాలను ఎర్రమంజిల్‌లోని జలసౌధలో ఘనంగా జరిపింది. తెలంగాణ ఆర్థర్ కాటన్‌గా, తెలంగాణ నీటిపారుదల పితామహుడిగానూ, అభివర్ణించ బడిన నవాబ్ అలీ నవాజ్ జంగ్ బహదూర్ తెలంగాణ గర్వించదగిన హైదరాబాదుకు చెందిన గొప్ప ఇంజనీరు. ఆయన 1877, జూలై 11న హైదరాబాదు లోని ఒక మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు. సెయింట్ జాన్ గ్రామర్ స్కూల్, నైజాం కళాశాలల్లో చదువు కున్నారు. మంచి మార్కులతో చదువులో ప్రతిభ కనబరిచారు. పలు ఉపకార వేతనాలను పొందారు. ఆయన ప్రతిభను గుర్తించిన ఆరో నిజాం ఆయనను చదువుకోవడం లండన్ పంపారు. ఆయన ఇంజనీరింగ్ పూర్తి చేసుకుని తిరిగి వచ్చారు. నిజాం సంస్థానంలో పబ్లిక్ వర్క్స్ శాఖలో ఉద్యోగంలో చేరారు. చీఫ్ ఇంజినరింగ్ సెక్రెటరీ స్థాయికి చేరుకున్నారు. నిజాం ప్రభువు ప్రోత్సాహంతో తన హయంలో ఎన్నో ఇంజనీరింగ్ నిర్మాణాలు చేపట్టారు. ప్రతి పనినీ గమనిస్తూ దగ్గరుండి నిర్మాణాలను త్వరితగతిన పూర్తయ్యేలా చేశారు. ఉస్మానియా ఆర్ట్స్ కళాశాల, ఉస్మానియా ఆసుపత్రి, యునానీ దవాఖాతా నిర్మాణంలో ఆయన ఇంజనీరింగ్ ప్రతిభ బహిర్గతం అవుతుంది. నాటి హైదరాబాద్ రాజ్యంలో అనేక నీటిపారుదల ప్రాజెక్టులకు రూపకల్పన చేసి, నిర్మింప చేశారు. తెలంగాణ ప్రాంతంలో గోదావరి, మంజీరా నదులపై పలు సాగునీటి ప్రాజెక్టులు, డ్యాములు, హైదరాబాద్, చారిత్రక కట్టణం నిర్మాణాలను ఆయనే డిజైన్ చేశారని చరిత్రకారులు చెపుతారు. ప్రభుత్వాలపై భారం పడకుండా దీర్ఘకాలం రైతులకు ప్రజలకు ఉపయోగకరంగా తక్కువ ఖర్చు, నాణ్యతతో కూడిన సాగునీటి ప్రాజెక్టులు నవాబ్ అలీ నవాజ్ జంగ్ బహదూర్ నిర్మించారు. తెలంగాణ రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులకు రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన వెంటనే నవాబ్ అలీ నవాజ్ జంగ్ బహదూర్ గౌరవార్థం తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా 2014, జూలై 10న జి.ఓ. నంబరు 18 జారీచేసి, అలీ నవాజ్ జంగ్ బహదూర్ జన్మదినాన్ని తెలంగాణ ఇంజనీర్ల దినోత్సవంగా ప్రకటించి ప్రతి సంవత్సరం అధికారికంగా ఈ దినోత్సవాన్ని నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఏడాదికి లక్షల మంది ఇంజనీర్లు తయారవు తున్నారు. ఆయా విభాగాల్లో శిక్షణ ఇవ్వడానికి పలు యూనివర్సిటీలు సేవలు అందిస్తున్నాయి. తల్లి దండ్రులు తమ పిల్లలు... వైద్యుడు, ఇంజనీరు కావాలని ఆకాంక్షిస్తున్నారు. ఇంతటి ప్రాచుర్యం కలిగిన ఈ విద్య కోసం పోటీ పడి చదువు తున్నారు. ఇంజనీరింగ్ సీట్ల కోసం విద్యార్థులు అహో రాత్రులు కష్టపడు తున్నారు. ఇంజనీరింగ్ విద్య పూర్తికాక ముందే నేడు స్వ, విదేశీ కంపెనీల క్యాంపస్ ఎంపికల పేరుతో ఉద్యోగాల్లోకి తీసుకుంటున్నారు. వేల నుంచి లక్షల వరకు వేతనాల చెల్లిస్తున్నారు. గతంలో ఎంతో ఆదరణ చూరగొన్న సివిల్ ఇంజనీరింగ్ ప్రభుత్వ రంగంలో అవినీతిలో కూరుకు పోయిందనే ఆరోపణలున్నాయి. ఇదే ప్రయివేటు సెక్టార్‌లో ప్రతిభతో కూడిన కాసుల గల గలల కొలమానంగా మారింది. ప్రభుత్వ ఆధీనంలో అభివృద్ధిలో భాగంగా వేసిన రోడ్లు, కట్టిన భవనాలు, నిర్మించిన చెరువులు, ప్రాజెక్టులు, వేసిన పైపులైన్లు కూలి పోవడం,




తెగి పోవడం, పగిలి పోవడం గమనిస్తూనే ఉన్నాం. కారణాలు ఏమైనప్పటికీ నాణ్యతకు ప్రతిభ తోడు కాక పోవడమే అని నిపుణులు అంటున్నారు. నాణ్యతకు రాజకీయం, అవినీతి అడ్డుగా నిలుస్తున్నాయని పలువురు అభిప్రాయ పడుతున్నారు. ఇంజనీరింగ్ రంగంలో రాణించి, తెలంగాణ ఆర్థర్ కాటన్‌గా, తెలంగాణ నీటిపారుదల పితామహుడిగా పేరెన్నిక గన్న నవాబ్ అలీ నవాజ్ జంగ్ బహదూర్ పుట్టిన రోజున జరుపుకునే తెలంగాణ ఇంజనీర్స్ డే సందర్భంగా సృజనాత్మకమైన వృత్తి నైపుణ్యాలతో పరిమితమైన వనరుల తోనే నాణ్యమైన పనులు నిర్వహించి మోక్ష గుండం విశ్వేశ్వరయ్య, సర్ ఆర్థర్ కాటన్, నవాజ్ జంగ్ బహదూర్ వలే ప్రజల మదిలో చిరకాలం నిలిచి పోయేందుకు ప్రతీ ఇంజనీర్ కృషి చేయాల్సిన అవసరం అనివార్యంగా ఉంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# "జనాభా నియంత్రణపై అవగాహన అవసరం" - జూలై 11... ప్రపంచ జనాభా దినోత్సవం

నిర్ణీత ప్రాంతంలో నివసించే ఒకే జాతికి చెందిన జీవుల సమూహమే జనాభా. ఒక నిర్ణీత కాల వ్యవధిలో జనాభాలో వచ్చే జననాల సంఖ్యను జనన రేటు అంటారు. ఇందులో సమగ్ర జనన రేటు, విశిష్ట జనన రేటు, శక్త్యర్థ జనన రేటు, జీవావరణ జనన రేటు అనే వివిధ లెక్కింపు విధానాలున్నాయి. అలాగే మరణాల రేటులో సమగ్ర, విశిష్ట, శక్త్యర్థ, జీవావరణ మరణ రేట్లు ఉంటాయి. మరణాల రేటుకంటే జననాల రేటు ఎక్కువ ఉన్నపుడే ఆ జనాభ్షా పరిమాణం పెరుగుతుంది. రోజు రోజుకు పెరిగి పోతున్న జనాభా, తద్వారా తలెత్తే దుష్పరిణామాలను వివరించేందుకు, సమస్యలపై అవగాహన కలిగించేందుకు ఏటా జులై 11 న ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా జనాభా పెరుగుదల, తగ్గుదలకు సంబంధించిన విషయాలుపై ప్రజలలో చైతన్యం కలిగించడానికి ఐక్యరాజ్య సమితి 1989లో దీనిని ప్రారంభించింది. 11-07-1987న జన్మించిన ఒక శిశువుతో ప్రపంచ జనాభా 500 కోట్లకు చేరింది. ఆరోజునే ప్రపంచ జనాభా దినంగా ఐక్యరాజ్య సమితి ప్రకటించింది. 1989 నుండి జులై 11వ తేదీన ప్రపంచ జనాభా దినోత్సవంగా పాటిస్తున్నారు. ప్రపంచ జనాభాలో 40 శాతం మూడవ ప్రపంచ దేశాలైన ఇండియా, చైనాలలోనే ఉన్నారు. ప్రపంచ జనాభా ప్రతి సంవత్సరం 9 కోట్ల 20 లక్షలు అదనంగా పెరుగుతోంది. క్రీస్తు శకం 1000వ శతాబ్దంలో ప్రపంచ జనాభా కేవలం 40 కోట్లు మాత్రమే. 1850లలో మొదటిసారి జనాభా వందకోట్లను దాటింది. అక్కణ్నించి కేవలం 150 ఏళ్ల కాలంలోనే 650 కోట్లను దాటేసింది. వచ్చే యాభై ఏళ్లలో 900 కోట్లకు చేరుకుంటుందని అంచనా. ఐక్యరాజ్య సమితి నివేదిక ప్రకారం 2024 కల్లా భారత్, చైనాల జనాభా 1.44 బిలియన్లుగా ఉంటుంది. అప్పటికే చైనా జనాభాను మించుతుంది. భారత దేశంలో 1872 నుంచి 2011 వరకు మొత్తం 15 పర్యాయాలు జనగణన చేశారు. 2011లో 15వ సారి 28 రాష్ట్రాలు, 7 కేంద్ర పాలిత ప్రాంతాల్లో జనగణన నిర్వహించారు. అప్పటికి తెలంగాణ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా ఉంది. భారతదేశంలో తెలంగాణ 29వ రాష్ట్రంగా ఆవిర్భవించిన తర్వాత జనగణన ఒక్కసారి కూడా చేపట్టలేదు. 2011 గణాంకాల ప్రకారం భారతదేశ జనాభా 1,21,05,69,573. తెలంగాణ రాష్ట్ర జనాభా 3,51,93,978. తెలంగాణ ప్రస్తుత జనాభా 3,50,03,674. ఖమ్మం జిల్లాలో 327 గ్రామాలను (7 మండలాలు) ఆంధ్రప్రదేశ్‌లో కలిపారు. 2001-11లో భారతదేశ జనాభా వృద్ధిరేటు 17.7 శాతం..రాష్ట్రంలో 2001-11 మధ్య కాలంలో జనాభా వృద్ధిరేటు 13.58 శాతం. 2011 లెక్కల ప్రకారం భారత్‌లో సగటు పట్టణ జనాభా శాతం 31.2 ఉండగా, రాష్ట్రంలో పట్టణ జనాభా శాతం 38.67గా ఉంది. అంటే రాష్ట్ర పట్టణ జనాభా జాతీయ సగటు కంటే ఎక్కువగా ఉన్నట్లు గమనించవచ్చు. రాష్ట్రంలో గ్రామీణ జనాభా ప్రస్తుతం 213.95 లక్షల మంది. రాష్ట్ర మొత్తం జనాభాలో గ్రామీణ జనాభా వాటా ప్రస్తుతం 61.12 శాతం. 2020 మార్చి నాటికి ప్రపంచ జనాభా7.8 బిలియన్ల కు చేరినట్లు అంచనా. 2023 వరకు 8 బిలియన్లకు, 2037 వరకు 9, మరియు 2055 వరకు 10 బిలియన్ల కు చేరనున్నట్లు అంచనా. యునైటెడ్ నేషన్స్ డాటా ప్రకారం




2020 జూలై 9 నాటికి భారత జనాభా 1,380,270,828 ఉన్నట్లు అంచనా. అంటే ప్రపంచ జనాభాలో ఇది 17.7%. పెరుగుతున్న జనాభాలో అభివృద్ధి చెందుతున్న దేశాలు కీలకపాత్ర పోషిస్తున్నట్లు ఈ సందర్భంగా ఐక్య రాజ్య సమితి అభిప్రాయ పడింది. భారత్, అమెరికా, చైనా, బంగ్లాదేశ్, పాకిస్థాన్ తదితర తొమ్మిది దేశాలు వచ్చే 2050 నాటికి ప్రపంచ జనాభాలో సగం శాతాన్ని ఆక్రమిస్తాయని సమితి తెలిపింది. ప్రపంచ జనాభా మొత్తంగా అడ్డూ అదుపూ లేకుండా పెరిగి పోతోంది. అవసరాలు తీర్చే వనరులు ఆ స్థాయిని అందుకో లేక పోతున్నాయి. ఆశలు, ఆకాంక్షలు అపరిమితం అయిపోతున్నాయి. తీర్చగలిగే సంపద, సేవలు, సరుకులు అంతరించి పోతున్నాయి. పర్యవసానం జన విస్ఫోటనం. ప్రజలు భూమికి భారమై, శాపమై పోతున్నారు. కనుకనే దేశాల మధ్య జల, జన యుద్ధాలు, ఆధిపత్య పోరాటాలు, భూమి, సహజ సంపదలను దోచుకోవడాలు, దాచుకోవడాలు జరుగు తున్నాయి. జనాభా పెరుగుదల ఆహార పదార్థాల ఉత్పత్తి పెరుగుదల కంటే చాలా ఎక్కువగా ఉంటోంది. అందువల్ల డిమాండ్ అధికంగా పెరిగి సప్లై తగ్గుమొహం పట్టడంతో ధరలు పెరిగి పోతున్నాయి. డిమాండ్, సప్లయిల మధ్య అగాధం పెరిగి పోతోంది. పర్యవసానంగా ఉన్నవాడు కొనుక్కో గలుగు తున్నాడు. లేనివాడు ఆకలికి గురి అవుతున్నాడు. కనుక ప్రపంచంలో అనేకచోట్ల ఆకలి చావులు సంభవిస్తున్నాయి. ఆఫ్రికా దేశాలలో సంభవించే లక్షల ఆకలి చావులే దీనికి సాక్షీ భూతాలు. ప్రకృతి వనరులకు సహజ సంపదలకు, జల, భూ వనరులకు ఒక పరిమితి ఉంది. అవి ఒక పరిమితికి మించని జనాభా అవసరాలకు మాత్రమే ఉపకరించ బడతాయి. ఆ పరిమితికి మించి జనాభా ఉంటే నిరుపయోగ స్థాయికి చేరుకుంటాయి. పైగా మితిమీరిన సేద్యం, వినియోగం, దుర్వినియోగం వలన భూసారం తగ్గి తరుగుదల కాలుష్యం చోటు చేసుకుంటాయి. సంపదలు సరిపోవు. పనికిరావు. ఆపైన దారిద్ర్యము, ప్రకృతి వైపరీత్యాలతో పాటు ఒకరి నొకరు దోచుకోవడాలు, మోసాలు, దౌర్జన్యాలు, దొంగతనాలు చోటు చేసుకుంటాయి. సమాజం అదుపు తప్పుతుంది. మన దేశం జనాభా పెరుగుదల ఇదే రీతిలో కొనసాగితే 2025 నాటికల్లా భారత్ చైనాను అధిగమించి ప్రపంచంలో అత్యధిక జనాభాగల దేశంగా ఆవిర్భవించడం తథ్యం అని అమెరికా గణన సంస్థ వెల్లడించింది. సత్వరమే భారత్ దిద్దుబాటు చర్యలు, జనస్థిరీకరణ, నియంత్రణకు పూను కోకుంటే... ఆఫ్రికా దేశాల మాదిరి ఆకలి, దారిద్ర్యము, కరువు రక్కసులు పడగలు విప్పడం అనివార్యం అనడంలో సందేహం అక్కర లేదు. ప్రపంచంలోనే కుటుంబ నియంత్రణ పథకాలను అధికారికంగా ప్రవేశపెట్టిన దేశం మన దేశమే. 1950లోనే కుటుంబ నియంత్రణ కొరకై నూతన సూత్రీకరణాలను చేసి లక్షలు, కోట్లు ఖర్చు చేసింది. కారణాలు ఎవయినా ఆశించిన ఫలితాలు సాధించలేక పోయాము. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రాకపోవడం, ప్రభుత్వ పథకాలలో అవకతవకలు, పారదర్శకత లోపించడం, మూఢనమ్మకాలు, అవిద్య, స్త్రీ సాధికారిత లేకపోవడం లాంటివి అవరోధాలైనాయి. అయినా భారత్‌లో జనాభా నియంత్రణ పథక అమలు వల్ల మన ఆర్థిక రంగానికి అనుగుణంగా అన్ని కోణాలలో తీర్చి దిద్దడం, ఆర్థిక పరిస్థితిని మెరుగు పర్చడం, జన జీవన శైలిని, ప్రమాణాలను వృద్ధి పర్చడం జరిగింది. ఈ భూమీద వందకోట్ల మందికి పౌష్టికాహారం దొరకడం లేదు. 40 కోట్ల మందికి ఆహారం దొరకడం లేదు. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకొని అధిక జనాభాగల దేశాలు తక్షణమే జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రజలు మూఢనమ్మకాలను వీడి, కులాలకు, మతాలకు అతీతంగా కుటుంబ నియంత్రణ పథకాలను ఆచరించాలి. మహిళా సాధికారిత పెంచాలి. స్త్రీ విద్యను ప్రోత్సహించాలి. స్త్రీ విద్యావంతు రాలైతే సమాజం ఉన్నతస్థాయికి చేరడం ఖాయ మని గ్రహించాలి. జనాభాను అదుపుచేసి విద్యా వ్యాప్తి చేసి ప్రతి ఒక్కరు మానవ వనరుగా మారిన రోజున దేశభ్యుదయానికి ఎన్నో మార్గాలున్నాయి అనడంలో అతిశయోక్తి ఏ మాత్రమూ లేదు. జన స్థిరీకరణ, నియంత్రణ, ప్రస్తుత ఆర్థిక రంగానికి అనుసంధానం చేస్తే జన జీవనజ్యోతి దేదీపమాన్యంగా వెలుగుతుంది. భూమాత భారం తగ్గుతుంది. పర్యావరణ నిపుణుల ప్రకారం జనాభా పెరుగుదలను తగ్గించకుంటే ప్రకృతే ఆ పనిని సమూలంగా చేపడుతుంది. భూకంపాలు, సునామీలు, వరదలు లాంటి బీభత్సాలతో అధిక భారాన్ని భూమాతే తక్కువ చేసుకుంటుంది. కనుక జనాభా నియంత్రణ మన అందరి కర్తవ్యం. జనాభా పెరుగుదల వల్ల కలిగే నష్టాలు, ఆర్థికంగా కుంగిపోవడం, నిరక్షరాస్యత, అవసరాలు తీరకపోవడం, భూమిపై స్థలం సరిపోకపోవడం లాంటి సమస్యలను ఆయా ప్రభుత్వాలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి. ఈ విషయాలపై వారికి క్షుణ్ణంగా అవగాహన కల్పించి, వాళ్లే వాలంటరీగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించుకునేలా ప్రోత్సహించాలి. ఈ రకంగా ఎవరికివారు జనాభా నియంత్రణకు పూనుకున్నట్లయితే భూమాత భారాన్ని కాస్తయినా తగ్గించిన వారవుతాము. అభివృద్ధిలో పాలు పంచుకున్న వారం అవుతాము. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

## అండర్‌పాస్ పనులు ప్రారంభం

చౌటుప్పల్ : హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై చౌటుప్పల్ మండలం ధర్మోజిగూడెం వద్ద అండర్‌పాస్ వంతెన పనులు ప్రారంభమయ్యాయి. ఈ రహదారిపై ధర్మోజిగూడెం వంతెన అతి ప్రమాదకరమైంది. నాలుగు వరుసల జాతీయ రహదారి ప్రారంభమై 12 ఏళ్లు గడిచిపోతుంది. అప్పటి నుంచి ఇప్పటిదాకా వంద మంది వరకు ధర్మోజిగూడెం కూడలి వద్ద మృత్యువాత పడ్డారు. హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లే మార్గంలో ధర్మోజిగూడెం వద్దకు రాగానే కిందికి(డౌన్) ఉంటుండంతో వేగం నియంత్రణ అదుపులో ఉండక తరచూ ప్రమాదాలు జరిగేవి. కూడలి వద్ద రోడ్డు దాటే సమయంలోనే కాక పలుమార్లు వాహనాలు విభాగిని(డివైడర్) పైనుంచి అపసవ్య దిశలోకి దూసుకొచ్చి హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలను ఢీకొట్టేవి. ఇలా జరిగిన ప్రమాదాల్లో మృతులు పదుల సంఖ్యలో ఉన్నారు. గతేడాది విజయవాడ జాతీయ రహదారిపై 17 బ్లాక్ స్పాట్స్(ప్రమాదకర ప్రాంతాలు)లో వంతెన నిర్మాణాలను, సర్వీసు రోడ్లను, భూగర్భ మురుగు కాల్వల నిర్మాణ పనులకు ఎన్‌హెచ్ఏఐ టెండరింగ్‌ను పిలిచి గుత్తేదారు సంస్థతో పనులను ప్రారంభింపజేసింది. వీటితోపాటే ధర్మోజిగూడెం కూడలి వద్ద కూడా అండర్‌పాస్ వంతెనను నిర్మించాల్సి ఉండగా ఎన్‌హెచ్ఏఐ అధికారులు ప్రతిపాదనలు పంపలేదు. పోలీసు ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని ధర్మోజిగూడెం వద్ద అండర్‌పాస్ వంతెన అత్యవసరమని చెప్పడంతో జాతీయ



ప్రాధికార సంస్థ ప్రాంతీయ అధికారులు మరల ఎన్‌హెచ్ఏఐ న్యూఢిల్లీకి ప్రతిపాదనలను పంపారు. అనుమతులు రావడంతో టెండరింగ్‌ను పిలిచారు. పనులను హైదరాబాద్‌కు చెందిన ఎస్ఆర్ ఇంజనీరింగ్ సంస్థ దక్కించుకుంది.

**సుమారు రూ.21 కోట్లతో..** 700 మీటర్లు పొడవు వెహికల్ అండర్‌పాస్ వంతెన(వీయూపీ)ని నిర్మిస్తుంది. అండర్‌పాస్ వంతెనను మే 5న కేంద్ర రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ హైదరాబాద్ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. మంత్రి అండర్‌పాస్ వంతెనకు శంకుస్థాపన చేసిన తర్వాత గుత్తేదారు సంస్థ మారడంతో నెల రోజులకు పైగా పనుల ప్రారంభంలో జాప్యం జరిగింది. ఇప్పుడు వంతెన నిర్మాణంలో భాగంగా నూతన గుత్తేదారు సంస్థ జాతీయ రహదారికిరువైపులా ఉన్న చెట్ల తొలగింపు పనులను చేపడుతుంది. ఏడాది లోపు వంతెన పూర్తవుతుందని ఎన్‌హెచ్ఏఐ అధికారులు చెబుతున్నారు.

## కొత్తగా.. మీసేవలో..

భువనగిరి: ఇప్పటికే పలు రకాల ప్రయోజనాలు అందిస్తున్న మీసేవ ప్రజలకు మరింత చేరువ అవుతోంది. ప్రస్తుతం రెవెన్యూ, పురపాలిక, పంచాయతీరాజ్ శాఖల సేవలు అందిస్తున్నారు. తాజాగా రిజిస్ట్రేషన్ శాఖ జారీ చేసే వివాహ ధ్రువీకరణ పత్రం, వ్యవసాయేతర భూముల మార్కెట్ విలువ ధ్రువీకరణ పత్రాలను పొందే వెసులుబాటు కల్పించింది. 2011లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం 'మీ సేవ' కేంద్రాలను అందుబాటులోకి తెచ్చిన విషయం తెలిసిందే. యాదాద్రి భువనగిరి జిల్లాలో 76 కేంద్రాలు ఉన్నాయి. తాజా వాటితో కలుపుకొని 230కిపైగా సేవలు అందుతుండటం విశేషం. సంబంధిత వివరాలు క్లుప్తంగా..

**వివాహ ధ్రువపత్రం ఇలా..**

పెళ్లి చేసుకున్న నూతన దంపతులకు వివాహ ధ్రువపత్రం అవసరం ఉంటుంది. దాన్ని ఎలా పొందాలో తెలియక చాలా మంది ఇబ్బందులు పడుతుంటారు. దాని కోసం ఏజెంట్లను సంప్రదించి రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు వెళ్తుండేవారు. ఇప్పుడు ఆ ప్రయాస లేకుండా వివాహ ధ్రువీకరణ పత్రం అవసరం ఉన్నవారు మీ సేవ కేంద్రం ద్వారా స్లాట్ బుక్ చేసుకోవచ్చు. ఇందుకు కావాల్సిందల్లా వధూవరుల ఆధార్, ఎన్నికల సంఘం జారీ చేసిన ఓటరు కార్డు, వయసు రుజువు కోసం పదో తరగతి మార్కుల జాబితా, ఇరు కుటుంబాలకు చెందిన వివాహ ఆహ్వాన పత్రికలు, పెళ్లికి సంబంధించిన ఫొటోలతోపాటు ముగ్గురు



సాక్షులకు చెందిన గుర్తింపు పత్రాల జిరాక్స్ ప్రతులు తప్పనిసరి అవసరం.

**మార్కెట్ విలువ పత్రాలు**


గృహ నిర్మాణాలు, ఇతర బ్యాంకు రుణాల కోసం వ్యవసాయేతర భూములకు మార్కెట్ విలువ ధ్రువపత్రాలు తప్పనిసరిగా అవసరం. గతంలో వీటిని రిజిస్ట్రేషన్ శాఖలో మాన్యువల్‌గా అందించేవారు. ఇప్పుడు వాటిని సైతం మీ సేవ ద్వారా అందించనున్నారు. అంతేగాక ఇసుక అక్రమ తరలింపునకు అడ్డుకట్ట వేసే దశలో ప్రభుత్వం అడుగులు వేస్తుంది. ఇందుకు మీ సేవను వినియోగించుకోవాలని ప్రభుత్వం యోచిస్తుంది. ఇసుక అవసరమైన వారు మీ సేవ కేంద్రాల ద్వారా స్లాట్ బుక్ చేసుకుని తెప్పించుకునే వెసులుబాటును త్వరలో కల్పించనున్నట్లుగా తెలుస్తోంది.

**సద్వినియోగం చేసుకోవాలి**

ఎన్.సాయికుమార్, ఈ-జిల్లా మేనేజర్, యాదాద్రి భువనగిరి

ప్రభుత్వం మీ సేవ కేంద్రాల నుంచి ధ్రువపత్రాలు మరింత సులభంగా అందించేందుకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటుంది. తాజాగా వివాహ ధ్రువీకరణ, వ్యవసాయేతర భూములకు మార్కెట్ విలువ పత్రాలు అందించే సేవలు ప్రవేశపెట్టింది. తక్కువ సమయంలోనే మరోసారి కుల, ఆదాయ ధ్రువపత్రాలు పొందే విధానం కూడా అమల్లోకి తెచ్చింది. ప్రజలు నూతన సేవలు సద్వినియోగం చేసుకోవాలి.

## 'నిశ్శబ్దం'గా విస్తరిస్తోంది



గోదావరిఖని: ఉమ్మడి జిల్లాలో హెచ్ఐవీ పాజిటివ్ కేసులు పెరుగుతున్నాయి. అవగాహన రాహిత్యంతో పాటు కనీస జాగ్రత్తలు కూడా పాటించకపోవడంతో హెచ్ఐవీ బాధితులు పెరుగుతున్నారు. ఉమ్మడి జిల్లాలో క్వారీలు, గ్రానైట్ పరిశ్రమలు, ఇటుకల తయారీ కేంద్రాలు ఎక్కువగా ఉండటంతో ఇతర రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి వలస కూలీలు ఎక్కువగా వస్తుంటారు. గల్ఫ్, ఇతర దేశాల నుంచి వచ్చే వారి సంఖ్య కూడా ఎక్కువగానే ఉంటుంది. అక్కడి నుంచి వచ్చే వారి ద్వారా వ్యాధి సంక్రమిస్తోంది. ప్రతినెలా హెచ్ఐవీ కేసులు పెరుగుతూ వస్తున్నాయి.

**విస్తృత ప్రచారం**

ఎయిడ్స్ నివారణకు ఒకవైపు ప్రభుత్వ పరంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. మరోవైపు స్వచ్ఛంద సంస్థలు, కళాజాత బృందాలు, హెచ్ఐవీ పరీక్ష కేంద్రాల సిబ్బంది ప్రచారాలు చేస్తున్నారు. తాజాగా ఎల్ఈడీ తెరతో ఎయిడ్స్ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రత్యేకంగా ప్రచారం చేస్తున్నారు. ఏఆర్‌టీ కేంద్రాల ద్వారా అవగాహన కల్పించడంతో పాటు పరీక్షలు చేస్తూ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో మూడు ఏఆర్‌టీ కేంద్రాలు

ఉమ్మడి జిల్లాలో మూడు ఏఆర్‌టీ(యాంటీ రెట్రోవైరల్ థెరపీ) కేంద్రాలున్నాయి. ఇక్కడి నుంచి హెచ్ఐవీ రోగులకు మందులు పంపిణీ చేస్తారు. గోదావరిఖని, కరీంనగర్, జగిత్యాలో ఏఆర్‌టీ కేంద్రాలున్నాయి. నోడల్, మెడికల్ అధికారులతో పాటు కౌన్సెలర్, డాటా ఎంట్రీ, ఫార్మాసిస్టు, ల్యాబ్‌టెక్నీషియన్ల ద్వారా నిరంతరం పర్యవేక్షణతో పాటు మందులు పంపిణీ చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో హెచ్ఐవీ బాధితులు

మందులు వాడుతున్న వారు : 9,337

పింఛను పొందుతున్న వారు : 3,898

**అవగాహనతోనే దూరం**

ప్రతి ఒక్కరిలో ఎయిడ్స్‌పై అవగాహన అవసరం. చిన్న చిన్న జాగ్రత్తలు పాటిస్తే సరిపోతుంది. స్వీయనియంత్రణ లేకపోవడంతో హెచ్ఐవీ కేసులు పెరుగుతున్నాయి. ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించేందుకు ప్రత్యేక బృందాలతో ప్రచారం చేస్తున్నాం. పట్టణాలు, పల్లె ప్రాంతాలు, ప్రధాన కూడళ్లు, బస్టాండ్‌ల వద్ద ఎల్ఈడీ తెరతో అవగాహన కల్పిస్తున్నాం. ఎయిడ్స్ నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై విస్తృతంగా ప్రచారం చేస్తున్నాం. రమాశ్రీనివాస్, ఐసీటీసీ ఉమ్మడి జిల్లా సమన్వయకర్త

## మెడి'కల' తీరింది..!



మిర్యాలగూడ : వంద పడకలతో జిల్లా ఆసుపత్రి తర్వాత ఆ స్థాయిలో వైద్య సేవలందిస్తున్న మిర్యాలగూడ ప్రాంతీయ ఆసుపత్రి మరో మెట్టు ఎక్కనుంది. ఆసుపత్రిలో పీజీ వైద్య కళాశాల ఏర్పాటు చేయనున్నట్లు జాతీయ వైద్య కమిషన్ ప్రకటించింది. వైద్య విద్యను చేరువ చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర వ్యాప్తంగా ఐదు ప్రాంతాల్లో పీజీ వైద్య కళాశాలలు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. నిత్యం వందలాది మందికి చికిత్స అందించే ప్రాంతీయ ఆసుపత్రిలో పీజీ వైద్య కళాశాల ఏర్పాటుపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతుంది.

ఇప్పటికే ఆసుపత్రిలో నూతన భవనం నిర్మాణం జరుగుతుండగా.. డయాలసిస్ యంత్రాలను ఐదు నుంచి పదికి పెంచారు. మరో వైపు ఆసుపత్రికి ఇటీవలే ట్రామా కేర్ సెంటర్ సైతం మంజూరైంది. అద్దంకి-నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారి, కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారి పట్టణం నుంచే వెళ్తుండడంతో ఈ ప్రాంతంలో రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతూ..అనేక మంది గాయాలపాలవుతున్నారు. దీంతో వారిని హైదరాబాద్ వంటి నగరాలకు తరలించే లోపే మృత్యువాత పడుతున్నారు. ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటుతో అత్యాధునిక ఎంఆర్ఐ, సీటీ స్కాన్ వంటి సౌకర్యాలు అందుబాటులోకి వచ్చి..ప్రమాద బాధితులకు చికిత్స అందించేందుకు అవకాశం ఏర్పడుతుంది. మోకాలి చిప్పల మార్పిడి శస్త్ర చికిత్సల్లో ఆసుపత్రి రాష్ట్రంలోనే ముందంజలో సైతం ఉంది. పీజీ వైద్య కళాశాల ఏర్పాటుతో ప్రజలకు అత్యాధునిక వైద్యం అందుబాటులోకి రానుంది. జిల్లాలో నార్కట్‌పల్లి కామినేని ఆసుపత్రి మినహా పట్టణంలోని జ్యోతి ఆసుపత్రిలో మాత్రమే డీఎన్‌బీ డీజీవోలో పీజీ సీట్లు అందుబాటులో ఉన్నాయి. కాగా ప్రాంతీయ ఆసుపత్రిలో ఏడు విభాగాల్లో పీజీ సీట్లు మంజూరు చేసేందుకు అధికారులు ప్రతిపాదనలు పంపినట్లు సమాచారం. ఇందులో గైనకాలజీ, చిన్న పిల్లలు, ఆర్థోపెడిక్, జనరల్ సర్జన్, జనరల్ మెడిసిన్ తదితర విభాగాల్లో పీజీ సీట్లు అందుబాటులోకి రానున్నట్లు తెలుస్తోంది. అయితే పీజీ కళాశాల ఏర్పాటు చేసేందుకు కావాల్సిన మౌలిక వసతుల కల్పనపై ఇప్పటికే అధికారులు దృష్టి సారించినట్లు సమాచారం.

**ఇంకా పూర్తి విధి విధానాలు రాలేదు...** డాక్టర్ మాతృనాయక్, డీసీహెచ్ఎస్, నల్గొండ. మిర్యాలగూడ ప్రాంతీయ ఆసుపత్రిలో పీజీ వైద్య కళాశాల ఏర్పాటు చేయనున్నట్లు జాతీయ మెడికల్ కమిషన్ ప్రకటించింది. కానీ మాకు దీనిపై ఎలాంటి విధి విధానాలు రాలేదు. కాగా ఆసుపత్రిలో ఇప్పటికే వంద పడకల భవనం ఉండగా..మరో వంద పడకల భవనం నిర్మాణం జరుగుతోంది. దీంతో పాటు ట్రామా కేర్ సెంటర్ వంటి అత్యాధునిక సౌకర్యాలు సైతం అందుబాటులోకి రానున్నాయి. పీజీ కళాశాల సైతం వస్తే రోగులకు ఆధునిక చికిత్స అందించేందుకు వీలు కలుగుతుంది.

## సారం పెంచు.. దిగుబడి పెంచు



నల్గొండ: పంటల సాగులో ఎరువుల వినియోగాన్ని దశల వారీగా తగ్గించడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. భూసారం దెబ్బతినకుండా వాతావరణ కాలుష్యం లేకుండా ఉండేందుకు సమగ్ర కార్యాచరణ చేపడుతోంది. చిన్న గుళికల రూపంలో ఉండే యూరియా స్థానంలో ద్రవరూప నానో యూరియాను అందుబాటులో తెచ్చింది. డీఏపీ కూడా ఇలాగే లభిస్తోంది. దశాబ్దాలుగా సంప్రదాయ పద్ధతిలోనే బస్తాలకొద్ది ఉపయోగించిన రైతన్నలు నానో యూరియాపై ఆసక్తి కనబర్చడం లేదని వ్యవసాయ అధికారుల సర్వేలో తేలింది. దీంతో క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారులు, విస్తరణాధికారులతో రైతువేదికల్లో విస్తృత ప్రచారం చేస్తున్నారు.

**నానో యూరియాతోనే బాగు**

స్ఫటిక రూపంలో ఎరువుతో వృథా ఎక్కువవుతుంది. మార్కెట్‌లో 45 కిలోల బస్తా రూ.270 ఉంది. దానికి సమానమైన నానో యూరియా అర లీటరు డబ్బా ధర రూ.225 మాత్రమే. మొక్కలకు పిచికారీ చేయడంతో ఎక్కువ ఫలితం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. పంట కాలానికి ముందుగానే రైతు భరోసా నిధులు జమ చేయడంతో కర్షకులు ఉత్సాహంగా సాగుబడి చేస్తున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పంటల సాగు విస్తీర్ణం 21,24,980 ఎకరాలు కాగా ఇందులో వరి 12,89,675, పత్తి 7,45,554, మిగిలిన పంటలను 89,751 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. నెలాఖరు వరకు పత్తి పంట సాగు మొత్తం పూర్తికానుంది. వరి 40 శాతమే పూర్తి చేశారు. బోరు బావుల వద్ద సాగు ఊపందుకోగా కాలువల వద్ద వరి నారు నాటు వేసే దశకు వచ్చిందని అధికారులు చెబుతున్నారు.

**రైతులకు అవగాహన కల్పిస్తున్నాం**

పాల్వాయి శ్రవణ్, జిల్లా వ్యవసాయశాఖాధికారి, నల్గొండ

గుళికల రూపంలో కాకుండా ద్రవరూపంలో ఉండే అత్యాధునిక నానో యూరియా, డీఏపీ ఎరువులను ఉపయోగించడం వల్ల రైతులు లాభసాటి వ్యవసాయం చేయవచ్చు. వీటి వినియోగంతో పోషకాల వినియోగ సామర్థ్యంతోపాటు పంటోత్పత్తుల దిగుబడి పెరుగుతుంది. పర్యావరణానికి సురక్షితమైంది.

## చక్కెర చేదవుతోంది!

కొత్తగూడెం : ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని మధుమేహ బాధితులకు ఇన్సులిన్ కొరత వేధిస్తోంది. రెండు నెలలుగా సర్కారు దవాఖానాలకు సరఫరా నిలిచిపోవటంతో 'ప్రైవేటు'లో కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. బాధితులకు నెలకు నాలుగు చొప్పున ఇంజెక్షన్లు కావాలి. గతంలో వీటిని ప్రభుత్వాసుపత్రుల్లో ఇచ్చేవారు. ప్రస్తుతం సర్కారు దవాఖానాలకు సరఫరా కాకపోవటంతో మార్కెట్‌లో నెలకు సుమారు రూ.500-600 వెచ్చించాల్సి వస్తోందని బాధితులు చెబుతున్నారు.

**నిర్లక్ష్యం వహిస్తే..**

ఒకవైపు ఇన్సులిన్ కొరతతో బాధితులు ఇబ్బందులు పడుతుండగా.. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వైద్యాధికారులు ఇటీవల చేపట్టిన సర్వేలోని గణాంకాలు ఆందోళన కలిగిస్తున్నాయి. 30ఏళ్లలోపు వారిలో అధిక మధుమేహం (షుగర్ శాతం అధికంగా కలిగినవారు, టైప్-1)తో బాధపడుతున్నవారు ఖమ్మం జిల్లాలో 169 మంది, భద్రాద్రి జిల్లాలో 73 మంది ఉన్నట్లు తేలింది. సర్వే పూర్తయితే భద్రాది జిల్లాలో ఈ సంఖ్య మరింత పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఆయా వ్యక్తులు తమ రక్తంలో గ్లూకోజ్ శాతాన్ని తగ్గించుకోవటానికి తప్పనిసరిగా ఇన్సులిన్ ఇంజెక్షన్ తీసుకోవాలి. నిర్లక్ష్యం వహిస్తే కీలకమైన అవయవాలు దెబ్బతినే ప్రమాదముంటుందని వైద్యనిపుణులు



హెచ్చరిస్తున్నారు.

**తలెత్తే సమస్యలు..**

టైప్-1 మధుమేహ బాధితుల శరీరం ఇన్సులిన్ ఉత్పత్తి చేయదు. ఇది రక్తంలో చక్కెర స్థాయులు అసాధారణంగా పెరగటానికి దారితీస్తుంది. వీరు జీవితాంతం ఇన్సులిన్‌పై ఆధారపడతారు. ఒకవేళ ఇన్సులిన్ తీసుకోకపోతే అధిక దాహం, తరచూ మూత్రవిసర్జన, వికారం, వాంతులు, అలసట, గందరగోళం వంటి సమస్యలు ఎదురవుతాయి. కొన్ని సందర్భాల్లో ప్రాణాంతకంగా మారవచ్చు.

**నివేదించినా.. సరఫరా అరకొరగానే..**

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఇన్సులిన్ ఇంజెక్షన్లు నిల్వ ఉండటం లేదు. వెంటనే పంపించాలని ఉన్నతాధికారులకు నెల రోజుల ముందే నివేదికలు పంపినా.. డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా కావటం లేదని సమాచారం. సర్వజనాసుపత్రులకు మాత్రం అరకొరగా అందుతున్నట్లు తెలిసింది. జిల్లాలో టైప్-1 మధుమేహ బాధితులను గుర్తించి ప్రభుత్వానికి నివేదించాం. రాష్ట్రవ్యాప్తంగా ఈ ప్రక్రియ కొనసాగుతోంది. ఇన్సులిన్ తప్పనిసరైనవారి లెక్క తేలితే ఆ సంఖ్యకు అనుగుణంగా సర్కారు ఇన్సులిన్ ఇంజెక్షన్లను సరాఫరా చేయనున్నట్లు తెలుస్తోంది. డా.రామారావు, ఎన్‌సీడీ, ప్రోగ్రాం అధికారి, ఖమ్మం

## నిలిచిన మిరప కొనుగోళ్లు

ఖమ్మం : ఖమ్మం వ్యవసాయ మార్కెట్లో మిరప కొనుగోళ్లు నిలిచిపోయాయి. ఉదయం జెండా పాట నిర్వహించినా... ఆర్డర్లు లేవని వ్యాపారులు కొనుగోలు చేయకుండా చేతులెత్తేశారు. ఏసీ మిరప జెండా పాట క్వింటా గరిష్ఠ ధర రూ.13,100 కాగా నాన్ ఏసీ మిరప క్వింటా గరిష్ఠ ధర రూ.8,500 నిర్ణయించారు. ఏసీ నిల్వలకు సంబంధించి మొత్తం 76 నమూనాలు రాగా 3,494 బస్తాలు వచ్చాయి. నాన్ ఏసీ రకాలు 800 బస్తాలు తెచ్చారు. కొంతమంది రైతులు, వ్యాపారులకు సంబంధించిన నిల్వలు వీటిలో ఉన్నాయి. ఏసీ నమూనాలను తిరిగి ఏసీ గిడ్డంగులకు తరలించగా, నాన్ ఏసీ మిరపను స్థానిక షెడ్లలో నిల్వ ఉంచారు. జెండా పాట తర్వాత వ్యాపారులు కొనుగోళ్లు నిలిపివేయడం అరుదు. విషయం తెలిసిన వెంటనే మార్కెట్ కమిటీ ఛైర్మన్ యరగర్ల హనుమంతరావు, వైస్ ఛైర్మన్ తల్లాడ రమేశ్, డీఎంఓ అలీం, మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి పి.ప్రవీణ్‌కుమార్ వ్యాపారులతో మాట్లాడారు. కొనుగోళ్లు కొనసాగించాలని కోరారు. ఇందుకు వ్యాపారులు నిరాకరించారు. విషయం అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఎగుమతి, దిగుమతిశాఖ బాధ్యులతో ఛైర్మన్ హనుమంతరావు సమావేశం నిర్వహించారు. మార్కెట్ సజావుగా నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. దిగుమతిశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దిరిశాల చినవెంకటేశ్వర్లు, ముత్యం ఉప్పల్‌రావు, మిర్చిశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాటేటి నాగేశ్వరరావు, యడ్లపల్లి సతీశ్‌తో చర్చలు జరిపారు.

**స్పందించకుంటే చట్టపరమైన చర్యలు..**

మార్కెట్లో కొనుగోళ్లు నిర్వహించకుంటే అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఆర్డర్లు లేవనే విషయం వాస్తవం కాదని, ఆర్‌డీ విషయంలో మార్కెటింగ్ శాఖ అధికారులు అంగీకరించకపోవడం వల్లనే వ్యాపారులు కొనుగోళ్లకు నిరాకరించినట్లు ప్రచారం జరుగుతోంది. జెండా పాట తర్వాత కొనుగోళ్లు నిలిపివేసిన ఘటనపై మార్కెట్ బైలా ప్రకారం చట్టపరమైన చర్యలు చేపట్టే అవకాశాన్ని అధికారులు పరిశీలిస్తున్నారు.

## సేవలు విస్తృతం.. వైద్యం పరిపుష్టం

సిద్దిపేట: వైద్యారోగ్యానికి ప్రభుత్వాలు పెద్దపీట వేస్తున్నాయి. పెరుగుతున్న జన రద్దీకి అనుగుణంగా సేవలను విస్తృతం చేస్తున్నాయి. జిల్లా కేంద్రమైన సిద్దిపేటలో ఎమ్మెల్యే హరీశ్‌రావు చొరవతో ఇప్పటికే సిద్దిపేటలో ప్రభుత్వ వైద్య కళాశాల అనుబంధ సర్వజన ఆసుపత్రి, రెండు యూపీహెచ్‌సీలు (పట్టణ ఆరోగ్య కేంద్రాలు), నాలుగు బస్తీ దవాఖానాలు కొనసాగుతున్నాయి. ప్రాథమిక స్థాయిలో జనాభా సంఖ్యకు అనుగుణంగా గత ఏడాది స్థానిక ఎన్జీవోస్ కాలనీకి మరో యూపీహెచ్‌సీ మంజూరు చేయడం విశేషం. రెండు చోట్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయి.

**కమిషనర్ చొరవతో పరిష్కారం**

పట్టణాల్లో 50 వేల జనాభాకు కనీసం ఒకటి చొప్పున యూపీహెచ్‌సీ అవశ్యం. ప్రస్తుతం జిల్లా కేంద్రంలో 43 వార్డుల్లో 1.57 లక్షల జనాభా నివసిస్తోంది. ఎన్జీవోస్ కాలనీలో స్థాపనకు ప్రతిపాదించగా దాదాపు 250 గజాల స్థలాన్ని కేటాయించారు. ఈ క్రమంలో స్థలం వివాదం తలెత్తగా బల్దియా కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ చొరవతో పరిష్కరించారు. గత ఫిబ్రవరిలో పనులకు శ్రీకారం చుట్టారు. రెండు నెలల్లో పనులు పూర్తి చేసేలా ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్లు కమిషనర్ వివరించారు.

**ప్రస్తుతం అద్దె భవనంలో..**

సిద్దిపేటలో నాసర్‌పురా, అంబేద్కర్ నగర్ యూపీహెచ్‌సీలు కొనసాగుతున్నాయి. నిత్యం సగటున 90 మంది చొప్పున రోగులు ఓపీ సేవలు పొందుతున్నారు. సీజనల్ వ్యాధుల సమయంలో సంఖ్య మరింత ఎక్కువగా ఉంటోంది. అంబేద్కర్‌నగర్ కేంద్రం నాటి నుంచి అద్దె భవనంలో కొనసాగుతోంది. వర్షం కురిస్తే భవనంలో నీరుగారుతోంది. శాశ్వత భవన నిర్మాణాన్ని జిల్లా రవాణా శాఖ కార్యాలయం సమీపంలో గత ఏడాది జులైలో ప్రారంభించారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.43 కోట్లు వెచ్చించారు. 250 గజాల విస్తీర్ణంలో చేపట్టిన పనులు చకచకా సాగుతున్నాయి. ప్రస్తుతం టైల్స్ పనులు సాగుతున్నాయి.

చురకలు



## గ్రేటర్‌లోకి మేడ్చల్ జిల్లా మున్సిపాలిటీలు!

మేడ్చల్ : గ్రామాలు లేని జిల్లాగా రూపు మార్చుకున్న మేడ్చల్ జిల్లాను గ్రేటర్‌లో విలీనం చేసేందుకు పురపాలక శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. వేగంగా అభివృద్ధి పనులు చేపట్టేందుకు, సికింద్రాబాద్ నుంచి తూంకుంట, సికింద్రాబాద్ నుంచి కొంపల్లి వరకు నిర్మించనున్న ఎలివేటెడ్ కారిడార్ల పనులు తొందరగా పూర్తిచేసేందుకు అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఆ జిల్లాలోని 4 శాసనసభ నియోజకవర్గాలు గ్రేటర్ పరిధిలో ఉన్నాయి. వీటికి అదనంగా 10 మున్సిపాలిటీలు, 4 కార్పొరేషన్లు జిల్లాలో ఉన్నాయి. వీటిని మినహాయిస్తే 34 పంచాయతీలు మాత్రమే ఉండగా అన్నింటినీ కలిపి 3 (అలియాబాద్, మూడుచింతలపల్లి, ఎల్లంపేట) మున్సిపాలిటీలుగా మార్చారు. రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల రికార్డులను పురపాలకశాఖకు అప్పగించారు.

**అధికారులు.. సిబ్బంది పురపాలక, మాతృశాఖలకు**

పంచాయతీల్లో కార్యదర్శులుగా విధులు నిర్వహించినవారు, ఎంపీడీవోలను నేరుగా పురపాలకశాఖలో కలిపేసుకుంటున్నారు.



ఇప్పటివరకూ వారు విధులు నిర్వహించిన సంవత్సరాలను సర్వీసుగా పరిగణించారు. అధికారులు, సిబ్బంది ఎక్కువగా ఉన్న మున్సిపాలిటీల్లో మాత్రం పంచాయతీరాజ్ శాఖ అధికారులు, సిబ్బందిని మాతృశాఖకు పంపుతున్నారు. ఇక పంచాయతీల్లో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహించిన వారిని వార్డుల్లో పనివిధానం, ఇతర కార్యకలాపాలను దృష్టిలో ఉంచుకొని ఉద్యోగం ఇస్తున్నారు. సర్వే సెక్షన్లు, పంచాయతీల్లో పన్నుల వసూళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, పంచాయతీ గ్రామాల్లో పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బందికే ఉద్యోగాలు ఇస్తున్నారు.

**ఉపాధిహామీ లేనట్టే**

గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధిహామీ కింద ఏటా 110 పనిదినాల్లో పనికల్పిస్తుంటారు. 34 పంచాయతీలు మున్సిపాలిటీలుగా మారడంతో ఉపాధిహామీ వర్తించదు. జిల్లాలో 17 వేల జాబ్ కార్డులుండగా క్రియాశీలకంగా పనిచేసే 6 వేల మందికి రూ.3 కోట్ల వరకూ చెల్లించే వారు. ఉపాధిహామీ లేనందున మున్సిపల్ అధికారులు పట్టణాభివృద్ధి నిధుల కింద మొక్కలు నాటించి కూలీ చెల్లించనున్నారు.

## కాసుల కక్కుర్తి.. గర్భవిచ్ఛిత్తి

భువనగిరి : జిల్లా కేంద్రంలో గర్భవిచ్ఛిత్తి నిర్భయంగా చేస్తున్నారు. జనరల్ ఆసుపత్రి సమీపంలో ప్రైవేటు ఆసుపత్రి కేంద్రంగా లింగ నిర్ధారణ, భ్రూణహత్యల దందాకు తెరదీశారు. లింగనిర్ధారణ పరీక్షలు చేసి మరీ ఆయువు తీస్తున్నారు. భువనగిరిలో గాయత్రి ఆసుపత్రిలో ఇద్దరు మహిళలకు గర్భవిచ్ఛిత్తి చేస్తూ ఇద్దరు వైద్యులు పోలీసులకు పట్టుబడిన నేపథ్యంలో జిల్లాలో అధికారులు పర్యవేక్షణపై కథనం.

**కొరవడిన పర్యవేక్షణ**

జిల్లాలో ఆసుపత్రులు, స్కానింగ్ కేంద్రాలపై నిఘా లేకపోవడంతో లింగ నిర్ధారణ చేసి గర్భవిచ్ఛిత్తి(అబార్షన్)కి పాల్పడుతున్నారు. ఒకవేళ పట్టుబడినా అధికారులు అండతో మరోపేరుతో స్కానింగ్ కేంద్రాలు, ఆసుపత్రులు ప్రారంభిస్తున్నారు. తాజాగా గాయత్రి ఆసుపత్రిలో అబార్షన్లు చేసిన డాక్టర్ శివకుమార్ గతంలో స్వాతి ఆసుపత్రిలో ఇదే విధంగా చేయడంతో ఆసుపత్రిని సీజ్ చేశారు. మరొకరి పేరుతో ఆసుపత్రిని నిర్వహిస్తున్నారు. భువనగిరితో పాటు, తుర్కపల్లి, బొమ్మలరామారం, వలిగొండలో గతంలో సీజ్ చేసిన కేంద్రాలు మరోపేరుతో కొనసాగుతూ లింగ నిర్ధారణకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఒక్కో అబార్షన్‌కు రూ.30 వేల నుంచి రూ.70 వేల వరకు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. ఆర్‌ఎంపీలు గుట్టుచప్పుడు కాకుండా లింగనిర్ధారణ, అబార్షన్లు చేసే ఆసుపత్రుల వద్దకు గర్భిణులను




తీసుకొస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. పీసీపీఎన్‌డీటీ(ప్రీ కన్‌సెప్షన్స్ ప్రీనెటల్ డయాగ్నోస్టిక్ టెక్నిక్స్) ప్రత్యేక తనిఖీలో భాగంగా జిల్లాలో బృందం ఇటీవల ఆసుపత్రులు, స్కానింగ్ కేంద్రాలను తనిఖీ చేసింది. జిల్లాలో అనుమతి పొందినవి 57 కేంద్రాలు ఉండగా ప్రస్తుతం 41 మాత్రమే నడుస్తున్నాయి. వాటిలో 38 కేంద్రాల్లో బృందం తనిఖీలు నిర్వహించింది.

**చట్టం ఏం చెబుతోంది**

భ్రూణ హత్యలను నిలువరించేందుకు ప్రభుత్వం 1994లో పీసీపీఎన్‌డీటీ చట్టాన్ని తీసుకొచ్చింది. దీని ప్రకారం లింగ నిర్ధారణ నిర్వహించే స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులకు, గర్భవిచ్ఛిత్తి(అబార్షన్) చేసిన వైద్యులు, ప్రోత్సహించిన కుటుంబ సభ్యులకు గరిష్ఠంగా ఐదేళ్ల జైలు శిక్ష, రూ.50 వేల జరిమానా విధించే అవకాశం ఉంది. అయినా బెదరకుండా అధికారుల అండతో అనుమతులు పొంది మరోపేరుతో ఆసుపత్రులను తెరచి లింగనిర్ధారణ, భ్రూణహత్యలు చేస్తున్నారు.

**తనిఖీలపై సందేహాలెన్నో..**

భువనగిరిలోని గాయత్రి ఆసుపత్రి నిర్వహిస్తున్న డాక్టర్ శివకుమార్ విదేశాల్లో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. భారతదేశంలో నేషనల్ మెడికల్ కమిషన్ నిర్వహించే విదేశీ వైద్య పరీక్ష(ఎఫ్‌ఎమ్‌జీఈ) ఉత్తీర్ణత సాధించలేదు. శివకుమార్ భార్య గాయత్రి విదేశాల్లో ఎంబీబీఎస్ పూర్తి చేసినట్లు ఆమె ఆసుపత్రి డైరెక్టర్‌గా ఉన్నారు. పీసీపీఎన్‌డీటీ ప్రోగ్రామ్‌లో భాగంగా ఆసుపత్రిలో ఇటీవల అధికారుల బృందం తనిఖీలు చేసి నెలరోజులు కూడా కాలేదు. అన్నీ సవ్యంగానే ఉన్నాయని బృందం తేల్చడం పలు అనుమానాలకు తావిస్తోంది.

# కుదిరిన సయోధ్య



హైదరాబాద్: కంటోన్మెంట్‌లో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి మార్గం సుగమమైంది. రూ.960 కోట్లతో పనులు చేపట్టేందుకు రక్షణ శాఖ, బల్దియా మధ్య సయోధ్య కుదిరింది. బల్దియా కమిషనర్ ఆర్వీ.కర్ణన్ అధ్యక్షతన ఆయన కార్యాలయంలో జరిగిన సమావేశంలో జీహెచ్‌ఎంసీ, రక్షణశాఖ, రెవెన్యూ అధికారులు సుదీర్ఘంగా చర్చించారు. పైవంతెన పనులకు వారంరోజుల్లో టెండర్లు పిలవాలని ఇంజినీర్లను కర్ణన్ ఆదేశించారు. 2 నెలల్లో పనులు మొదలవుతాయి.

**ఏళ్లనాటి సమస్య..**సఫిల్‌గూడ, మల్కాజిగిరి, ఆర్కేపురం, సైనిక్‌పురి, ఈసీఐఎల్ ప్రాంతాల నుంచి సికింద్రాబాద్‌కు రాకపోకలకు ఆర్మీ ఆర్డినెన్స్ సర్కిల్(ఏఓసీ) రహదారుల నుంచి వెళ్లాలి. అయితే ఈస్ట్‌మారేడుపల్లి ఏఓసీ గేటును అప్పుడప్పుడు సైన్యాధికారులు మూసేస్తుంటారు. దీంతో ప్రజలు 5 కి.మీ అదనంగా ప్రయాణించి మల్కాజిగిరి మీదుగా మెట్టుగూడ వద్ద సికింద్రాబాద్ చేరుకుంటున్నారు.

**భూమికి బదులు భూమి..:** ఏఓసీలోని 4 రోడ్ల పొడవు 8.8 కి.మీ. వాటికి ప్రత్యామ్నాయంగా జీహెచ్‌ఎంసీ 6 కి.మీ ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మించనుంది. ఈక్రమంలో 35 ఎకరాల భూమిని రక్షణ శాఖ కోల్పోతోంది. కొన్ని భవనాలను కూడా కూల్చాలి. అందుకు రూ.442 కోట్ల నష్టపరిహారం చెల్లిస్తామని జీహెచ్‌ఎంసీ ప్రతిపాదించగా ఆ ధరతో సమానమైన భూమి ఇవ్వాలని రక్షణ శాఖ కోరింది. దీనిపై ఇన్నాళ్లూ ఏకాభిప్రాయం కుదరలేదు. తాజా అల్వాల్, శామీర్‌పేట, జవహర్‌నగర్, తదితర మండలాల పరిధిలో 100 ఎకరాలు రక్షణశాఖకు ఇవ్వనున్నారు. మరో 7 ఎకరాల భూమికి పరిహారం ఇవ్వకుండా ఏటా లీజు రుసుము చెల్లించేట్టు ఒప్పందం కుదిరింది.

కారిడార్ పొడవు.. 6 కి.మీ, వెడల్పు.. 100 అడుగులు
భూసేకరణ చేపట్టాల్సిన ఆస్తులు.. 11
అంచనా వ్యయం.. రూ.498.10 కోట్లు
వాటి విస్తీర్ణం.. 42.202
ఎకరాల రక్షణ శాఖ భూమి, 3,451.98
చ.గజాల రైల్వే భూమి, 1,477 చ.గజాల ప్రైవేటు భూములు

# భూములు అరకొర.. పనులకు తొందర



హైదరాబాద్: పెరుగుతున్న ఆకాశహర్మ్యాలు.... అవుటర్‌చుట్టూ విస్తరిస్తున్న వాణిజ్య కేంద్రాలు... ప్రాంతీయ వలయ రహదారి వరకు విద్యాసంస్థలు, పరిశ్రమలు, డేటా కేంద్రాలు, ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రాలతో వేగంగా నగరం విస్తరిస్తోంది. వీటికి తగినట్టు పెరుగుతున్న విద్యుత్తు డిమాండ్‌ను తట్టుకునేందుకు కొత్తగా 33/11కేవీ ఉపకేంద్రాల నిర్మాణాలకు దక్షిణ తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థ(టీజీఎస్పీడీసీఎల్) ప్రణాళికలు రూపొందించింది. వీటి నిర్మాణానికి పలుచోట్ల ప్రభుత్వ స్థలాలు కేటాయించినా.. మెట్రోజోన్, రంగారెడ్డి జోన్‌లో టైటిల్ వివాదాలతో అడుగు ముందుకు పడటం లేదు. ఉపకేంద్రాల నిర్మాణానికి మూడుసార్లు గ్లోబల్ టెండర్లు పిలిచినా స్థలాలు లేనిదే కట్టేదెలా అని ఏ సంస్థ సిద్ధం కావడం లేదు.

**డిమాండ్ పెరిగినా..:** నగరంలో 5వేల మెగావాట్ల డిమాండ్ తట్టుకునేలా విద్యుత్తు ఉపకేంద్రాలు, లైన్లు ఉన్నాయి. ఈ ఏడాది వేసవిలో డిమాండ్ ఐదువేల మెగావాట్లకు తాకే అవకాశం ఉందనే అంచనాతో ఇప్పటికే ఉన్న ఉపకేంద్రాల్లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచారు. లేనిచోట కొత్త ఉపకేంద్రాలను ప్రతిపాదించారు. వచ్చే ఐదేళ్లకు 61 ఉపకేంద్రాల అవసరం ఉందని గత ఏడాది అంచనా వేశారు. ఆ తర్వాత ఈ సంఖ్య మరో 20కి పెరిగింది. ఉపకేంద్రం ఏర్పాటుకు డిస్కం గుర్తించిన స్థలాలు రెవెన్యూశాఖతో పాటూ అటవీ, జీహెచ్‌ఎంసీ, పోలీసు శాఖలకు చెందినవి ఉన్నాయి. ఆయా సంస్థలకు డిస్కం గతంలో లేఖలు రాసింది.

మెట్రోజోన్‌లో 18 చోట్ల, రంగారెడ్డి జోన్‌లో 25 చోట్ల ప్రతిపాదించారు. ఈ మేరకు కొన్నిచోట్ల స్థలాలను ఆయా విభాగాలు కేటాయించగా.. మరికొన్ని చోట్ల కేటాయించిన భూములపై వివాదాలు నడుస్తున్నాయి. అత్తాపూర్‌లో 33/11కేవీ ఉపకేంద్రం నిర్మాణం కోసం కేటాయించిన స్థలంపై వివాదం నెలకొనడంతో..మరోచోట స్థలానికి విద్యుత్తు అధికారులు ప్రయత్నిస్తున్నారు.

పాతబస్తీలో స్థలాల కొరత అధికంగా ఉంది. కొన్నిచోట్ల కోర్టు కేసులున్నాయి.

ఈ రెండు జోన్లలో స్థలాల లభ్యత ఉన్న ఆరేడు చోట్ల ఉపకేంద్రాల నిర్మాణాలు వేర్వేరు దశలో ఉన్నాయి.

ఇండోర్‌తో సరిపెట్టుకోవాల్సిందేనా..?

ఒక్కో 33/11కేవీ ఉపకేంద్రానికి 1500 నుంచి 2000 చదరపు గజాల భూముల అవసరం ఉంటుందని ఇంజినీర్లు చెబుతున్నారు. ఇక్కడ అవుట్‌డోర్ ఉపకేంద్రాన్ని తక్కువ వ్యయంతో రెండు నెలల్లో నిర్మించుకునేందుకు వీలు ఉంటుంది. భవిష్యత్తులో విస్తరణను తగినట్టు ఆయా ప్రాంతాల్లో విద్యుత్తు కార్యాలయాల ఏర్పాటుకు కూడా స్థలాలను వినియోగించుకునేందుకు కోరుతున్నారు. పెద్దగా విస్తీర్ణం అవసరం లేకపోయినా.. అందులో నాలుగోవంతు ఇచ్చినా ఇండోర్ సబ్‌స్టేసన్ కట్టేస్తామని అధికారులు చెబుతున్నారు.

# హద్దులు మీరి ఆక్రమణలు



సిరిసిల్ల: జిల్లాలోని సగానికిపైగా చెరువుల్లో ఆక్రమణదారులు నకిలీ పట్టాలు సృష్టించి సాగుకు యోగ్యంగా మార్చుకున్నారు. పట్టణాలు, మండల కేంద్రాల్లో ఏకంగా ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు ఆరు వందల చెరువులు ఉన్నాయి. జిల్లాలో సాగుకు యోగ్యంకాని సుమారు 30 వేల ఎకరాలను ప్రభుత్వం గుర్తించింది. ఆక్రమణదారులు ఇప్పటికే రైతుబంధు పేరిట రూ.లక్షల్లో ప్రజాధనాన్ని స్వాహా చేశారు. అదీ చాలదన్నట్లు ప్లాట్లుగా చేసి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. అమాయకులను మోసం చేస్తున్నారు.

**వరదకాల్వలు పూడ్చి.. వెంచర్లు వేసి**

పట్టణ ప్రాంతాల్లో నీటిపారుదల, రెవెన్యూ శాఖల మధ్య సమన్వయ లేమితో జల వనరులు ఆక్రమణ యథేచ్ఛగా జరుగుతోంది. చెరువుల శిఖం, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలోని భూములకు అక్రమ పట్టాలు సృష్టిస్తున్నారు. చెరువుల్లోకి వచ్చే వరదకాల్వలను పూడ్చివేసి నీరు రాకుండా చేస్తున్నారు. ఈ చెరువు ఎఫ్‌టీఎల్ ప్రాంతాల్లో చదును చేస్తూ ప్లాట్లుగా మార్చుతున్నారు. దీంతో పలు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. ఇలాంటివి వేములవాడ, సిరిసిల్ల పట్టణాల్లో 12 వెంచర్లలో వందల ఎకరాలు ఉన్నట్లు గుర్తించారు. 8 వెంచర్లకు అనుమతులు ఇవ్వకుండా అధికారులు పక్కన పెట్టారు. కొన్నిచోట్ల వరదకాల్వలలోనే ప్లాట్ల చేశారు. అలాంటి వాటికి అధికారులు ఇంటి అనుమతులు ఇవ్వకుండా నిషేధిత జాబితాలో ఉంచారు. కొన్ని చెరువులకైతే వాటి విస్తీర్ణం, ఎఫ్‌టీఎల్ పరిధి తదితర అంశాలపై సరైన పత్రాలు కూడా లేవు.

ఇటీవల భూభారతి చట్టంలో భాగంగా గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. గతంలో పట్టాలు పొంది.. స్థానికంగా భూములు చూపక ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న వారు.. పట్టాలు లేకుండా సాగు చేసుకుంటున్న వారు.. హద్దులు లేకుండా ఇబ్బందులు పడుతున్న వారు దరఖాస్తులు పెట్టుకున్నారు. వీరంతా సర్వేనంబర్ల వారీగా భూముల విస్తీర్ణం.. హద్దులు తేలక ఏళ్ల తరబడి ఇబ్బందులు పడుతున్నారు. దీనిని ఆసరాగా చేసుకుని ఆక్రమణలు కొనసాగుతున్నాయి.

**సర్వేతో సమస్యలు దూరం**

చెరువులు, ప్రభుత్వ భూములను సర్వే చేసి, చుట్టూ ఫెన్సింగ్ నిర్మాణాలు చేపట్టాలని గతంలో రాష్ట్ర నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

హద్దులు నిర్ణయించేందుకు సర్వేయర్ల కొరత, నిధుల కేటాయింపుల్లేక అవి బుట్ట దాఖలయ్యాయి. ప్రస్తుతం భూభారతి చట్టం అమల్లో భాగంగా రెవెన్యూ గ్రామానికి ఒకరి చొప్పున జీపీవోల నియామకం చేపట్టనున్నారు. అలాగే సర్వే వ్యవస్థ బలోపేతం చేసేందుకు జిల్లాలో అర్హులైన సర్వేయర్లకు శిక్షణ ఇస్తున్నారు. అది ఈ నెల 20తో ముగియనుంది. భూభారతి అర్జీలలోని ఆక్రమణలకు గురైన చెరువులు, ప్రభుత్వ భూములను సర్వేచేసి.. హద్దులు నిర్ణయిస్తే జిల్లాలో సగానికి పైగా భూసమస్యలు తీరుతాయి.

# అరకొర సేవలే

హైదరాబాద్ – సికింద్రాబాద్, కాప్రా, కార్వాన్, పేట్‌బషీరాబాద్, అమీర్‌పేట్, న్యూస్‌టుడే: పేదలకు వ్యాధి నిర్ధారణ పరీక్షల భారం తగ్గించాలని గ్రేటర్‌లో ఏర్పాటు చేసిన డయాగ్నస్టిక్ మినీహబ్‌ల్లో అరకొర సేవలే అందుతున్నాయి. ఏరియా ఆసుపత్రులకు, పట్టణ ఆరోగ్య కేంద్రాలకు అనుసంధానంగా 18 ప్రాంతాల్లో ఏర్పాటు చేసి మొత్తం 53 రకాల సేవలు అందుబాటులోకి తెచ్చారు. రక్త, మూత్ర పరీక్షలతోపాటు ఎక్స్‌రే, థైరాయిడ్ పరీక్షలను అక్కడే నిర్వహించి గాంధీ, ఉస్మానియా ఆసుపత్రులపై భారం తగ్గించాలనేది వీటి ఉద్దేశం. చాలాప్రాంతాల్లో సజావుగా సాగడం లేదనే ఫిర్యాదులపై 'ఈనాడు' పరిశీలించగా ఎక్కడా అన్నిరకాల పరీక్షలు చేయడం లేదని తేలింది.

**వివిధ కేంద్రాల్లో సేవలు ఇలా..**

అమీర్‌పేట్‌లో ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో డయాగ్నస్టిక్ కేంద్రంలో స్కానింగ్, ఎక్స్‌రే, ఈసీజీ మాత్రమే చేస్తున్నారు. మిగిలిన పరీక్షలకు రక్త నమూనాలను నారాయణగూడలోని ఐపీఎంకు పంపుతున్నారు. సీతాఫల్‌మండి ఆసుపత్రిని 70 పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దేందుకు



నిర్మాణాలు చేపట్టడంతో ప్రస్తుతం థైరాయిడ్ ప్రొఫైల్, విటమిన్ బి12, విటమిన్ డి3 పరీక్షలు చేయడం లేదు.

కార్వాన్ పన్నీపురాలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రానికి అనుసంధానంగా డయాగ్నస్టిక్ హబ్‌ను అందుబాటులోకి తెచ్చారు. ల్యాబ్ టెక్నీషియన్ ఒక్కరే ఉన్నారు. షాపూర్‌నగర్‌లో రక్త పరీక్షల పరికరాలు లేవు. ఫలితంగా కంప్లీట్ బ్లడ్ పిక్చర్ (సీబీపీ) చేయడం లేదు. కుషాయిగూడ పీహెచ్‌సీలో తెలంగాణ డయాగ్నస్టిక్ మినీ హబ్‌ను 2022లో ఏర్పాటు చేశారు. అల్ట్రాసౌండ్ స్కానింగ్ సోమ, బుధ, గురువారాల్లో నిర్వహిస్తున్నారు. ఈసీజీ, ఎక్స్‌రే, డెంగీ, మలేరియా, హిమోగ్లోబిన్, హెచ్‌ఐవీ, హెపటైటిస్, వీడీఆర్‌ఎల్, ప్రెగ్నెన్సీ, మూత్రం, కళ్లె పరీక్షలు చేస్తున్నారు. థైరాయిడ్, లిపిడ్‌ప్రొఫైల్, కిడ్నీ, లివర్, ఆర్‌ఎఫ్‌టీ, ఎల్‌ఎఫ్‌టీ కోసం బయటకు పంపుతున్నారు.

## ఎదుగుదలలేని మొక్కలు.. వృథాగా నిధులు

సారంగాపూర్: ఏటా వన మహోత్సవంలో భాగంగా సమయానికి గ్రామాల్లో మొక్కలు నాటడంతో వాటి ఎదుగుదల లేకపోవడంతో నిధులు వృథా అవుతున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని వచ్చే ఏడాది మొక్కలు నాటేందుకు ప్రభుత్వం ఇప్పటినుంచే దృష్టి సారించింది. ఇందులో భాగంగా ఇప్పటికే గ్రామాల్లోని నర్సరీల్లో ప్రక్రియ ప్రారంభించి లక్ష్యాన్ని నిర్దేశించారు. జిల్లా వ్యాప్తంగా నీడనిచ్చే 13 రకాలకుపైగా మొక్కలను ఎంపిక చేసి విత్తనాలు విత్తుతున్నారు.

**17 లక్షల పెంపకం**

జిల్లాలో 17 లక్షల మొక్కలను పెంపకం చేపట్టేందుకు మండలాల వారీగా ప్రక్రియ ప్రారంభించారు. జిల్లాలో 383 పంచాయతీలుండగా..



279 పంచాయతీలలో స్థలాలను ఎంపిక చేశారు. ఇందులో 278 ప్రభుత్వ స్థలాలు, ఒకటి ప్రైవేట్ స్థలంలో పెంచుతున్నారు. 17.02 లక్షల కవర్లలలో మట్టిని నింపి సిద్ధం చేయగా 9,18,300 కవర్లలలో వివిధ రకాల నీడనిచ్చే విత్తనాలు విత్తారు.

**మీటరుకు పైగా పెరగాల్సిందే**

గ్రామాల్లో పెంచుతున్న మొక్కల పెంపకం కేవలం నామమాత్రంగా, వర్షాలు ప్రారంభానికి కొద్దినెలల ముందు నుంచి ప్రక్రియ ప్రారంభించి పెంచుతుండడంతో పెరగడంలేదు. దీంతో ఏడాది ముందు నుంచే ప్రణాళికాబద్ధంగా పెంపకం చేపట్టాలని అధికారులు భావించారు. కనీసం ప్రతి మొక్క మీటరుకు పైగా పెరిగేలా చూడాల్సి ఉంటుంది. ఇందుకు మూడుసార్లు కవర్లలలో పెరిగిన మొక్కను మార్చాల్సి ఉంటుంది. రహదారుల పక్కన నాటేందుకు రావి, అల్లనేరడి, ఇప్ప, రేలా, వేప తదితర వంటి మొక్కల విత్తనాలను విత్తుతున్నారు.

**ఏపుగా పెరిగే అవకాశం**

ఏటా ముందస్తుగా మొక్కల పెంపకం లేకపోవడంతో సరైన ఎత్తులో అవి పెరగకపోవడంతో లక్ష్యాన్ని చేరుకోలేకపోతున్నాం. దీంతో ఇప్పటినుంచే వచ్చే ఏడాదికి సంబంధించినవి పెంచేందుకు నర్సరీల్లో ప్రణాళిక తయారుచేసి గ్రామాల వారీగా లక్ష్యాన్ని నిర్దేశించాం. ప్రస్తుతం మట్టి నింపే ప్రక్రియ పూర్తికాగా.. నీడనిచ్చే మొక్కల విత్తనాలు విత్తుతున్నాం. మదన్‌మోహన్, అదనపు డీఆర్డీవో

## అడ్డగోలుగా తవ్వుతున్నా.. వారికి మామూలే..!

కనగల్ : మంత్రి ఇలాకాలో ఇసుక దందా జోరుగు సాగుతోంది. అభివృద్ధి పథకాల పేరిటి రాత్రింబవళ్లు అక్రమంగా రవాణ చేస్తున్నారు. రాత్రి వేళల్లో పొక్లెయిన్‌లు వాగులో వాలుతున్నాయి. ఇలా 10 నుంచి 15 వరకు ఆయా గ్రామాల్లో పొక్లెయిన్‌లు నడుస్తున్నాయి. ఇసుక అక్రమ రవాణాదారులు వంతెనల కిందనే ఇసుకను తోడేస్తూ.. ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. నిత్యం గ్రామం నుంచి జిల్లా స్థాయి అధికారులు కనగల్ వంతెన నుంచే వెళ్తున్నా.. పోలీస్‌స్టేషన్, తహసీల్ కార్యాలయాలు కూత వేటు దూరంలో ఉన్నా.. ఆయా అధికారులకు ఇది 'మామూళ్లు' విషయంగానే పట్టించుకోవడంలేదు. వంతెన వద్ద 15 అడుగుల మేరకు గుంతలు తవ్వి ఇసుకను రాత్రివేళల్లో తరలిస్తుంటే వంతెనకే కాక.. గుంతలు ప్రమాదకరంగా మారాయి. ఇలా ఆయా గ్రామాల్లోని వాగుల్లో పెద్దపెద్ద గుంతలు దర్శనం ఇస్తున్నాయి. కనగల్ వంతెన వద్ద ఇసుకను తరలిస్తుండటంతో భూగర్భజాలాలు అడుగంటాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొక్లెయిన్‌లతో ఇసుకను నింపుతుంటే అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని యువత సామాజిక మాధ్యమాల్లో ప్రశ్నిస్తున్నారు. అభివృద్ధి పథకాల పేరిట అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న విషయం అధికారులకు తెలిసినా పట్టుకుంటే ఎక్కడ బదిలీ బహుమతి వస్తుందోనని చూసీచూడనట్లుగా వెళ్తున్నారు. వాగులో తవ్వకాలు చేస్తున్న యంత్రాలపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

# నీరు సురక్షితమేనా!

గోదావరిఖని : ఏటా వర్షాకాలం వస్తూ వెంట అంటు వ్యాధులు, రోగాలను తీసుకురావడం సాధారణమైపోయింది. ఇందుకు ప్రధాన కారణం కలుషిత నీరు. వర్షాకాలం నేపథ్యంలో అందరూ తాగునీటి వనరుల నాణ్యతపై దృష్టి సారించాలి. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో మిషన్ భగీరథ పథకంతోపాటు స్థానిక సంస్థల ద్వారా చాలా గ్రామాల్లో తాగునీరు సరఫరా చేస్తున్నారు. వర్షాల నేపథ్యంలో అధికార యంత్రాంగం శరవేగంగా సమాయత్తం కావాలి. జలాశయాలు, ట్యాంకులు, నల్లాల వద్ద నీటి నమూనాలను సేకరించి తప్పనిసరిగా పరీక్షలు చేయాలి. నాణ్యత లోపించినట్లు నిర్ధారణ అయితే వెంటనే చర్యలు తీసుకోవాలి.

**ప్రజా కుళాయిలు**

గ్రామాల నుంచి నగరాల వరకు అనేక చోట్ల ప్రజల కోసం ఏర్పాటు చేసిన ప్రజా కుళాయిలను గాలికి వదిలేస్తున్నారు. వీటి నాణ్యత, పర్యవేక్షణ విషయాన్ని అధికారులు పూర్తిగా మరిచారు. మురికి వాడలు, బస్టాండ్ ప్రాంతాల్లో ఎక్కువగా ఉన్నాయి. వీటి నుంచి సరఫరా అయ్యే నీటికి నాణ్యత పరీక్షలు చేయడం లేదు. ముఖ్యంగా పాఠశాలల కుళాయిల్లో నీటిని పరీక్షించాలనే బాధ్యతను అందరూ విస్మరించారు. నిర్లక్ష్యం వహిస్తే విద్యార్థుల ఆరోగ్యం ప్రభావితమవుతుంది.

**లీకేజీల సమస్యలు**

నిర్లక్ష్య ధోరణితో, నాసిరకమైన సామగ్రితో పైపులైన్లు వేసి పూడ్చడంతో లీకేజీలు జరిగి నీరు కలుషితమవుతుంది. అధికలోతులో, డ్రైనేజీల లోపల వేసిన పైపులు లీకేజీకి గురైతే గుర్తించే అవకాశం ఉండదు. అటువంటి సందర్భాల్లో ఆ పైపుల నుంచి సరఫరా అయ్యే నీటిని తాగితే రోగాలకు ఆహ్వానం పలికినట్లే. వర్షాకాలంలో కలుషితమయ్యే నీటి వల్లే డయేరియా, టైఫాయిడ్, కామెర్లు, రకరకాల జ్వరాలు, వాంతులు, విరేచనాలు వస్తుంటాయి. ఇవి కొన్నిసార్లు వెంటనే తగ్గిపోయినా, మరికొన్ని సందర్భాల్లో ప్రాణాపాయ స్థితికి తీసుకెళ్తాయి.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

గ్రామ పంచాయతీ, మున్సిపలిటీ, కార్పొరేషన్‌లలోని సంబంధిత సిబ్బంది ఏటా నాణ్యత నిర్ధారణ పరీక్షలు చేయాలి గ్రామీణ ప్రాంతాల్లో మిషన్ భగీరథ అధికారులు పరీక్షలు నిర్వహించాలినీటి ట్యాంకులను తరచూ శుభ్రం చేయాలిఫిల్టర్ బెడ్‌లు, గృహాల వద్ద ఉండే నల్లాల నుంచి నమూనాలు సేకరించాలిలీకేజీ సమస్యలు ఉంటే మరమ్మతు చర్యలు తీసుకోవాలి వర్షాకాలమంతా ప్రతిరోజు క్లోరిన్ టెస్టు కిట్ల ద్వారా నాణ్యత స్థాయిని పరిశీలిస్తూ ఉండాలి

**నెలకు మూడు సార్లు శుద్ధి –** అరుణశ్రీ, పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ వంద రోజుల ప్రణాళికలో నీటి పరీక్షలు చేయడం ప్రత్యేకంగా చేర్చాం. ఈ విషయమై సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చాం. గ్రామాలు, పట్టణాలు, నగరాల్లోని ట్యాంకులను ప్రతినెల 1, 11, 21 తేదీల్లో మూడు సార్లు శుభ్రం చేయాలని ఆదేశించాం. గ్రామ కార్యదర్శుల ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లోని అంగన్‌వాడీ ఆయాలు, ఏఎన్ఎంలకు నీటి నమూనాలు సేకరించి పరీక్షలు చేసే విధానంపై శిక్షణ ఇచ్చాం.

# మహిళా శక్తి.. ఆర్థిక వృద్ధి

ధర్మారం: నేటి తరం మహిళామణులు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటు, అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఇందిర మహిళా శక్తి క్యాంటీన్లను విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ సహకారం తోపాటు బ్యాంకు లింకేజీ, గ్రామ సంఘాల వద్ద ఆర్థిక వనరులు కూడగట్టుకున్న మహిళా సంఘాల ప్రతినిధులు.. క్యాంటీన్ల నిర్వహణతో స్వయం ఉపాధి పొందడంతోపాటు నాణ్యమైన భోజనం అందించ డంలో సఫలమయ్యారు.

**పెరిగిన ఆత్మవిశ్వాసం**

ధర్మారానికి చెందిన మేడవేని లహరిది నిరుపేద కుటుంబం. ఇద్దరు పిల్లలు. కుటుంబ పోషణకు ఉపాధిహామీ, వ్యవసాయ పనులకు వెళ్లేవారు. ఈ క్రమంలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ల గురించి తెలుసుకొని.. నలుగురు స్థానిక మహిళలతో కలిసి క్యాంటీన్ ఏర్పాటుకు ముందుకొచ్చారు. కలెక్టర్ శ్రీహర్ష ఆదేశాలతో ప్రధాన రహదారి పక్కనున్న మండల పరిషత్తుకు చెందిన రెండు దుకాణాలను.. అద్దె లేకుండా ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ కేటాయించారు. ఓ వంట మనిషిని నియమించుకున్నారు. ఐదుగురు భాగస్వాములు నెలకు రూ.9 వేల



చొప్పున వేతనం తీసుకుంటున్నారు. దీంతో తమ కాళ్లపై తాము నిలబడేలా ఆత్మవిశ్వాసం పెరిగిందని లహరి చెబుతున్నారు.

**ఉమ్మడి జిల్లాలో 15 వరకు**

ఆయా జిల్లా అధికారుల ప్రోత్సాహంతో పెద్దపల్లి జిల్లాలో 4, కరీంనగర్‌లో 3, సిరిసిల్లలో 3, జగిత్యాలలో 5 చొప్పున ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు ఏర్పాటు చేసుకున్నారు. అద్దె భారం పడకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. పెట్టుబడికి బ్యాంకు లింకేజీ, గ్రామ సంఘాల వద్ద రుణాలు తీసుకున్న నిర్వాహకులు.. సకాలంలో కిస్తులు చెల్లించడంతోపాటు క్యాంటీన్లకు వచ్చేవారి అభిరుచులకు తగ్గట్టుగా వేర్వేరు రకాల ఆహార పదార్థాలను అందిస్తున్నారు. ఆహార పదార్థాల తయారీకి కావాల్సిన బియ్యం, పప్పులు తదితర సరకులను స్థానిక రైతుల నుంచే సేకరిస్తున్నారు.

**ఆర్థికంగా ఎదుగుతున్నాం– గంగాధర ఉమ**

క్యాంటీన్ ప్రారంభించి ఎనిమిది నెలలు కావస్తోంది. ప్రారంభంలో నిర్వహణ కాస్త ఇబ్బందిగా ఉండేది. ప్రస్తుతం ఆర్థికంగా ఎదుగుతున్నాం. వివిధ రకాల అల్పాహారం, భోజనం తయారు చేస్తున్నాం. అభిరుచులకు తగ్గట్టుగా వంటలు తయారుచేసి అందిస్తున్నాం. స్థానికంగా ఆదరణ బాగుంది. మండల పరిషత్తుకు చెందిన రెండు షట్టర్లను ఎలాంటి అద్దె లేకుండా జిల్లా కలెక్టర్ ఇప్పించారు.

**మెరుగైన శిక్షణ ఇప్పించాం– నాగేశ్వరరావు, డీపీఎం సెర్ప్, పెద్దపల్లి**

క్యాంటీన్లు నిర్వహిస్తామని ముందుకు వచ్చినవారికి సెర్ప్ ఆధ్వర్యంలో రెండు వారాలు శిక్షణ ఇప్పించాం. భోజనం, వివిధ రకాల వంటకాల తయారీపై నిపుణులతో శిక్షణ ఇచ్చాం. క్యాంటీన్‌కు వచ్చేవారితో వ్యవహరించాల్సిన తీరు, ఆహార పదార్థాల నాణ్యత, శుభ్రత తదితర అంశాలపై అవగాహన కల్పించాం. ప్రారంభించిన అన్నిచోట్లా విజయవంతంగా నడుస్తున్నాయి.

# ఈ-దాఖిల్‌కు మోక్షమెప్పుడో..?



హైదరాబాద్: రాజధాని పరిధిలోని వినియోగదారుల కమిషన్లలో సదుపాయాల లేమి కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. సాంకేతిక బృందం, ఆధునిక ఉపకరణాలు లేక పాత పద్ధతిలోనే అర్జీలు తీసుకోవాల్సి వస్తోంది. ఆన్‌లైన్‌లో ఫిర్యాదు విధానం 'ఈ-దాఖిల్' అమలుకు అవకాశమున్నా నిధుల మంజూరులో జాప్యంతో ఫిర్యాదు స్వీకరణతో పాటు విచారణపై ప్రభావం పడుతోంది. ఫలితంగా 90 రోజుల్లో కేసు పరిష్కరించే పరిస్థితి లేదు.

**వ్యయ, ప్రయాసలతో వెనకడుగు...**

రాజధానిలో సేవాలోపాలపై రోజూ 5-10 ఫిర్యాదులు 4 జిల్లా కమిషన్లలో నమోదవుతున్నాయి. హైదరాబాద్ జిల్లావాసులైతే నాంపల్లి చంద్రవిహార్‌లోని వినియోగదారుల కమిషన్లలో, ఉమ్మడి రంగారెడ్డి జిల్లావాసులైతే ఎల్బీనగర్‌లోని కమిషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేస్తున్నారు. జిల్లా కమిషన్లు దూరంగా ఉండటంతో అక్కడివరకు వెళ్లాలా? అని అనేక మంది వెనకడుగు వేస్తున్న పరిస్థితి. హైదరాబాద్‌లోని సంస్థలపై ఫిర్యాదు చేస్తున్న ఇతర రాష్ట్రాలవాసులు వర్చువల్ విచారణ చేపట్టాలంటూ విజ్ఞప్తులు వెల్లువెత్తుతున్నాయి.


**మోసపోయి గగ్గోలు..**

ఈ-దాఖలు విధానం ఇక్కడ అమలవుతోందంటూ జరుగుతున్న ప్రచారంతో కొందరు నకిలీ వెబ్‌సైట్లలో వివరాలు నమోదుచేస్తున్నారు. రుసుములు చెల్లించి ఫిర్యాదు చేయగా..స్పందన లేకపోవడంతో మోసపోయినట్టు గ్రహించి లబోదిబోమంటున్నారు. కన్స్యూమర్ హెల్ప్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేసినా తదుపరి ప్రక్రియ పూర్తి చేసే పరిస్థితి లేదు. ఒకసారి ఆన్‌లైన్‌లో ఫిర్యాదు నమోదైన వెంటనే సాంకేతిక బృందం నంబర్ కేటాయిస్తారు. అనంతరం విచారణ ప్రారంభమవుతుంది.

**నిధుల మంజూరులో జాప్యం**

ఈ-దాఖిల్ విధానం అమలుకు రెండేళ్ల క్రితమే కమిషన్ల నుంచి ప్రభుత్వానికి ప్రతిపాదనలందాయి. నిధుల మంజూరులో జాప్యం జరుగుతోందంటూ సిబ్బంది చెబుతున్నారు. ఆన్‌లైన్ విధానం అమలుకు హైదరాబాద్‌లోని మూడు జిల్లా కమిషన్లు, రంగారెడ్డి జిల్లా కమిషన్‌లో ఐదుగురు చొప్పున సాంకేతిక బృందం అవసరం. 15 అధునాతన కంప్యూటర్లు, డేటాను నిక్షిప్తం చేసే వ్యవస్థ ఏర్పాటుచేయాలి. సర్వర్ గదులు, సిబ్బందిని నియమించాలి.

# ఒప్పిస్తారా.. పారిశ్రామికవాడ రప్పిస్తారా?



బొంరాస్‌పేట : కొడంగల్ నియోజకవర్గంలో బహుళ పారిశ్రామిక వాడ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. భూసేకరణ కొలిక్కి వస్తోంది. దుద్యాల మండలం పోలేపల్లి, హకీంపేట, లగచర్ల, రోటిబండతండా, పులిచర్లకుంట తండాల్లో భూమిని సేకరించాలని నిర్ణయించి భూసేకరణ నోటిఫికేషన్ జారీ చేసింది. పరిశ్రమలొస్తే స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని పలువురు రైతులు స్వచ్ఛందంగా తమ భూములను ప్రభుత్వానికి అప్పగించారు. పోలేపల్లి మినహా మిగతా గ్రామాల్లోని కొందరు అన్నదాతలు మాత్రం సమ్మతించడంలేదు. రోటిబండ తండాలోని 40 ఎకరాలు ఇచ్చేందుకు ససేమిరా అంటున్నారు. వారిని ఒప్పించడం ఎలాగని అధికారులు, ప్రజా ప్రతినిధులు తర్జనభర్జన పడుతున్నారు.

**శంకుస్థాపన వాయిదా**

మెజార్టీ రైతులు భూములివ్వడంతో పారిశ్రామికవాడ ఏర్పాటుకు జూన్ 2వ తేదీన శంకుస్థాపన చేయాలని ప్రభుత్వం తొలుత నిర్ణయించింది. పూర్తిస్థాయిలో భూ సేకరణ పూర్తికాకుండా శంకుస్థాపన చేస్తే భవిష్యత్తులో ఏవైనా ఆటంకాలు వస్తే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని విరమించుకున్నట్లు తెలిసింది. మొదట్లో ఔషధ పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని ప్రకటించి భూ సేకరణకు ప్రయత్నిస్తే రైతుల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురైన విషయం విదితమే. దీంతో ప్రభుత్వం పారిశ్రామిక వాడ వైపు మొగ్గింది. ఎకరాకు రూ.20 లక్షల పరిహారం, ఇందిరమ్మ ఇల్లు, ఇంట్లో ఒకరికి ఉద్యోగం ఇస్తామని ప్రకటించడంతో పలువురు తమ పొలాలను అప్పగించారు.

**రెండు మూడు నెలల్లో పూర్తి చేస్తాం:** ఇంకా భూమి ఇవ్వని రైతులను ఒప్పించి రెండు మూడు నెలల్లో భూ సేకరణ పక్రియ పూర్తిచేస్తాం. – కిషన్ నాయక్, తహసీల్దార్, దుద్యాల.

**రూ.95.20 కోట్ల పరిహారం**స్వచ్ఛందంగా భూములిచ్చిన అన్నదాతలకు ప్రభుత్వం రూ.95.20 కోట్ల పరిహారం అందించింది. పోలేపల్లిలో 71.39 ఎకరాల అసైన్డ్ భూమి సేకరించారు. హకీంపేటలో 351.10 ఎకరాల అసైన్డ్ భూమికిగాను 200 ఎకరాలు, 146.34 ఎకరాల పట్టా భూమిలో 120 ఎకరాలు ఇచ్చారు. లగచర్లలో 110.32 ఎకరాల అసైన్డ్ భూమిలో 75 ఎకరాలు ఇవ్వడానికి సమ్మతించారు. ఈ గ్రామంలో 497 ఎకరాల పట్టా భూమికి 190 ఎకరాలు ఇవ్వడానికి రైతులు ఒప్పంద పత్రాలు అందజేశారు.

**భూసేకరణ గణాంకాలు**

సేకరించాల్సిన భూమి: 1177.35 ఎకరాలు
అసైన్డ్ భూమి: 532.81
పట్టా భూములు: 643.34
సేకరణ పూర్తయింది: 900కుపైగా ఎకరాలు.
సేకరించాల్సింది: 200 ఎకరాలకుపైగా
అందజేసిన పరిహారం: రూ.95.20 కోట్లు

# అవాంతరాలు అధిగమిస్తేనే.. స్వశక్తి



పెద్దపల్లి : స్వయం సహాయక సంఘాల్లోని మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం మహిళా శక్తి పథకాన్ని అమలు చేస్తోంది. ఆదాయం రెట్టింపు చేసేందుకు సౌర విద్యుత్తు ప్లాంట్లు, పెట్రోల్ బంక్‌లు ఏర్పాటు చేసేలా ప్రోత్సహించడంతోపాటు మహిళా శక్తి భవనాలను నిర్మించేందుకు ఆర్థిక చేయూతనిస్తోంది. అయితే భవనాల నిర్మాణం చాలా చోట్ల ప్రారంభ దశకే పరిమితమైంది. గడువులోపు నిర్మాణాలు పూర్తి చేయడం ప్రశ్నార్థకంగా మారింది. ఇకనైనా పనుల్లో వేగం పెంచితేనే ప్రగతి సాధ్యం కానుంది.

ప్రతి జిల్లాకు రెండు సౌర విద్యుత్తు ప్లాంట్లు మంజూరు చేయడంతో పాటు ప్రభుత్వ భూములను గుర్తించారు. ఒక్కో చోట రెండు మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి కానుంది. పెద్దపల్లి జిల్లా మంథని మండలం చిల్లపల్లి, కాల్వశ్రీరాంపూర్, రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం ముష్టిపల్లి, కోనరావుపేట మండలం ధర్మారం, జగిత్యాల జిల్లా జగిత్యాల మండలం తాటిపల్లి, పెగడపల్లి మండలం నందగిరి, కరీంనగర్ జిల్లా రామడుగు మండలం దత్తోజిపేట, వీణవంక మండలం గన్ముకులలో స్థలాలను ఎంపిక చేశారు. పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. ఉమ్మడి జిల్లాలో పెట్రోలు బంక్‌ల నిర్మాణం ప్రక్రియ స్థలాల గుర్తింపునకే పరిమితమైంది. పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు పక్కన, కరీంనగర్ జిల్లాలో జింకల పార్కు, అంబేడ్కర్ స్టేడియం ప్రాంతాల్లో స్థలాన్ని పరిశీలించారు. ఇక్కడ స్థల ఎంపిక కొలిక్కి రావాల్సి ఉంది. జగిత్యాల పట్టణం, సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం జిల్లెల్లలో స్థలాలు ఎంపిక పూర్తయింది. ఆయిల్ కంపెనీలు ఆమోదిస్తే పనులు ప్రారంభం కానున్నాయి.

ఉమ్మడి జిల్లాలో మహిళా శక్తి భవన నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. పెద్దపల్లి జిల్లా రాఘవపూర్‌లో పనులు ప్రారంభించలేదు. జగిత్యాల జిల్లా ధరూర్ క్యాంప్‌లో పునాది దశలో, సిరిసిల్ల ప్రభుత్వ వైద్య కళాశాల ఎదురుగా పిల్లర్ల వరకు పనులు కొనసాగుతున్నాయి. ఒక్కో భవనానికి రూ.5 కోట్లు కేటాయించగా ఆశించిన స్థాయిలో ప్రగతి కనిపించడం లేదు.

**ఇలా సాగితే గడువులోపు గగనమే**

సౌర విద్యుత్తు, పెట్రోల్ బంక్‌ల ప్రారంభానికి గడువు ఇంకా నాలుగు నెలలు కూడా లేదు. ఇప్పటికీ పనులకు శ్రీకారం చుట్టకపోవడంతో గడువులోపు పూర్తికావడం కష్ట సాధ్యమే. వానాకాలం కావడంతో వర్షాలు కురిసే సమయంలో పనులు ముందుకు సాగడం కష్టమవుతుంది. అధికారులు భూములు గుర్తించిన ప్రాంతంలో పనులు ప్రారంభించడానికి వెంటనే చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. పెట్రోల్ బంక్‌ల నిర్మాణానికి ఆయిల్ కంపెనీల నుంచి సత్వరమే అనుమతి వచ్చే విధంగా చూడటంతోపాటు సౌరవిద్యుత్తు ప్లాంట్లకు బ్యాంకర్ల నుంచి రుణం ఇప్పించేందుకు అధికారులు చొరవ తీసుకోవాలి. మహిళా శక్తి భవనాల నిర్మాణానికి వర్షాలు అడ్డంకిగా మారే అవకాశాలున్నాయి. ఈ ఇబ్బందులు తలెత్తకుండా పనులు వేగిరం చేస్తేనే గడువులోగా పూర్తయ్యే అవకాశం ఉంటుంది.

**యూనిట్ల నిధుల వివరాలు**

మహిళా శక్తి భవనం : రూ. 5 కోట్లు
సౌర విద్యుత్తు యూనిట్లు : ఒక్కో మెగావాట్‌కు రూ. 3.50 కోట్లు
పెట్రోల్ బంక్ : రూ. 35 లక్షలు

# ఉద్యోగాల ఎర.. మోసగాళ్ల దగా

ఆదిలాబాద్ : ప్రభుత్వ ఉద్యోగాలపేరిట కొందరు మోసగాళ్లు అమాయకులను మోసం చేస్తున్నారు. తమకు ఉన్నత స్థాయిలో అధికారులు తెలుసని, ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నమ్మించి దగా చేస్తూ రూ.లక్షల్లో కాజేస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం నేరుగా ప్రకటనలు ఇచ్చి అర్హత పరీక్షలు నిర్వహించి ప్రతిభ ఉన్న వారికి మాత్రమే ప్రతిభ ఆధారంగా నియామకాలు చేపడుతుంది. కొందరు ఇలాంటి మోసగాళ్ల బారిన పడి అత్యాశతో డబ్బులను ఇచ్చి నిండా మునుగుతున్నారు. తర్వాత మోసం తెలిసి లబోదిబోమంటున్నారు. కొందరు ఫిర్యాదు చేయడానికి వెనుకాడటం మోసగాళ్లకు కలిసొస్తోంది.

**సచివాలయంలో అందరూ తెలుసని..**

రాష్ట్ర సచివాలయంలో తనకు తెలిసిన అధికారులున్నారని, ఆబ్కారీ శాఖలో ఉద్యోగం ఇప్పిస్తానని నకిలీ గుర్తింపు కార్డు, నియామక ఉత్తర్వులు అందజేసి పలువురిని మోసం చేసి రూ.80 లక్షల వరకు హైదరాబాద్‌కు చెందిన వ్యక్తి మోసం చేశాడు. ఆసిఫాబాద్ పట్టణంలోని ఒక బాధితుడు ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయటంతో మోసం వెలుగుచూసింది. బాధితుడి కూతురికి ఉద్యోగం ఇప్పిస్తానని అతడు రూ.7.05 లక్షలు వసూలు చేశాడు. నకిలీ ప్రొసీడింగ్



కాపీలిచ్చాడు. సదరు వ్యక్తి ఆదిలాబాద్ పట్టణంతో పాటు మంచిర్యాల, నిర్మల్ ప్రాంతాల్లోనూ ఇదే విధంగా మోసం చేసినట్లు తెలిసింది.

**రూ.లక్ష తీసుకొని..**

డీఆర్‌డీఓలో ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి పోతుపల్లి ప్రశాంత్ రూ.రెండు లక్షలకు బేరమాడి రూ.ఒక లక్ష తీసుకున్నాడు. ఏడాది దాటినా ఉద్యోగం ఇప్పించకపోవటంతో బాధితుడు వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించటంతో ఫిబ్రవరిలో కేసు నమోదైంది. నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

**తహసీల్దార్ కార్యాలయంలో కొలువంటూ..**


పట్టణానికి చెందిన అబ్దుల్ అజీజ్ అనే వ్యక్తి కుమారులిద్దరికి ఎమ్మార్వో కార్యాలయంలో ఉద్యోగాలు ఇప్పిస్తానని ఖానాపూర్‌కు చెందిన జావిద్‌ఖాన్ అనే నిందితుడు రూ.రెండు లక్షల చొప్పున మొత్తం రూ.నాలుగు లక్షలు తీసుకున్నాడు. ఎంతకీ ఉద్యోగాలు ఇప్పించకపోగా అడిగితే బెదిరింపులకు పాల్పడ్డాడు. బాధితుడు ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

# నిబంధనలు బలాదూర్.. అక్రమాలే బరాబర్

ఆదిలాబాద్ : చేయితడిపితేచాలు నిషేధిత భూముల్లోని ప్లాట్లకు రిజిస్ట్రేషన్ చేసేస్తారు. నిరభ్యంతరపత్రంలేని అసైన్డ్ భూముల్లోని ప్లాట్లను ఆమోదిస్తారు. చివరకు ఏజెన్సీ ప్రాంతంలోనూ ఆస్తులను గిరిజనేతరులపేరిట రిజిస్ట్రేషన్ చేసేస్తారు. ఆదిలాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అక్రమాలకు నిలయంగా మారింది. ఇటీవల ఓ సబ్‌రిజిస్ట్రార్‌పై ఆశాఖ ఉన్నతాధికారులతోపాటు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లడంతో ఈ కార్యాలయ వ్యవహారం మరోమారు చర్చనీయాంశంగా మారింది. అనధికారిక లేఅవుట్లతో ప్రభుత్వ ఆదాయానికి నష్టం వాటిల్లుతుందని ప్రభుత్వం 2020 ఆగస్టునుంచే లేఅవుట్లపై నిషేధం విధించింది. లింకు డాక్యుమెంట్లు ఉన్న ప్లాట్లు అంటే ఒకసారి రిజిస్ట్రేషన్ చేసిన వాటినే ఆమోదించాలని ఆదేశాలున్నాయి. లేకపోతే డీటీసీపీ అనుమతి ఉన్న ప్లాట్లకు రిజిస్ట్రేషన్ చేయాలి. ఇక్కడ మాత్రం అలాంటి నిబంధనలేమి పట్టించుకోవడం లేదు. 2020 కంటే ముందున్న లేఅవుట్‌లో పదిశాతం రిజిస్ట్రేషన్ జరిగితే మిగతా ప్లాట్లకు ఎల్ఆర్ఎస్ చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటు కల్పించగా కొత్త అక్రమ లేఅవుట్‌లకు సైతం ఎల్ఆర్ఎస్ తీసుకొని రిజిస్ట్రేషన్ చేస్తుండటం గమనార్హం.

**కొన్ని అక్రమాలను పరిశీలిస్తే..**

జిల్లా కేంద్రంలోని ఖానాపూర్ శివారు సర్వే నెం.68లో 535 ఎకరాల పైచిలుకు భూమి ఉంది. అది వక్ఫ్‌బోర్డ్ భూమి అని రిజిస్ట్రేషన్లు నిలిపివేశారు. తీరా నిర్మల్‌జిల్లా పరిధిలోకి వచ్చే ఖానాపూర్ శివారులోని భూమి అని రెవెన్యూ అధికారులు గుర్తించి నివేదించారు. ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు రాక నిషేధిత జాబితాలోనే ఆ సర్వే నెంబరు ఉంచాల్సి వచ్చింది. అధికారులు మాత్రం ఒకటి రెండు ప్లాట్లు గుట్టు చప్పుడు కాకుండా రిజిస్ట్రేషన్ చేసేశారు. మావల శివారు సర్వే నెం.170 పరిధిలోని రెండు ఎకరాల్లో అసైన్డ్



భూమికి ఎన్ఓసీ (నిరభ్యంతర పత్రం) రాదు. అధికారులు మాత్రం అందులోని ప్లాట్లకు రిజిస్ట్రేషన్ చేయడంతో క్రయవిక్రయాలు జరుగుతున్నాయి.మావల శివారులోని సర్వే నెం.181 పరిధిలో 5 ఎకరాల భూమికి ఎన్ఓసీ లేకున్నా ఆ ప్లాట్లకు రిజిస్ట్రేషన్ చేశారు. అసైన్డ్ భూములు అన్యాక్రాంతమవుతున్నా రెవెన్యూ అధికారులు, రిజిస్ట్రేషన్ ఉన్నతాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

ఏజెన్సీ ఏరియాలో నివాసాలు (భవనాల)కు రిజిస్ట్రేషన్ చేయరాదని నిబంధనలున్నాయి. ఆదిలాబాద్ మండలంలో ఏజెన్సీ పరిధిలోకి వచ్చే యాపల్‌గూడలో ఇంటి నెంబరుతో గిఫ్ట్ సెటిల్‌మెంట్ పేరిట తండ్రి నుంచి కుమారుడికి రిజిస్ట్రేషన్ చేశారు. ఇది తప్పని తెలిసినా సంబంధిత సబ్‌రిజిస్ట్రార్‌పై ఉన్నతాధికారుల దర్యాప్తు లేదు.

ఖానాపూర్ శివారు పరిధిలోకి వచ్చే సర్వే నెం.68లో ఇటీవల ఏకంగా 40 ప్లాట్లకు రిజిస్ట్రేషన్ చేయడం దుమారం రేపింది. పైగా ఇరువురి మధ్య కేసులున్నా దర్జాగా రిజిస్ట్రేషన్ చేయడం.. అసలు పట్టాదారు వచ్చి ఫిర్యాదు చేయడంతో తప్పు సరిదిద్దుకునే పనిలో అధికారులున్నారు. ఆ రిజిస్ట్రేషన్లు చెల్లుబాటు కావని చెబుతున్నా బాధ్యులపై మాత్రం చర్యల్లేవు.

చురకలు



# మల్లన్న సన్నిధి కావాలి ప్రగతి పెన్నిధి

శ్రీశైలం : శ్రీశైల క్షేత్రానికి రోజురోజుకు భక్తుల రాక పెరుగుతోంది.. ఏటా కోట్లాది మంది భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు తరలొస్తున్నారు. భ్రమరాంబ మల్లికార్జునస్వామివార్ల ఆలయంతోపాటు ప్రకృతి రమణీయత, సుందరమైన కృష్ణానది వంటివి పర్యాటకాభివృద్ధికి ప్రధాన వనరులు. కానీ ఆశించిన స్థాయిలో పనులు ముందుకు సాగడం లేదు. ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీశైలానికి వస్తున్న నేపథ్యంలో పనులపై సమీక్షించి వేగవంతమయ్యేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

**సీప్లేన్ ఎగిరితే ఎంత బాగుండో**

శ్రీశైలానికి సీప్లేన్ రాకపోకలు సాగించేలా సీఎం చంద్రబాబు ఆసక్తి చూపారు. ఆయన విజయవాడ నుంచి శ్రీశైలానికి సీప్లేన్‌లో వచ్చారు. ట్రయల్ రన్ విజయవంతం కావడంతో ఇది అమలవుతుందని భావించారు. ఏడాది గడిచినా జాడ లేకపోయింది. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే పర్యాటకులు, భక్తులను ఆకట్టుకునేందుకు సీప్లేన్ ఎంతగానో ఉపయోగపడుతుంది.

**వీటిపై దృష్టి పెట్టాలి మరి**

శ్రీశైల ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చెందేందుకు విస్తృత అవకాశాలున్నాయి. శ్రీశైల దేవస్థానం పరిధిలో మరిన్ని వసతి సముదాయాలు అవసరం. భక్తులు, పర్యాటకులకు విస్తృత సౌకర్యాలు కల్పించడం ద్వారా ఆదాయాభివృద్ధికి వీలుంటుంది. సున్నిపెంటలో త్రీస్టార్, ఫైవ్



స్టార్ హోటళ్లు నిర్మించడం ద్వారా సౌకర్యాలు పెరుగుతాయి. శ్రీశైల మహాక్షేత్రంలో వివాహాలకు భక్తులు ప్రాధాన్యమిస్తారు. వారి సౌకర్యార్థం క్షేత్ర పరిధిలో మరిన్ని కల్యాణ మండపాలు నిర్మించాలి. ఆలయానికి సమీపంలో భక్తులకు పార్కింగ్ ప్రదేశాల సంఖ్యను పెంచాలి. అక్కడి నుంచి బస్సులను ఏర్పాటు చేసేందుకు దేవదాయ శాఖ చొరవ చేపట్టాలి. సున్నిపెంట–శ్రీశైలం మధ్యన వంతెనకు చర్యలు చేపట్టాలి. రూ.20 కోట్లతో 2.2 కి.మీ. పొడవు, 18 మీటర్ల వెడల్పుతో వంతెన నిర్మించాలనుకున్నారు. ప్రస్తుతం సున్నిపెంటలో దేవస్థానం సిబ్బంది నివాస గృహాల నిర్మాణం జరుగుతోంది. దేవస్థానం ఉద్యోగులు త్వరగా శ్రీశైలం చేరుకొని విధులు నిర్వర్తించేందుకు దీన్ని గతంలో ప్రతిపాదించారు.

**మాస్టర్ ప్లాన్ అమలవ్వాలి**

శ్రీశైల దేవస్థానం అభివృద్ధి కోసం దేవాదాయ శాఖ మాస్టర్‌ప్లాన్‌ను అమలు చేస్తోంది. ఇందులో భాగంగా వివిధ పనులు చేపట్టాల్సి ఉంది. రూ.100 కోట్లతో నూతన క్యూకాంప్లెక్స్, సాలుమండపాల నిర్మాణ పనులు టెండర్ల దశ వరకు వెళ్లి ఆగిపోయాయి. నూతన క్యూకాంప్లెక్స్ నిర్మాణానికి చర్యలు చేపట్టాల్సి ఉంది.


శ్రీశైల దేవస్థానం భూముల సరిహద్దుల సమస్య పునరావృతమవుతోంది. గత ప్రభుత్వ హయాంలో దేవస్థానం భూములపై అటవీ, రెవెన్యూ, సర్వే, ల్యాండ్స్ రికార్డ్స్ శాఖ సంయుక్త సర్వేలు నిర్వహించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. సంయుక్త సర్వే ప్రకారం దేవస్థానం భూములపై అటవీశాఖ అభ్యంతరం వ్యక్తం చేయకుండా ప్రభుత్వం చొరవ తీసుకోవాలి.

ప్రస్తుతం ఉన్న క్యూకాంప్లెక్స్ సాధారణ రోజుల్లో అనుకూలంగా ఉన్నా...బ్రహ్మోత్సవాల్లో ఇరుకుగా మారుతోంది. ఆర్జిత సేవలు, దర్శనాల నిర్వహణకు నూతన క్యూకాంప్లెక్స్ నిర్మాణం తప్పనిసరి.

# ఆక్వా వర్సిటీకి నిధుల గండం

భీమవరం : ప్రయోగశాలల నిర్మాణానికి వేములదీవిలో 350 ఎకరాల భూమిని గుర్తించారు. భూసేకరణ పూర్తికాకపోవడంతో వర్సిటీకి అప్పగించలేదు. దీంతో విద్యార్థులు ప్రయోగాలు, క్షేత్ర పరిశీలన నిమిత్తం సుమారు 30 కిలోమీటర్ల దూరాన ఉన్న ఉండిలోని కృషి విజ్ఞాన కేంద్రానికి వెళ్తున్నారు.నరసాపురం పరిధి సరిపల్లి వద్ద ఆక్వా యూనివర్సిటీ భవన నిర్మాణాలు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. నిధుల విడుదల, బిల్లుల మంజూరులో జాప్యంతో మూడేళ్లుగా పునాదులకే పరిమితమయ్యాయి. భవనాలు లేకపోవడంతో లక్ష్మణేశ్వరంలోని తుపాను షెల్టర్‌లో తరగతులు నిర్వహించాల్సి వస్తోంది.

అద్దె భవనంలోకి.. ప్రస్తుత నిర్వహిస్తున్న ఒక కోర్సులో బ్యాచ్‌కు 60 మంది చొప్పున రెండేళ్లకు 120 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ ఏడాది కొత్తగా వచ్చే మరో బ్యాచ్‌కు అవసరమైన తరగతి గదులు తుపాను షెల్టరులో లేవు. దీంతో తరగతులను సీతారాంపురంలోని



స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలోకి మార్చనున్నారు. దీనికి నెలకు రూ.1.20 లక్షలు అద్దె చెల్లించనున్నారు.

**ఒక కోర్సుకే పరిమితం..** రాష్ట్ర విభజన హామీల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఆక్వా యూనివర్సిటీ మంజూరు చేసింది. 2022 నవంబరులో నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి శంకుస్థాపన చేసి ఏడాది తర్వాత భవనాలు ప్రారంభిస్తామంటూ బీరాలు పలికారు. 2023లో మొదలైన పనులు 2024 మే నాటికి పూర్తి కావాల్సి ఉండగా పునాది దశ దాటలేదు. పేరుకు యూనివర్సిటీ అయినా భవనాలు లేకపోవడంతో ఒక్క బీఎఫ్ఎస్సీ కోర్సుకే పరిమితం చేశారు. పూర్తి స్థాయిలో తరగతులు నిర్వహిస్తే ఉన్నతీకరణలో భాగంగా ఫిషరీస్ డిప్లొమో, ఎంఎఫ్ఎస్సీ, ఇతర అనుబంధ కోర్సులు అందుబాటులోకి వస్తాయి.

**బకాయిలు రూ.25 కోట్లు..** వర్సిటీ నిర్మాణానికి నరసాపురం పరిధి సరిపల్లి, లిఖితపూడి గ్రామాల మధ్య 40 ఎకరాల భూమిని సేకరించారు. రూ.332 కోట్లతో డీపీఆర్ ఆమోదించి తొలి విడతగా రూ.100 కోట్లు మంజూరు చేశారు. మొదటి దశలో పరిపాలన భవనం, విద్యార్థులకు వసతిగృహాలు, వీసీ బంగ్లా, రైతు శిక్షణ కేంద్రాల నిర్మాణాలు పూర్తిచేయాలని నిర్ణయించారు. 2023 బడ్జెట్లో రూ.40 కోట్లు కేటాయించినట్లు ప్రచారం చేసినా తాత్కాలిక రహదారులు, మట్టి పనులు తప్ప ఇంకేం చేయలేదు. నాటి సర్కారు రూ.16 కోట్లు విడుదల చేసి చేతులు దులుపుకొంది. కూటమి ప్రభుత్వం వచ్చాక పెండింగ్ బిల్లులు రూ.7 కోట్లు విడుదల చేసింది. మరో రూ.25 కోట్లకు పైగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

# భక్తజనం వెంట రాగా... కదలనున్న పుష్పరథం



సింహాచలం : ఎంతో ప్రతిష్ఠాత్మకమైన సింహాచలం గిరి ప్రదక్షిణ మహోత్సవానికి సమయం ఆసన్నమైంది. ఆషాఢ పౌర్ణమి సందర్భంగా చతుర్దశి నాడు లక్షలాది మంది భక్తులు సింహగిరి ప్రదక్షిణ చేయడం ఆనవాయితీ. సింహాచలం తొలిపావంచా వద్ద నుంచి భక్తులు బయలుదేరనున్న నేపథ్యంలో విస్తృత ఏర్పాట్లు చేసినట్లు ఈవో వేంద్ర త్రినాథరావు తెలిపారు.

**మధ్యాహ్నం 2 గంటలకు:** ఈ నెల 9న సింహాచలం కొండ దిగువన తొలిపావంచా వద్ద నుంచి అప్పన్న స్వామి నమూనా విగ్రహంతో పుష్పరథం ప్రారంభమవుతుంది. రథాన్ని ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు జెండా ఊపి ప్రారంభిస్తారు. రథం వెంట లక్షలాది మంది భక్త జనం గిరి ప్రదక్షిణకు శ్రీకారం చుడతారు. తొలిపావంచా నుంచి మొదలయ్యే ప్రదక్షిణ పాత అడివివరం మీదుగా పైనాపిల్ కాలనీ, ముడసర్లోవ, హనుమంతవాక, విశాలాక్షినగర్, జోడుగుళ్లపాలెం, అప్పుఘర్, ఎంవీపీ కాలనీ, వెంకోజీపాలెం, ఇసుక తోట, హెచ్‌బీ కాలనీ, సీతమ్మధార, అల్లూరి విగ్రహం, బాలయ్యశాస్త్రి లేఅవుట్, పోర్టు స్టేడియం, కంచరపాలెం, మాధవధార, మురళీనగర్, ఎన్ఏడీ కూడలి, గోపాలపట్నం బంకు, ప్రహ్లాదపురం, పాత గోశాల కూడలి మీదుగా తిరిగి తొలిపావంచా వద్దకు చేరుకోవడంతో 32 కిలోమీటర్ల గిరి ప్రదక్షిణ పూర్తవుతుంది.

**సాయంత్రం విజయోత్సవం:** ఆషాఢ పౌర్ణమి నాడు భగవద్రామానుజాచార్యులు ఢిల్లీ పాదుషాను పాండిత్యంలో మెప్పించిన ఘట్టాన్ని పురస్కరించుకుని సింహాచలం ఆలయంలో ఢిల్లీ విజయం ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా 10న సాయంత్రం 4 గంటల నుంచి భక్తులకు దర్శనాలు నిలిపి వేస్తారు. తిరిగి 5 గంటల తర్వాత దర్శనాలు కల్పిస్తారు. 10న తెల్లవారుజామున 5.30 గంటల నుంచి భక్తులకు సర్వ దర్శనాలు కల్పిస్తారు. ఉత్సవాల సందర్భంగా 9, 10 తేదీల్లో ఆలయంలో జరిగే అన్ని ఆర్జిత సేవలను రద్దు చేసినట్లు ఈవో త్రినాథరావు తెలిపారు.

**ఉచిత బస్సు సదుపాయం:** 10న ఆలయ ప్రదక్షిణ పూర్తి చేసుకుని సింహగిరికి వచ్చిన భక్తులను కొండ దిగువకు చేర్చేందుకు ఉచిత రవాణా సదుపాయం కల్పించినట్లు ఈవో తెలిపారు. ఇందుకు 50 ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశామన్నారు. మెట్లమార్గంలో, సింహగిరిపైన వివిధ ప్రాంతాల్లో భక్తులకు ఇబ్బంది లేకుండా ప్రత్యేక పారిశుద్ధ్య నిర్వహణ చేసినట్లు వెల్లడించారు.

గిరి ప్రదక్షిణ మార్గంలోని 29 ప్రాంతాల్లోని ప్రత్యేక స్టాళ్లలో విశ్రాంతి తీసుకోవడానికి కుర్చీలు, కార్పెట్లు ఏర్పాటు చేస్తామని ఈవో తెలిపారు.

**10న చందన సమర్పణ, ఆలయ ప్రదక్షిణ:** ఆషాఢ పౌర్ణమి సందర్భంగా 10న సింహాద్రినాథుడికి చివరి విడత చందన సమర్పణ జరుగుతుంది. ఈ సందర్భంగా ఆరోజు వేకువజామున 2 గంటలకే సుప్రభాత సేవ, ప్రాతఃకాల పూజలు నిర్వహిస్తారు. అనంతరం సుగంధ ద్రవ్యాలు మిళితం చేసి సిద్ధం చేసిన మూడు మణుగుల (సుమారు 125కిలోలు) శ్రీగంధాన్ని స్వామికి సమర్పణ చేస్తారు. 32 కిలోమీటర్లు గిరి ప్రదక్షిణ చేయలేని భక్తుల కోసం ఆలయ ప్రదక్షిణకు అవకాశం కల్పిస్తారు. వేకువజామున 3 గంటల నుంచి ఆలయ వెలుపల నుంచి భక్తులు ఆలయ ప్రదక్షిణకు అనుమతిస్తారు. ఉత్తర గోపురం, దక్షిణ గోపురం వద్ద ర్యాంపులు ఏర్పాటు చేస్తున్నారు.

# వారధి.. దందాల్లో ఆరితేరి..!




తిరుపతి: శాసనసభ్యుల వ్యక్తిగత సహాయకులు (పీఏ) నిర్దేశించిన పనులకే పరిమితం కావాలి. వారి రోజువారీ కార్యక్రమాల పర్యవేక్షణ, ప్రజలు అర్జీలు ఇస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చొరవ చూపాల్సిన బాధ్యత వారిదే. ఒకరకంగా జనాలు, అధికారులు.. ఎమ్మెల్యే మధ్య వారధిగా వ్యవహరించాలి. అటు ప్రభుత్వానికి ఇటు శాసనసభ్యుడికి మంచి పేరు తీసుకురావాలి. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని కొందరు ఎమ్మెల్యేల పీఏల వైఖరి ఇందుకు భిన్నంగా ఉంది. ప్రైవేటు పీఏలూ, అనుచరులు కొందరు ఇదే బాటలో పయనిస్తున్నారు. నియోజకవర్గం సొంత జాగీరున్నట్లు, ఎవరైనా సరే తమ ఆజ్ఞలు పాటించాల్సిందేనన్నట్టుగా వ్యవహారశైలి ఉంది. ఇసుక, మట్టి, గనులు, మద్యం, ప్రైవేటు లే ఔట్లు ఇలా ప్రతి అంశంలోనూ తలదూర్చుతున్నారు. అందినకాడికి నొక్కుతున్నారు. ఇప్పటికైనా వీరి విషయంలో నష్ట నివారణ చర్యలు చేపట్టకుంటే శాసనసభ్యుల పుట్టి మునగడం ఖాయం.

**అంతకుమించి అంటోన్న పీఏ..**

జిల్లా కేంద్రం తిరుపతికి ఆనుకుని ఉన్న ఓ నియోజకవర్గంలో భూముల విలువ ఎకరా ఎక్కడ చూసినా కోట్ల రూపాయల్లోనే ఉంటుంది. స్వర్ణముఖి నది కూడా ప్రవహిస్తున్నందున ఇసుకా అధికమే. పారిశ్రామికంగా ఈ ప్రాంతం దూసుకెళుతోంది. స్థానిక ప్రజాప్రతినిధి అనధికారిక పీఏ ప్రతి వ్యవహారంలోనూ వేలు పెడుతున్నారు. వైకాపా హయాంలో ఓ కాలనీలో ఇళ్ల నిర్మాణానికి ఇటుకలు తోలిన ఈయన ఇప్పుడూ చక్రం తిప్పుతున్నారు. ఇటీవల ఓ మండలంలో గ్రావెల్ ట్రాక్టరును అధికారులు పట్టుకుంటే.. విడిచిపెట్టాలని హుకుం జారీ చేశారు. నేను చెబితేనే సీజ్ చేయాలని ఆదేశాలు ఇచ్చారు. సబ్ రిజిస్ట్రార్, రెవెన్యూ శాఖలకు సంబంధించిన అంశాల్లో పని చేయాలంటే మరో అనుచరుడు ఆమోదముద్ర వేయాల్సిందే. మద్యం దుకాణాల్లో మామూళ్లు వసూలు చేసే బాధ్యతను మరొకరు భుజాన వేసుకుని.. నాలుగు రాళ్లు సంపాదిస్తున్నారు.

**ప్లాట్లు వేస్తే చుక్కలు చూపిస్తూ..**

చిత్తూరు జిల్లాలోని కీలక నియోజకవర్గంలో ఎమ్మెల్యేకు చెందిన ఇద్దరు అనధికారిక పీఏల ఆగడాలకు హద్దే లేకుండా పోయింది. ఒకరు మున్సిపల్ వ్యవహారాల్లో జోక్యం చేసుకుని తాము చెప్పిన పనులు చేయాలని ముందస్తుగానే అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. టెండర్లు సైతం తమకు కావాల్సిన వ్యక్తులకే కట్టబెట్టాలని చెప్పారు. మరో ప్రైవేటు పీఏ ఎక్కడ ప్లాట్లు వేస్తే అక్కడ వాలిపోయి రియల్టర్లకు చుక్కలు చూపిస్తున్నారు. 'నేను చెబితేనే అనుమతులు ఇస్తారు.. లేదంటే నువ్వు ఇబ్బంది పడాల్సిందే'అని హెచ్చరిస్తున్నారు. గ్రానైట్ అక్రమ తవ్వకాల్లోనూ వేలు పెట్టి చేతి నిండా సంపాదిస్తున్నారు.

**నలుగురిని దూరం పెట్టిన నేత..**

నెల్లూరు జిల్లా నుంచి తిరుపతి జిల్లాలో చేరిన ఓ నియోజకవర్గ శాసనసభ్యుడి అనుచరులు నలుగురు ఏడాదిగా పెత్తనం చెలాయించారు. ప్రైవేటు వెంచర్లు వేస్తే వాటిలో వాటాలు ఇవ్వాలని ఒకరు, మద్యం దుకాణదారులు కప్పం కట్టాలని మరొకరు.. ప్రభుత్వ భూముల ఆక్రమణలో మరో ఇద్దరు బిజీ అయ్యారు. వీరి వ్యవహారం శ్రుతి మించిందని గ్రహించిన నేత నలుగురినీ పక్కనపెట్టారు.

**వైకాపాలోనూ హవా..**

చిత్తూరు జిల్లాలోని ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గంలోని ఎమ్మెల్యే పీఏగా ఉన్న వ్యక్తి వైకాపాలోనూ ఓ వెలుగు వెలిగారు. శాసనసభ్యుడు పెద్దగా నియోజకవర్గంలో ఉండకపోవడాన్ని అలుసుగా తీసుకున్నారు. విద్యుత్తు పనులు చేసే గుత్తేదారులను బెదిరించి అభాసుపాలైనా అతని తీరు మారలేదు. ఇసుక, మట్టి అక్రమ రవాణాదారులకు సహకరిస్తున్నాడనే ఆరోపణలున్నాయి.

**మాట తీరుతో అప్రతిష్ఠ**


చిత్తూరు జిల్లాలోని పశ్చిమ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తోన్న సీనియర్ ఎమ్మెల్యే అనధికారిక పీఏ మాట తీరుతో అప్రతిష్ఠ మూటగట్టుకుంటున్నారు. అవినీతికి దూరంగా ఉన్నా ప్రజలు ఎవరైనా వస్తే కటువుగా మాట్లాడుతున్నారు. అర్జీదారులకు సరైన సమాధానం చెప్పకుండా తిప్పుకొంటున్నారు.

# శ్రావణమాసం.. స్వగృహ యోగం

అనంతపురం : శ్రావణమాసం పేదలకు సొంతింటి ప్రవేశానికి ప్రభుత్వం లక్ష్యాలను నిర్దేశించింది. లక్ష్యాలను చేరుకొని పేదలకు స్వగృహ యోగం కల్పించడానికి జిల్లా గృహ నిర్మాణ సంస్థ కసరత్తు ప్రారంభించింది. ప్రస్తుతం ఆషాఢమాసం నడుస్తోంది. ఈనెల 25వ తేదీ నుంచి శ్రావణ మాసం ఉండటంతో ఎక్కువ మంది ఇళ్లలో చేరేందుకు ఆసక్తి చూపుతారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే పైకప్పు పూర్తయిన, పైకప్పు దశకు చేరిన ఇళ్లపై అధికారులు దృష్టిసారించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి కావడానికి చర్యలు చేపట్టింది. అందులో భాగంగానే ఇసుకను ఉచితంగా అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇప్పటికే ఇళ్ల నిర్మాణాలు చేపట్టి నిలిచిపోయినా, వివిధ దశల్లో ఉన్న ఎస్టీ లబ్ధిదారులకు రూ.75 వేలు, ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు అదనపు సాయం అందించడం విశేషం.

**చొరవ చూపితేనే.. లక్ష్యానికి చేరువ**

గత వైకాపా ప్రభుత్వం అప్పట్లో ఎన్టీఆర్ గృహ నిర్మాణాలకు నిర్దాక్షిణ్యంగా బిల్లులు ఆపేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం కొన్ని నియోజకవర్గాల్లో వైకాపా హయాంలో మంజూరైన ఇళ్లకు బిల్లులు ఇవ్వకూడదన్న అభిప్రాయం వ్యక్తం అవుతుండటంతో ప్రజాప్రతినిధులు కొంత చొరవ చూపడం



లేదు. ఇప్పటిదాకా నిర్ణయించిన లక్ష్యాల్లో సగం మాత్రమే పూర్తి కాగా శ్రావణ మాసంలో కొంత మేరకు పూర్తయితే 75 నుంచి 85 శాతం లక్ష్యానికి చేరువయ్యే అవకాశం ఉంటుంది.

# అన్నార్తుల ఆకలి తీరేలా..!

ఏలూరు : అన్నార్తుల ఆకలి తీర్చేలా.. అన్న క్యాంటీన్ల విస్తరణకు కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఉభయ జిల్లాల్లో ఇప్పటికే పలుచోట్ల అన్న క్యాంటీన్లు కొనసాగుతుండగా.. కొత్తగా ఏలూరు జిల్లాలో 4, పశ్చిమ గోదావరిలో 3 ఏర్పాటు చేయనున్నారు.

**నియోజకవర్గానికొకటి చొప్పున..**

ప్రతి నియోజకవర్గానికో అన్న క్యాంటీన్ ఉండేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ప్రస్తుతం ఏలూరు జిల్లాలో 6, పశ్చిమలో 9 చొప్పున కొనసాగుతున్నాయి. ఇవన్నీ పట్టణ ప్రాంతాల్లోనే కొనసాగుతున్నాయి. మిగతా నియోజకవర్గాల్లోని పట్టణాల్లోనూ వచ్చే జనవరిలో కొత్తగా క్యాంటీన్లు ప్రారంభించనున్నారు. తదనుగుణంగా భవన నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఏలూరులో కొత్త క్యాంటీన్ల ఏర్పాటుకు



అవసరమైన స్థలాలు సేకరించనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనరు భానుప్రతాప్ తెలిపారు.

**గ్రామీణ ప్రాంతాల్లోనూ..** కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక, తొలుత పట్టణ ప్రాంతాల్లో అన్న క్యాంటీన్లు నెలకొల్పింది. వీటిని దశలవారీగా అన్ని పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలకూ విస్తరిస్తోంది. ప్రస్తుతం ఏలూరు నగరంలో 4, జంగారెడ్డిగూడెం, నూజివీడులో ఒక్కో అన్న క్యాంటీను నడుస్తోంది. కొత్తగా ఏలూరులో ఒకటి, మిగతా మూడింటిని గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో ప్రస్తుతం భీమవరం, తాడేపల్లిగూడెంలో మూడేసి, పాలకొల్లు, నరసాపురం, తణుకులో ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయి. జనవరిలో మరో మూడు కొత్తగా ప్రారంభించనున్నారు.

# తీరంలో వరద గుబులు

ఆచంట : గోదావరి నదిలో వరద ప్రవాహం క్రమంగా పెరుగుతోంది. ఈ నెల 14వ తేదీ నాటికి ప్రవాహం 9 లక్షల నుంచి 10 లక్షల క్యూసెక్కులకు చేరవచ్చని వరద పర్యవేక్షణ అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో జిల్లా అధికారులు లంక గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు ముందు జాగ్రత్త చర్యలకు సన్నద్ధమయ్యారు.జిల్లాలో ఆచంట, పాలకొల్లు, నరసాపురం నియోజవర్గాలు వశిష్ఠ గోదావరి నదికి శివారున ఉన్నాయి. ఆచంట నియోజకవర్గ పరిధిలో గోదావరి మధ్య ఉన్న లంక గ్రామాల్లో 6 వేలకు పైగా నివాసితులు ఉన్నారు. లంక భూముల్లో పెద్ద సంఖ్యలో పశువులు ఉన్నాయి. వరద పెరిగితే పెనుగొండ, ఆచంట, యలమంచిలి మండలాల పరిధిలో ఉన్న లంక భూములపై పడుతుంది. ఈ నేపథ్యంలో లంకభూముల్లో పశువులను సురక్షిత ప్రాంతాలకు



తరలించాలని అధికారులు స్థానికులకు సూచించారు. ఆచంట, యలమంచిలి మండలాల్లో గర్భిణులు, బాలింతలు, వృద్ధుల వివరాలు సేకరిస్తున్నారు. అవసరమైతే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధంగా ఉండాలని ప్రజలకు సూచిస్తున్నారు. అన్ని శాఖల అధికారులతో ఆయా మండలాల్లో మంగళ, బుధవారాల్లో సమావేశాలు నిర్వహించనున్నారు. ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసినందున మరో రెండు మూడు రోజుల్లో వరద నీరు దిగువకు వచ్చే అవకాశం ఉందని ఆచంట తహసీల్దారు కనకరాజు పేర్కొన్నారు. ముందు జాగ్రత్త చర్యలు చేపట్టేలా ఆచంట మండలంలో క్షేత్ర స్థాయి సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

# పేదలది పట్టా.. పెద్దలదే చిట్టా!

ఒంగోలు : సమీపంలోని అన్నవరప్పాడులో ఓ వ్యక్తికి మూడంతస్తుల ఇల్లు ఉంది. పైగా ఆరు వాకిళ్లు ఉండగా నాలుగు వాకిళ్లు అద్దెకు ఇచ్చారు. ఈయనకు ఇంటి పట్టా ఇచ్చారు. ఒంగోలు నగరంలోని ఓ కాలనీకి చెందిన తండ్రీకొడుకులిద్దరికి రెండు ఇళ్లు ఉన్నాయి. పీఎంఏవై కింద గతంలో ఇల్లు తీసుకున్నారు...పైగా నాలుగు చక్రాల వాహనం ఉంది. వీరికి ఇంటి పట్టా మంజూరు చేశారు గత వైకాపా ప్రభుత్వ హయాంలో 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' కార్యక్రమంలో భాగంగా ఇంటి పట్టాల పంపిణీ నిమిత్తం జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు, ప్రభుత్వ భూములు సేకరించారు. మొత్తం 620 లేఅవుట్ల వేసి సుమారు 84 వేల మందికి ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. ఇవన్నీ శివారు ప్రాంతాల్లో ఉండడంతో నేటికి కొందరు లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోలేదు. వీటిపై ప్రస్తుతం నిర్వహిస్తున్న సర్వేలో జిల్లావ్యాప్తంగా 20 వేల మందికిపైగా అనర్హులు ఉన్నట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ప్రత్యేకించి ఒంగోలు నగరంలో సుమారు 20,800 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. 2023 చివరిలో ఒంగోలు సమీపంలోని వెంగముక్కపాలెం, ఎన్.అగ్రహారం వద్ద స్థానిక రైతుల నుంచి భూములు సేకరించారు. సార్వత్రిక ఎన్నికల ముందు హడావుడిగా అప్పటి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి చేతుల మీదగా పట్టాల పంపిణీ చేశారు. భూ సేకరణ పేరిట కోట్లాది రూపాయలు ఖర్చు చేసినా ఒంగోలు నగరానికి దూరంగా ఉన్న రెండు లేఅవుట్లలోనూ అప్పటి ప్రజాప్రతినిధులు, రెవెన్యూశాఖాధికారులు మాత్రం లబ్ధిదారులకు పొజిషన్ చూపలేదు. అప్పట్లోనే లబ్ధిదారుల జాబితాలో సగం మంది అనర్హులు ఉన్నట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. అనంతరం ఎన్డీయే ప్రభుత్వం అధికారం చేపట్టాక లేఅవుట్లలోని అనర్హుల ఏరివేతపై ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ దృష్టిసారించారు. గత ఆరు నెలలుగా రెవెన్యూ, విద్యుత్తుశాఖలతోపాటు నగరపాలకసంస్థ ఉద్యోగులు వారి వద్ద ఉన్న వివరాల ఆధారంగా లబ్ధిదారుల ఇళ్లకెళ్లి వారి పూర్తి వివరాలు సేకరించారు. తద్వారా అనర్హులను గుర్తించారు.

ఆరంచెల విధానంపై క్షేత్ర పరిశీలన

గత వైకాపా పాలనలో ఇంటి పట్టాలకు అర్హులైన వారి జాబితాను మండలాల్లో రెవెన్యూశాఖ, ఒంగోలు నగరంలో నగరపాలక సంస్థ అధికారులు తయారు చేశారు. వీటి ఆధారంగానే స్థానిక రెవెన్యూ అధికారులు ఇంటి పట్టాలు మంజూరు చేశారు. లేఅవుట్లల్లో అప్పటి వైకాపా నాయకులు, కార్యకర్తలే రెండు, మూడు పట్టాలు తీసుకున్నారన్న ఆరోపణలున్నాయి. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాటిపై విచారణకు ఆదేశించింది. ఈ మేరకు గత ఆరు నెలలుగా రెవెన్యూశాఖ అధికారులు విచారణ జరిపారు. నిబంధనల ప్రకారం ఎవరికైనా ఇల్లు ఉంటేనే వారి పేరిటే విద్యుత్తు మీటరు ఇస్తారు. అప్పటికే మీటరు ఉండి ఎక్కువ మంది పట్టాలు తీసుకున్నట్లు గుర్తించారు.

చురకలు



## స్కిట్‌పై ఆశల ఊసులు..!

శ్రీకాళహస్తి : 'శ్రీకాళహస్తీశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (స్కిట్) ఇంజినీరింగ్ కళాశాల పునః ప్రారంభంపై విద్యార్థులు, తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఇంజినీరింగ్ కళాశాలల ప్రవేశాలకు కౌన్సెలింగ్ ప్రారంభమైంది. ఇప్పటి వరకు స్కిట్ కళాశాలలో ప్రవేశాలకు అనుమతి లభించకపోవడంపై ఉత్కంఠ నెలకొంది.

**విలీనంపై సడలని పట్టు**

కళాశాలను జేఎన్‌టీయూ పరిధిలోకి తేవాలన్న సంకల్పంతో కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. సీఎం చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీని సాకారం చేసేలా మంత్రి నారా లోకేశ్ సూచనలతో ఉన్నత విద్యాశాఖ ఉన్నతాధికారులు ఇప్పటికే పలు దఫాలు సమావేశాలు నిర్వహించారు. తాజాగా నెల్లూరు పర్యటనకు వచ్చిన మంత్రి లోకేశ్‌కు రేణిగుంట విమానాశ్రయంలో ఇదే విషయమై ఎమ్మెల్యే బొజ్జల




సుధీర్‌రెడ్డి సంక్షిప్త నివేదికను అందజేశారు.

**ఫలించేనా..:** కళాశాల ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభం కావాలంటే ఎంసెట్ ప్రవేశాలకు అవకాశం లభించాలి. ప్రస్తుతం ప్రవేశాలకు అన్నీ కళాశాలలు దరఖాస్తుల స్వీకరణకు శ్రీకారం చుట్టాయి. ఆన్‌లైన్ ద్వారా వెబ్ ఆప్షన్ల ఎంపిక ప్రక్రియ ఈ నెల 13న ప్రారంభం కానుంది. ఆ లెక్కన 12వ తేదీ రాత్రి వరకు అవకాశం ఉంది. ఆలోగా కళాశాల పునః ప్రారంభంపై ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటే వెబ్ ఆప్షన్లకు అవకాశం ఉంటుంది. లేకుంటే ఇక ఈ ఆర్థిక సంవత్సరం కళాశాల ప్రారంభం కష్టసాధ్యమే. అమరావతిలో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో అనుకూల ఫలితాలు వస్తాయని కళాశాల అధ్యాపకులు, యాజమాన్యం భావిస్తోంది.

## బెన్నవోలులోనూ అక్రమాల బాగోతాలు

చోడవరం : చోడవరం మండలంలో సహజ వనరుల సంపద దోపిడీ యథేచ్ఛగా సాగుతోంది. బెన్నవోలులో తాగునీటి పథకాలకు సమీపంలో తవ్వకాలు చేపట్టారు. అధికారులు వస్తున్నారు.. తవ్వకాలు చేపడితే ఊరుకోబోమంటూ హెచ్చరించి వెళ్లిపోతున్నారు తప్ప చర్యలు చేపట్టలేదు. రాయపురాజుపేట, నర్సాపురం, వెంకన్నపాలెం, అంభేరుపురం, గోవాడ, బెన్నవోలు, ముద్దుర్తి, గంధవరం పంచాయతీలు కొండలకు సమీపంలో ఉన్నాయి. కొండ దిగువన భూములున్న రైతులతో మాట్లాడుకుని కంకరను పట్టుకెళ్లి అమ్ముకుంటున్నారు. బెన్నవోలులో వారం రోజులుగా రాత్రుళ్లు తవ్వకాలు చేసి ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. గతంలో తవ్వకాలు వల్ల తాగునీటి సరఫరా



గొట్టాలు దెబ్బతింటే పంచాయతీ అభ్యంతరం వ్యక్తం చేసింది. దీంతో ఆగమేఘాలపై తవ్వకందారులు గొట్టాలను బాగు చేయించారు. ఇప్పుడు తాగునీటి పథకాన్ని ఆనుకుని కొండను తొలిచేసేస్తున్నారు. దీంతో నీటి పథకాల పునాదులు జారి కూలిపోయే ప్రమాదం పొంచి ఉంది. బీ అక్రమ తవ్వకాలపై తాగునీటి సరఫరా విభాగం డీఈఈ సూర్యనారాయణ వద్ద ప్రస్తావించగా తహసీల్దారుకు లేఖ ద్వారా తెలిపామన్నారు. తాగునీటి పథకాలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత పంచాయతీలదేనని స్పష్టం చేశారు. సిబ్బందిని అప్రమత్తం చేసినట్లు పేర్కొన్నారు.

## దస్త్రాలు మార్చి..
## తీరంలో భూఆక్రమణలు

వాకాడు: వాకాడు మండలంలోని తీరప్రాంత గ్రామాల్లో ప్రభుత్వ భూములు రోజురోజుకు ఆక్రమణలకు గురవుతున్నాయి. గ్రామాల్లో ప్రభుత్వ భూములను ఎవరు, ఎంత ఆక్రమించారు?.. ఏ ప్రాంతం వారు.. సర్వే నంబర్లతో వీఆర్‌ఏ, వీఆర్వోలకు తెలిసినా పట్టించుకోవడం లేదు.మండలంలోని దుగరాజపట్నం, కొండూరు, రావిగుంటపాలెం, పంబలి, రెడ్డిపాలెం బిట్-1, బిట్-2, పూడిరాయదొరువు రెవెన్యూ గ్రామాల్లో వైకాపా పాలన నుంచి ప్రభుత్వ భూములు ఆక్రమణల్లో చిక్కుకుంటున్నాయి. మండలంలోని పూడిరాయదొరువు రెవెన్యూ గ్రామంలో సర్వే నంబరు 30లో 15.62 ఎకరాల భూమి ఉండగా.. ఇప్పటికే పదెకరాల భూమి ఆక్రమించేశారు. ఆ భూముల్లో భవనంతో పాటు కొందరు రైతులు సాగు చేపట్టారు. కొంత భూమిలో చినతోటకు చెందిన ఓ రైతు ఏకంగా ఓ భవనాన్ని రెండు నెలల కిందట నిర్మించారు. ఇదంతా రెవెన్యూ అధికారులకు తెలిసినా వారి వద్ద మామూళ్లు తీసుకుని పట్టించుకోవడం లేదని ఆ ప్రాంత వాసులు వాపోతున్నారు. పంబలిలో రెండేళ్ల కిందట అక్కడి వీఆర్‌ఏ ప్రభుత్వ,



అసైన్‌మెంట్ భూములను ఆయన కుటుంబీకుల పేరుతో దస్త్రాలను తారుమారు చేసినా ఆ కేసులు అలానే కొనసాగుతున్నాయి. తూపిలిపాలెం వద్ద కొందరు ప్రభుత్వ భూముల్లో రొయ్యలసాగు చేపట్టినా అధికారులు పట్టించుకోవడం లేదు.

**అధికారుల హవా..** మండలంలోని సముద్ర తీర గ్రామాల్లో పనిచేస్తున్న కొందరు గ్రామ రెవెన్యూ అధికారులు, వారితో పాటుగా కొందరు వీఆర్‌ఏలు ప్రభుత్వ భూముల ఆక్రమణల్లో హవా చూపిస్తున్నారు. కొందరు ఏకంగా దస్త్రాలను వారి వద్ద ఉంచుకుని వారి ఇష్టానుసారంగా మార్పులు చేస్తున్నట్లు సమాచారం. కొందరు వీఆర్‌ఏలకు మండల అధికారులు తీరంలో విలువైన భూముల దస్త్రాలను అప్పగించడంతో వారు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఈ విషయమై తహసీల్దార్ రామయ్యను వివరణ కోరగా ప్రభుత్వ భూముల ఆక్రమణలపై చర్యలు తీసుకుంటామని, విలువైన భూముల దస్త్రాలపై నిఘా ఉంచుతామన్నారు.

# కడుపు 'కోత'కే మొగ్గు!



అనంతపురం : అనంత నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఈఏడాది ఆరంభం నుంచి మే వరకు 385 ప్రసవాలు జరగ్గా అందులో 229 సిజేరియన్లు చేశారు. మరో వైద్యశాలలో నమోదైన కాన్పులు 116 కాగా సిజేరియన్లు 102 చేయడం గమనార్హం. ఇలా జిల్లాలోని పలు ప్రైవేటు ఆసుపత్రుల్లో సిజేరియన్లకే అధిక ప్రాధాన్యం ఇస్తూ సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గర్భిణులకు ప్రభుత్వం మెరుగైన వైద్యసేవలతో పాటు, పౌష్టికాహారాన్ని అందజేస్తోంది. ఏఎన్‌ఎంలు.. గర్భిణుల ఇంటి వద్దనే పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రసవ సమయంలో ఇబ్బంది పడకూడదని మెరుగైన సౌకర్యాలను సర్కారు కల్పిస్తోంది. దీన్ని బట్టి సాధారణ ప్రసవాలు పెరగాలి. ఇందుకు భిన్నంగా సిజేరియన్లే అధికమవుతుండటం గమనార్హం. కొందరు వైద్యులు కాసుల కోసం కక్కుర్తి పడి సాధారణ కాన్పు అయ్యే పరిస్థితి ఉన్నా చోట సిజేరియన్ చేస్తున్నారు. లేదంటే తల్లీబిడ్డకు ప్రమాదం అంటూ ఆందోళనకు గురి చేస్తూ ఒప్పిస్తున్నారు. 'ఎన్టీఆర్ వైద్యసేవ' కింద ఉన్న కొన్ని నెట్‌వర్క్ ఆసుపత్రుల్లోనూ ఈ తతంగం సాగుతోంది.

**సమీక్షలకే పరిమితం**

రాష్ట్రంలో సిజేరియన్లు అధికంగా జరుగుతున్న జిల్లాల్లో అనంతపురం మూడవ స్థానంలో ఉంది. ఇంత జరుగుతున్నా అధికారులు ప్రేక్షకపాత్ర వహిస్తుండటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రతి నెలా సమీక్ష, సమావేశాలతో సరిపెడుతున్నారు. క్షేత్రస్థాయిలో తరచూ తనిఖీలు చేసి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు.

**ఎలాంటప్పుడు చేయాలంటే..!**

ప్రసవ సమయంలో అధిక రక్తస్రావం, నియంత్రించలేనంతగా ఫిట్స్ వచ్చినప్పుడు, కడుపులో బిడ్డ అడ్డం తిరిగినప్పుడు, బిడ్డకు గుండె సమస్య.. తల్లీబిడ్డకు ప్రాణాపాయం కలుగుతుందన్న సందర్భాల్లో సిజేరియన్ చేయవచ్చని గైనకాలజీ విభాగం నిపుణులు చెబుతున్నారు.

**రూ.వేలల్లోనే వసూలు**

సిజేరియన్ అయ్యాక కోలుకునేందుకు కొంతకాలం పడుతుంది. ఒకవేళ కుట్లు వేసిన చోట ఇన్‌ఫెక్షన్ సోకితే మరింత సమయం పడుతుంది. కొన్ని ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఒక సిజేరియన్‌కు రూ.36 వేల నుంచి రూ.75 వేల వరకు వసూలు చేస్తున్నారు. ఎన్టీఆర్ వైద్యసేవ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ప్రభుత్వం ఇచ్చే మొత్తానికి అదనంగా వసూలు చేస్తూ.. బాధిత కుటుంబాలపై ఆర్థికభారం మోపుతున్నారన్న ఆరోపణలున్నాయి.

**నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినచర్యలు**

– డాక్టర్ ఈ.బి.దేవి, జిల్లా వైద్యారోగ్యశాఖాధికారిణి

కొన్ని ప్రతికూల ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు మాత్రమే సిజేరియన్ చేయాలి. అధిక సిజేరియన్లు చేసిన ఆసుపత్రుల యాజమాన్యాలకు నోటీసులు ఇస్తాం. ఎక్కువ డబ్బులు వసూలు చేస్తున్న విషయం మా దృష్టికి రాలేదు. ఎన్టీఆర్ వైద్యసేవ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో అదనంగా డబ్బులు డిమాండ్ చేశారని ఫిర్యాదు చేస్తే విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకుంటాం.

# నిబంధనల బూచి.. నిర్భయంగా దోచి!!



విశాఖ : మహా విశాఖ నగర పాలక సంస్థ అధికారుల తీరుతో... ప్రజాధనంతో చేపట్టే అభివృద్ధి గాడి తప్పుతోంది. దొడ్డిదారిలో అధికారుల చేతికి కాసులు వచ్చే వాటికి, ప్రజాప్రతినిధులు సూచిస్తున్న ప్రైవేటు వ్యక్తులకు లబ్ధి చేకూరే వాటికే ప్రాధాన్యం ఇస్తుండడం గమనార్హం. మున్సిపల్‌శాఖకు లబ్ధి చేకూర్చే అంశాల కంటే ప్రభుత్వం నుంచి ప్రైవేటు వ్యక్తులు లాభపడేలా ప్రణాళికలు సిద్ధం చేసి, అమలు చేస్తున్నారు. వైకాపా హయాంలో నగరంలో విడుదల చేసిన టీడీఆర్‌లపై ఓవైపు విచారణ జరుగుతుండగా, అదే తీరుగా టీడీఆర్‌లు ఇవ్వడానికే ప్రాధాన్యం ఇస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**ఖాళీ స్థలం అప్పగింత:** 88వ వార్డు పరిధిలో దశాబ్దాల కిందట ఆర్థికంగా వెనుకబడిన తరగతుల వారికి ఏర్పాటు చేసిన లే అవుట ఖాళీ స్థలాన్ని రియల్ ఎస్టేట వ్యాపారులకు భూబదలాయింపు కింద అందించేలా ఇటీవల మున్సిపల్‌శాఖ మెమో జారీ చేసింది. ఇక్కడ రియల్ ఎస్టేట్ వ్యాపారులకు చెందిన ఎనిమిది ఎకరాల స్థలానికి అనువుగా రహదారి నిర్మించేందుకు ఖాళీ స్థలాన్ని వినియోగించేలా ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. ఆ స్థలాన్ని అప్పగించడం ద్వారా ప్రైవేటు వ్యక్తులకు భారీగా లబ్ధి చేకూరుతుంది. ఈ మొత్తం వ్యవహారంలో స్థానికంగా ఉన్న ఓ ప్రజాప్రతినిధి పాత్ర కీలకమని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వేపగుంట వద్ద సర్వే నెంబర్లు 75, 76, 77, వెంకటాపురం వద్ద సర్వే నెంబర్లు 76, 82లో రహదారి అభివృద్ధి చేయనున్నారు. ఈ మార్గంలో ఓవైపు కొండ, మరోవైపు గెడ్డ, ప్రభుత్వ స్థలాలే ఉన్నాయి.

అయితే ఆస్తి హక్కులు లేని వారికి అక్రమంగా టీడీఆర్‌లు జారీ చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ప్రస్తుతం 60 అడుగుల వెడల్పైన సీసీ రహదారి ఉంది. నివాసాలు తక్కువగా ఉండడంతో పాటు, మూతపడిన ఓ కంపెనీ, పక్కన రైల్వే ట్రాక్, ఆ తరువాత మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ ఉన్నాయి. దీంతో భవిష్యత్తులోనూ ఈ ప్రాంతం అభివృద్ధికి అవకాశాలు తక్కువే. ఇలాంటి పరిస్థితుల్లో టీడీఆర్‌లు దోపిడీ చేయడానికే రహదారి విస్తరణ చేపడుతున్నట్లు పలువురు అనుమానిస్తున్నారు.

**ఎవరి కోసం రహదారి విస్తరణ**

జన సంచారం తక్కువగా ఉండే ప్రాంతంలో రహదారి విస్తరణ పేరుతో ప్రైవేటు వ్యక్తులు టీడీఆర్‌లు దక్కించుకునేందుకు వీలుగా సిద్ధం చేసిన దస్త్రాన్ని జీవీఎంసీ పట్టణ ప్రణాళిక అధికారులు చకచకా నడిపిస్తున్నారు. మాస్టర్‌ప్లాన్-2041లో భాగంగా నాయుడుతోట కూడలి నుంచి ఆంధ్ర సిమెంట కంపెనీ, పోర్లుపాలెం కూడలి వరకు 2.6 కిలోమీటర్ల రహదారిని 100 అడుగుల మేర విస్తరించేందుకు ఆర్‌డీపీ (రహదారి అభివృద్ధి ప్రణాళిక) తయారు చేశారు.

# పగలు భేటీ.. రాత్రి లూటీ!



అనకాపల్లి : వారంతా ఒక ముఠా! రెండు బృందాలుగా ఏర్పడతారు. పగలు కొందరు బేరాలు ఒప్పుకొని సొమ్ము వసూలు చేస్తుంటే.. రాత్రయితే మరికొందరు పొక్లెయిన్లు, ట్రాక్టర్లతో మూకుమ్మడిగా బయలుదేరి దగ్గరలోని కొండలను, చెరువులను కొల్లగొడుతున్నారు. ఇదీ సబ్బవరం మండలంలో సాగుతున్న గ్రావెల్ దందా! కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా.. సబ్బవరం మండలంలో వైకాపాలోని కొందరి ఆగడాలకు అడ్డుకట్ట పడలేదు. కొండలు, చెరువులు ఇష్టారాజ్యంగా తవ్వేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. సబ్బవరం, పరిసర ప్రాంతాల్లో స్థిరాస్తి వ్యాపారం ఊపందుకుంది. లఅవుట్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. వీటితోపాటు ఇళ్ల నిర్మాణాలు సైతం జోరుగా సాగుతున్నాయి. దీంతో మట్టి, గ్రావెల్‌కు డిమాండ్ బాగా ఎక్కువైంది. దీన్ని అవకాశంగా చేసుకుని.. వైకాపా నాయకులు ఓ ముఠాగా ఏర్పడి సమీపంలోని ఎలాంటి అనుమతులు లేకుండా కొండలను తవ్వేస్తున్నారు. అధికార పార్టీ నాయకులు ఈ అక్రమాలకు అడ్డుకట్ట వేయాల్సిందిపోయి వైకాపా నాయకులతో కుమ్మక్కయి వారికి అండదండలు అందిస్తున్నారు. తనిఖీలు చేసి అడ్డుకోవాల్సిన రెవెన్యూ అధికారులేమో కార్యాలయాలకే పరిమితం అవుతుండటంతో అక్రమార్కుల దందా మూడు లారీలు.. ఆరు ట్రాక్టర్లుగా కొనసాగుతోంది.

**కన్నుపడితే చాలు:** అనకపల్లి, గంగవరం, బాటజంగాలపాలెం, ఒమ్మివానిపాలెం, గాలిభీమవరం, అంతకాపల్లి, రాయపురఅగ్రహారం, గొల్లలపాలెం తదితర గ్రామాల్లో మట్టి, గ్రావెల్ తవ్వకాల రవాణా పెద్ద వ్యాపారంగా మారింది. ఆయా ప్రాంతాలకు సమీపంలోని ప్రభుత్వ భూములు, కొండవాలు ప్రాంతాలు, పేదల ఇళ్ల కాలనీలకు సమీపంలో రాత్రి వేళల్లో భారీ యంత్రాలతో తవ్వకాలు సాగిస్తున్నారు. దూరాన్ని బట్టి లారీకి రూ. 3,500 నుంచి రూ. 7 వేల వరకు వసూలు చేస్తున్నారు.అనకపల్లి సర్వే నం. 1లోని వజ్రాలకొండ చుట్టూ రోజూ తవ్వకాలు చేస్తున్నారు. న్యాయ విశ్వవిద్యాలయం దగ్గర పేదల ఇళ్లకు ఆనుకుని ఉన్న కొండవాలు మొత్తం అగాధంలా మార్చేశారు. ప్రస్తుతం ఒమ్మివానిపాలెం సమీపంలోని నల్లకొండపై అక్రమార్కుల కన్నుపడింది. దీంతో ఇక్కడ కొద్దిరోజులుగా తవ్వకాలు ఊపందుకున్నాయి.

**చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం:** ప్రభుత్వ స్థలాలు, కొండ వాలుల్లో మట్టి తవ్వకాలకు అనుమతులు ఇవ్వలేదు. ఫిర్యాదులు వస్తే.. రెవెన్యూ సిబ్బందిని పంపించి తనిఖీలు చేయిస్తున్నాం. రాత్రివేళల్లో కూడా నిఘా పెడుతున్నాం. నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ స్థలాల్లో తవ్వకాలు చేస్తే.. వాహనాలను సీజ్ చేస్తాం. అపరాధరుసుం విధిస్తాం. అప్పటికీ ఆపకపోతే.. చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం.

శ్రీనివాస్, ఏడీ, మైనింగ్, అనకాపల్లి

## అనుమతులతో మాకేం పని?

చిత్తూరు: తన పర్యటనల్లో సొంత పార్టీ కార్యకర్తలు ప్రాణాలు పోతున్నా, సామాన్యులు, పోలీసులకు గాయాలవుతున్నా మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు పట్టడం లేదు. పరామర్శలకు కూడా వైకాపా నేతలు జన సమీకరణ ఆపడం లేదు. ఈ నెల 9న మాజీ సీఎం జగన్.. బంగారు పాళ్యం యార్డుకు వచ్చి మామిడి రైతులతో మాట్లాడతారని వైకాపా నేతలు సమాచారం ఇవ్వడంతో 500 మంది తరలిరావాలని ఎస్పీ మణికంఠ స్పష్టం చేశారు. ఆ స్థలంలో ఎక్కువ మంది ఉండేందుకు సాధ్యం కాదని చెప్పారు. ఇందుకు తగిన విధంగానే జనసమీకరణ చేసుకోవాలని సూచించినా ఫ్యాను పార్టీ నేతలు ఇందుకు విరుద్ధంగా



ఏర్పాట్లు చేసుకుంటున్నారు. బంగారుపాళ్యం మార్కెట్ ఉన్న పూతలపట్టు నియోజకవర్గం నుంచే 2 వేలు- 3వేల మందికి తగ్గకుండా జనాలు వచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. పుంగనూరు నియోజకవర్గంలో ప్రతి పంచాయతీ నుంచి ఒక కారు పెట్టాలని నిర్ణయించుకున్నారు. పలమనేరు, చిత్తూరు, గంగాధరనెల్లూరు, నగరి నియోజకవర్గాలను కలుపుకొంటే కనీసం 10 వేల మందిని తరలించాలని భావిస్తున్నారు.

## చూడదు కన్ను.. వేసేయ్ మన్ను

దేవనకొండ : ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో సాగునీటి చెరువుల్లో జరుగుతున్న పనులు నాసిరకంగా మారాయి. పేరుకు సాగునీటి సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్నట్లు చెబుతున్నప్పటికీ ఆయా ప్రాంతాలకు చెందిన కొందరు నాయకుల ఆధ్వర్యంలో సాగుతున్నాయి. మరికొద్ది రోజుల్లో చెరువులకు నీటి విడుదల జరుగుతుండగా.. ఆలోపే పనులు పూర్తి చేయాలన్న తొందరలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

**పేరు ఒకరిది చేస్తున్నది మరొకరు**

కర్నూలు జిల్లాలో 21 పనులకు 1.27 కోట్లు నంద్యాలలో 49 పనులకు రూ.2.68 కోట్లు, ఆళ్లగడ్డ, నందికొట్కూరు నియోజకవర్గాల్లో 10 శాతం కమీషన్‌పై ఐదు చెరువులను ఒక గుత్తేదారుడు చేస్తున్నారు. శ్రీశైలం నియోజకవర్గంలో పనులను విడగొట్టుకుని గ్రామ నాయకులే నిర్వహిస్తున్నారు. పశ్చిమ ప్రాంతం మంత్రాలయంలో ఓ నేత కనుసన్నల్లో జరుగుతున్నాయి. డోన్‌లో ఓ గుత్తేదారుడు రెండు పనులను ముందస్తుగా కుదుర్చుకున్న ఒప్పందం మేరకు చేస్తున్నారు.

**రూ.3.95 కోట్లు మంజూరు**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో మైనర్ ఇరిగేషన్ ఆధ్వర్యంలో ఓఅండ్‌ఎం (ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్) పనులకు రూ.3.95 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో చెరువులకు సంబంధించిన పంట కాలువలను శుభ్రం చేసి శివారు ప్రాంతాల్లోని పొలాలకు నీళ్లివ్వాలన్నది ప్రభుత్వ లక్ష్యం. కట్టలను మట్టితో పటిష్ఠం చేయడంతోపాటు చెరువులు, కట్టలపై ఉన్న ముళ్ల పొదలు, కంపచెట్లు తొలగించడం.. స్లూయిజ్‌లలో ఎలాంటి



అడ్డంకులు లేకుండా లేకుండా శుభ్రం చేయాలి. పనులను సాగునీటి సంఘాలకు అప్పగించారు. పేరుకు సంఘాలు ఆధ్వర్యంలో చేస్తున్నట్లు చెబుతున్నా పరోక్షంగా కొందరు నాయకుల ఆధ్వర్యంలోనే ఇవి జరుగుతున్నాయి. మరికొన్నిచోట్ల గుత్తేదారులు పనులు చేస్తున్నారు.

**ముళ్ల పొదలు తొలగించకుండానే**

దేవనకొండ మండలం మాచాపురం చెరువుకు రూ.5 లక్షలు మంజూరయ్యాయి. పనులు ఇటీవలే ప్రారంభమయ్యాయి. కట్ట పటిష్టపరిచేందుకు మట్టి వేస్తున్నారు. కట్టకు ఇరువైపులా ఉన్న ముళ్ల పొదలు తొలగించలేదు. త్వరగా పనులు పూర్తి చేయాలన్న ఉద్దేశంతో తూతూమంత్రంగా కానిచేస్తున్నారు. ఫలితంగా ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు.

**పనులన్నీ నాసిరకమే..**

చెరువుల గట్లపై ముళ్ల పొదలు తొలగించాల్సి ఉండగా ఎక్కడ కూడా పూర్తి స్థాయిలో తొలగించడం లేదు. కొన్నిచోట్ల నిప్పు పెట్టి అలానే వదిలేస్తున్నారు. మరికొన్నిచోట్ల గడ్డి మందు చల్లుతున్నారు. చెరువులో పెద్దఎత్తున వ్యర్థాలు ఉన్నప్పటికీ అలానే ఉంచేస్తున్నారు. చెరువు కట్టలకు నాసిరకం మట్టి వాడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

## చిక్కీలు చిక్కేనా?



తాళ్లూరు : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పోషకాహారంలో భాగంగా పంపిణీ చేయాల్సిన చిక్కీలు ఈ నెలలో అందకపోవడంతో విద్యార్థులు ఎదురుచూస్తున్నారు. ఒకటి నుంచి పదోతరగతి వరకు గల విద్యార్థులకు ప్రభుత్వం ఢొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కింద ప్రతి విద్యార్థికి వారానికి మూడు చొప్పున ప్రతి పదిహేను రోజులకొకసారి పాఠశాలల వారీగా లెక్కించి సరఫరా చేస్తోంది. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు ప్రస్తుత నెలకు సంబంధించి ఇప్పటివరకు చిక్కీలు సరఫరా కాలేదు. దర్శి నియోజకవర్గంలోని అయిదు మండలాల విద్యార్థులకు దొనకొండకు చెందినవారు నెలకు రెండు పర్యాయాలు చిక్కీలు సరఫరా చేస్తారు. ప్రస్తుత నెలకు సంబంధించి సరఫరా కాకపోవడంతో వారం రోజులుగా చిన్నారులకు చిక్కీల సరఫరా నిలిచిపోయింది. ఈ విషయమై విద్యాశాఖాధికారులు మాట్లాడుతూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, సరఫరా ఏజెన్సీ నిర్వాహకులతో మాట్లాడామని, ఒకట్రెండు రోజుల్లో అన్ని పాఠశాలల విద్యార్థులకు అందజేస్తామన్నారు.

## మత్స్యం.. కృత్రిమ ఆవాసం

విజయనగరం : మత్స్య సంపద పెంపొందించేదుకు సముద్ర తీర జలాల్లో కృత్రిమ ఆవాసాలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రధానమంత్రి మత్స్యసంపద యోజనలో వంద శాతం సబ్సిడీతో వీటిని ఏర్పాటు చేస్తున్నారు. దీనికి జిల్లాలో అయిదు ప్రాంతాలను ఎంపిక చేశామని, సుమారు ఆరు వేల మందికి ప్రయోజనం చేకూరుతుందని అధికారులు చెబుతున్నారు. సముద్ర తీర జలాల్లో త్రికోణ ఆకారంలో ఉన్న సిమెంటు దిమ్మలను ఏర్పాటు చేస్తారు. వీటినే కృత్రిమ రీఫ్‌లు అంటారు. కొన్ని రోజులకు దిమ్మలకు ఉప్పునీటి వల్ల నాచుపడుతుంది. దాంతో చేపలు నాచును తినడంతో పాటు ఇక్కడే గుడ్లు పెట్టి మత్స్య సంపదను అభివృద్ధి చేస్తాయి. దీంతో



మత్స్యకారులు వేటకు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. డీజిల్ ఖర్చు, సమయం ఆదా అవుతాయి.

**ఈ అయిదు ప్రాంతాల్లో..**

చింతపల్లి, చింతపల్లి–బర్రిపేట, తమ్మయ్యపాలెం–ఎ, తమ్మయ్యపాలెం–బి, తిప్పలవలసల్లో రూ.1.75 కోట్లతో కృత్రిమ ఆవాసాలు ఏర్పాటు చేస్తున్నారు. వీటిని సీఎంఎఫ్‌ఆర్‌ఐ(విశాఖపట్నం) సాంకేతిక సహకారంతో సిద్ధం చేస్తున్నారు. ఈ అయిదు యూనిట్లలో రెండు వందలు చొప్పున వెయ్యి దిమ్మలు పెట్టనున్నారు.

**పనులు ప్రారంభమయ్యాయి..**

**– ఎం.విజయకృష్ణ, మత్స్యశాఖ ఇన్‌ఛార్జి డీడీ, విజయనగరం**

రీఫ్‌ల ఏర్పాటు పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. ఇవి చేపలు, సముద్ర జీవులకు ఆవాసాలుగా మారుతాయి. దీంతో తీర ప్రాంతంలో మత్స్యసంపద వృద్ధి చెందుతుంది. స్థానికంగానే చేపలు అందుబాటులో ఉంటాయి. మత్స్యకారులు అందరూ వీటిని గమనించి, ఉపాధికి బాటలు వేసుకోవాలి.

## వారెవ్వా.. ఎరెవ్నా 4.0

కాకినాడ : ఆరున్నర దశాబ్దాల చరిత్ర కలిగిన కాకినాడ రంగరాయ వైద్య కళాశాల (ఆర్‌ఎంసీ)లో ఎరెవ్నా 4.0 వేడుకలకు వైద్య విద్యార్థులు సన్నద్ధమయ్యారు. విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధి, విజ్ఞానానికి పదునుపెట్టేలా పలు సాంకేతిక సదస్సులు, సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడా పోటీలతో గురువారం నుంచే ఉత్సవం ప్రారంభం కానుంది. ఈనెల 12, 13, 14 తేదీల్లో జీజీహెచ్‌తో పాటు రంగరాయ వైద్య కళాశాల ప్రాంగణంలో వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తిచేశారు. విజయవాడలోని ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ చంద్రశేఖర్, డీఎంఈ డా.జి.రఘునందన్, డా.నరసింహం తదితరులు ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథులుగా హాజరుకానున్నారు

**దేశవ్యాప్తంగా కళాశాలల నుంచి..**

ఆర్‌ఎంసీ ప్రిన్సిపల్ డా.ఎ.విష్ణువర్ధన్ నేతృత్వంలో ఎరెవ్నా 4.0 నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లుచేశారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశంలోని వివిధ వైద్య కళాశాలల నుంచి ఎంబీబీఎస్ విద్యార్థులు 800 మంది వరకు హాజరుకానున్నారు. అతిథులకు గోదారి రుచులు అందించడంతోపాటు సాయంత్రం వేళల్లో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు.

**బృందాలుగా ఏర్పడి..**

కార్యక్రమ కన్వీనర్, వైస్ ప్రిన్సిపల్ డా.శశి సారథ్యంలో 50 మంది వైద్య విద్యార్థులు బృందాలుగా ఏర్పడి అతిథి సత్కారం చేయనున్నారు.




కాన్ఫరెన్స్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా తోట హరికృష్ణప్రసాద్, కోశాధికారిగా డా.ఉమామహేశ్వరరావు, డా.సత్యవతితోపాటు పబ్లిక్ రిలేషన్ కార్యదర్శిగా నిరంజన్, జాయింట్ ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా వి.వెంకటగణేష్, కె.లోహిత వ్యవహరిస్తున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చినవారికి వసతి సౌకర్యంతో పాటు ఆహారం, స్థానిక రవాణా ఇతర సదుపాయాలు కల్పించనున్నారు.

**విభిన్న విభాగాల ద్వారా..**

హ్యాండ్స్–ఆన్ క్లినికల్, వర్క్‌షాప్స్–ప్రాక్టికల్ అనుభవం.. ఇలా విభిన్న విభాగాల్లో సదస్సులు నిర్వహించనున్నారు. మొత్తం 22 విభాగాల్లో 26 వర్క్‌షాపులతో పాటు 11 పోటీలు జరగనున్నాయి. క్లినికల్ స్కిల్స్ అభివృద్ధి దిశగా జరిగే కార్యక్రమంలో జీజీహెచ్‌లోని అన్ని విభాగాల వైద్యులు భాగస్వాములవుతారు. ఎమర్జెన్సీ కేసులపై ఎలా స్పందించాలి, గుండెపోటు, ఆత్మహత్య కేసులు, రోడ్డు ప్రమాదాలు తదితర విభిన్న అంశాలపై వర్క్‌షాప్‌లు నిర్వహిస్తారు.

## సీమ ద్వారం.. పరిశ్రమ నాదం



కర్నూలు : తుంగభద్ర.. కృష్ణమ్మ ప్రవహిస్తున్న నేల.. విలువైన ఖనిజాలు ఉన్న ఖిల్లా.. హైదరాబాద్–బెంగళూరు నగరాల మధ్యనున్న ప్రాంతం.. ఒకప్పుడు 'సిరి'సంపదలతో తులతూగిన సీమ ముఖ ద్వారం.. ఐదేళ్ల అధికారంలో ఉన్న వైకాపా ఇసుమంత అభివృద్ధి చేయలేదు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో సీమ పారిశ్రామిక ప్రగతి దిశగా అడుగులు వేస్తోంది. ఓర్వకల్లు మెగా ఇండస్ట్రియల్ హబ్‌ను రూ.2786.10 కోట్లతో అభివృద్ధి చేసే పనులకు అడుగులు పడుతున్నాయి. 2,624.64 ఎకరాల్లో చేపట్టే అభివృద్ధి పనులకు ఇటీవల టెండర్లు పిలిచారు. పనులు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం 'నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ అండ్ ఇంప్లిమెంటేషన్ ట్రస్ట్'(నిక్‌డిట్)తో ఒప్పందం కుదుర్చుకొంది. తొలిదశ పనుల్లో భాగంగా పారిశ్రామికవాడలోని 517 ఎకరాల్లో మౌలిక వసతుల అభివృద్ధి పనులను మొదలుపెట్టనున్నారు. ఇక్కడ పదివేల ఎకరాలు అందుబాటులో ఉండటంతో దశలవారీగా మిగిలిన భూముల్లోనూ పలు రకాల పరిశ్రమలు వచ్చేలా ప్రభుత్వం కృషి చేస్తోంది.

**'పోగు' ఉపాధి పేగు**

చేనేతపురిలో పారిశ్రామిక వెలుగులు కాంతులీననున్నాయి. ఇక్కడ కార్మికులకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో బనవాసిఫారం వద్ద టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుకు 77 ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. రూ.20 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు ఓ పారిశ్రామికవేత్త ముందుకొచ్చారు. 25 ఎకరాల్లో పరిశ్రమలను నెలకొల్పనున్నారు.

**సౌర.. పవన విద్యుత్తు**

ఆలూరు, మంత్రాలయం నియోజకవర్గాల పరిధిలో 1680 మెగావాట్ల సామర్థ్యంతో సౌర, పవన విద్యుత్తు ప్రాజెక్టుల నిర్మాణానికి ఒప్పందాలు జరిగాయి. వాటి నిర్మాణం పూర్తైతే ఆ ప్రాంతంలోని పలువురికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. దీంతోపాటు ఆయా సంస్థలు కూడా కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులతో పరిసర ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి అవకాశం ఉంది.

**నియోజకవర్గానికో ఎంఎస్‌ఎంఈ పార్కు**

ఓర్వకల్లు మండలం గుట్టపాడు క్లస్టర్‌లో 167 ఎకరాల్లో ప్లాట్లు వేయగా.. డోన్ నియోజకవర్గం జగదుర్తిలో 25 ఎకరాల్లో పార్కును అభివృద్ధి చేశారు. ఈ రెండు ఎంఎస్‌ఎంఈ పార్కులకు సంబంధించిన ప్లాట్లను ఇప్పటికే ఏపీఐఐసీ వారు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచారు. ఒక ఎకరాకు పది మందికి ఉపాధి కల్పించాలని నిర్ణయించారు.

మంత్రాలయం నియోజకవర్గంలో 30 ఎకరాల్లో, కోడుమూరులో 50 ఎకరాలు, ఆలూరులో 10 ఎకరాల్లో, ఆళ్లగడ్డలో 40 ఎకరాల్లో త్వరలో ఎంఎస్‌ఎంఈ పార్కులు రాబోతున్నాయి.

బ్రాహ్మణపల్లె ఎంఎస్‌ఎంఈ పార్కులో ముగ్గురు, ఇటిక్యాలలో ఒకరు, తంగడంచలో ఒకరు పరిశ్రమలను నెలకొల్పేందుకు ముందుకొచ్చారు.

**ఎగరనున్న డ్రోన్లు**

డ్రోన్ హబ్‌ను ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌లో ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు 300 ఎకరాలు కేటాయించారు. ఇక్కడ రూ.వెయ్యి కోట్ల వరకు పెట్టుబడులు పెట్టే అవకాశం ఉంది.. ఐదువేల మందికి ఉద్యోగాలొచ్చే అవకాశం ఉంది.

**'ఈవీ పార్కు' రయ్.. రయ్**

ఎలక్ట్రిక్ వాహనాలు జిల్లాలో తయారు చేయనున్నారు. ఓర్వకల్లులో 1200 ఎకరాల్లో రూ.13 వేల కోట్లతో 'ఈవీపార్క్'ను ఏర్పాటు చేయడానికి ఒప్పందం కుదిరింది. ఈ పార్కులో దశలవారీగా 25వేల మందికి ఉపాధి లభించనుంది. ఇందులో పీపుల్ టెక్ ఎంటర్‌ప్రైజెస్ సంస్థ రూ.300 కోట్లు పెట్టుబడి పెట్టనుంది. తొలిదశలో 300 ఎకరాల్లో ఈవీ మొబిలిటీ పార్కును ఏర్పాటు చేయనున్నారు.

**130 ఎకరాలు.. రూ.14 వేల కోట్ల పెట్టుబడి**

జపాన్‌కు చెందిన ఇటోయె మైక్రో టెక్నాలజీ కార్పొరేషన్, దేశానికి చెందిన హైడ్రెస్ గ్రూప్, బీఎన్ గ్రూప్‌లు సంయుక్తంగా రూ.14 వేల కోట్లతో సెమీకండక్టర్ తయారీ పరిశ్రమను ఓర్వకల్లులో నెలకొల్పనున్నారు. 130 ఎకరాల్లో ఏర్పాటు చేసే ఈ పరిశ్రమ వల్ల రెండు వేల మందికి ప్రత్యక్షంగా, 10 వేల మందికి పరోక్షంగా ఉపాధి లభించనుంది.

**బెవరేజెస్ యూనిట్**

రూ.1,622 కోట్ల పెట్టుబడులతో బెవరేజెస్ యూనిట్ ఏర్పాటుకు ఫార్చ్యూన్–500 జాబితా కంపెనీ రిలయన్స్ ఆసక్తి కనబరుస్తోంది. కర్నూలు జిల్లాలో ఏర్పాటుకు డీపీఆర్‌ను ప్రభుత్వానికి సమర్పించింది. అందులో ప్యాకేజ్డ్ కార్బొనేటెడ్ సాఫ్ట్‌డ్రింక్‌లు, ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ తయారు చేయనున్నారు.

**టమాటా శుద్ధి... రైతు వృద్ధి**

పత్తికొండ సమీపంలోని దూదెకొండలో రూ.11 కోట్లతో టమాటా ప్రాసెసింగ్ ప్లాంట్ ఏర్పాటుకు అడుగులు పడ్డాయి. దీన్ని మరో నాలుగు నెలల్లో పూర్తి చేయనున్నారు. ఈ పరిశ్రమ ఏర్పాటుతో ఉమ్మడి జిల్లాలో 25 వేల ఎకరాల్లో టమాటా పండించే రైతులకు మేలుచేకరూనుంది.

**గ్రీన్‌కో కాంతులు**

ప్రపంచంలోనే ఎక్కడా లేని విధంగా సౌర, వాయు, జలవనరులను ఉపయోగించి ఒకేచోట ఏకంగా ఆరువేల మెగావాట్ల విద్యుత్తును జిల్లాలో ఉత్పత్తి చేయనున్నారు. ప్రపంచంలోనే తొలి 'సమీకృత పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టు' (ఐఆర్‌ఈపీ)ను గ్రీన్‌కో సంస్థ పిన్నాపురంలో నిర్మిస్తోంది. ఏకంగా రూ.24వేల కోట్లతో చేపడుతున్న ప్రాజెక్టు పనులు చివరి దశకొచ్చాయి.

## అక్రమం.. చేయి తడిపితే సక్రమం



నెల్లూరు : 'జీ+2కు అనుమతి తీసుకుంటారు. మూడు, నాలుగు అంతస్తులు నిర్మిస్తారు. ఇదో పద్ధతి. మరికొందరు అనుమతులు తీసుకున్నా ప్లాన్‌కు సంబంధమే ఉండదు.. ఆ మాటకొస్తే సెట్‌బ్యాక్ కూడా వదలరు. కొందరు లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్లే(ఎల్‌టీపీ) సొంత లాభం చూసుకుంటూ.. సలహాలు ఇచ్చి మరీ యజమానులను అక్రమ నిర్మాణాల దిశగా ప్రోత్సహిస్తున్నారు. ఇందుకు నిదర్శనం.. ఒక్క నెల్లూరు నగరంలోనే 250 అక్రమ నిర్మాణాలను గుర్తించడం.. ఇప్పటి వరకు 40 మందికి నోటీసులు ఇవ్వడమే'

**రోజుల్లోనే ఇప్పిస్తామంటూ..**

నగర, పట్టణాల్లో భవన నిర్మాణాల అనుమతులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. తాజాగా ఈసీ, స్థల ఛాయాచిత్రం, పన్ను రసీదు, భవన నిర్మాణ ప్రణాళిక, యాజమాన్య వాంగ్మూలం, స్థల వివరాలు తెలిపే దస్తావేజులు, ఆటో క్యాడ్ ద్వారా తయారు చేసిన ఇంటి నిర్మాణ ప్రణాళిక అప్‌లోడ్ చేయాలి. అన్నీ సక్రమంగా సమర్పించినా.. అనుమతులకు నెల రోజుల సమయం పడుతుంది. కానీ, వారం రోజుల్లో అనుమతి పత్రాలు వచ్చేలా చేస్తామని మోసగించేవారి సంఖ్య.. మోసపోతున్న వారి సంఖ్య ఎక్కువైంది. ఆన్‌లైన్ దరఖాస్తు అనుమతికి కొంత, ఎల్‌ఆర్‌ఎస్‌లో రెగ్యులరైజ్ చేసేందుకు మరికొంత అంటూ దోచుకుంటున్నారు. **పనికో ధర నిర్ణయించి..**పన్నుకు, పేరు మార్పునకు, ఆన్‌లైన్‌లో దరఖాస్తు నమోదుకు, దరఖాస్తుపై ఆమోదముద్రకు, దాన్ని పరిశీలించి ఉన్నతాధికారికి పంపేందుకు, పైస్థాయి అధికారుల పేరు చెప్పి.. ఇలా ఒక్కోదానికి ఓ ధర నిర్ణయించి దోచుకోవడం మామూలైంది. అదే బహుళ అంతస్తుల భవనమైతే.. యజమాని స్థోమతను బట్టి.. ఆ మొత్తాలు ఉంటాయి. దరఖాస్తుల్లో పేర్కొన్న అంశాలన్నీ సక్రమంగా? కాదా? అన్నది ఎల్‌టీపీలు పరిశీలించాలి. ఇదే అదనుగా కొందరు దరఖాస్తుదారులను ఇబ్బంది పెడుతున్నారు. దీనిపై కమిషనర్ వైవో నందన్ మాట్లాడుతూ.. అక్రమ నిర్మాణదారులకు నోటీసులు ఇస్తాం. ఇప్పటికే ఆ మేరకు సిబ్బందికి ఆదేశాలు ఇచ్చాం అని తెలిపారు.

## వనం మనం ఒక్కటై.. వన్యప్రాణికి ఛత్రమై



నెల్లూరు : పెనుశిల నరసింహ వన్యప్రాణి అభయారణ్యం బఫర్‌జోన్(ఎకో సెన్సిటివ్) ఏర్పాటుపై అధికారులు ముమ్మర కసరత్తు చేస్తున్నారు. ఇందుకోసం సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంట్, డెవలప్‌మెంట్ సంస్థ తోడ్పాటు తీసుకుని.. ఇప్పటికే మూడు దఫాలుగా కీలక సమావేశాలు నిర్వహించారు. ఈ నెలాఖరులోగా మొత్తం ప్రక్రియను పూర్తి చేసి.. పూర్తిస్థాయి నివేదికను కేంద్రానికి పంపేందుకు సమాయత్తమవుతున్నారు.

**గతంలోనే పచ్చజెండా**

కర్నూలు జిల్లాలోని టైగర్ ఫారెస్ట్ తరహాలో... ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని నేలపట్టు పక్షు కేంద్రం తీరులో.. నెల్లూరు– కడప– అన్నమయ్య జిల్లాల పరిధిలోని అటవీ ప్రాంతంలో ఉన్న వన్య ప్రాణుల సంరక్షణకు కేంద్రం ఈ ప్రాంతాన్ని పెనుశిల నరసింహ అభయారణ్యంగా తీర్చిదిద్దాలని కేంద్రం గతంలోనే రాష్ట్ర అటవీశాఖకు ఆదేశాలిచ్చింది. దాంతో ఆ మేరకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

**విహార కేంద్రంగానూ..**

బఫర్ జోన్ పరిధిలోని అయిదు కి.మీ.లలో రాత్రి 6 నుంచి ఉదయం 6 గంటల వరకు ఇతరుల ప్రయాణంపై నిషేధం విధిస్తారు. ఆ ప్రాంతంలో ఇప్పటికే నివాసం ఉండేవారు కొత్తగా భవనాలు నిర్మించుకోవాలంటే.. అటవీశాఖ అనుమతి తప్పనిసరి. వన్య ప్రాణులకు ఇబ్బందిలేని పక్షంలోనే అనుమతి లభించే అవకాశం ఉంది. అభయారణ్యం పూర్తిస్థాయిలో రూపుదిద్దుకుంటే.. జిల్లాతో పాటు అంతరాష్ట్ర ప్రజలకు విహార కేంద్రంగా నిలుస్తుందని అధికారులు చెబుతున్నారు.

**ఏమిటీ బఫర్ జోన్**

అభయారణ్యం చుట్టూ 2 నుంచి 5 కి.మీ. మేర బఫర్ జోన్ ఏర్పాటు చేయనున్నారు. దీని పరిధిలో అత్యధికంగా జిల్లాలోని రెవెన్యూ గ్రామాలు ఉండగా– తర్వాత అన్నమయ్య, కడప జిల్లాలోని ఉంటాయి. ఈ రెవెన్యూ గ్రామాల్లోని ప్రజలకు సంబంధించిన పూర్తి వివరాలను అటవీశాఖ సేకరిస్తోంది. దీనిపై వారికి పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు.

**నెలాఖరులోగా నివేదిక – మహబూబ్‌బాషా, జిల్లా అటవీశాఖ అధికారి, నెల్లూరు**


బఫర్‌జోన్ ఏర్పాటు ప్రణాళికను ఈ నెలాఖరులోగా పూర్తి చేస్తాం. దాన్ని రాష్ట్ర అటవీశాఖ ద్వారా కేంద్రానికి పంపుతాం. దీని ఏర్పాటుతో వన్య ప్రాణుల సంరక్షణతో పాటు అక్కడ నివాసాలు ఉండే నెల్లూరు, అన్నమయ్య, కడప జిల్లాల ప్రజలకూ అంతే రక్షణ ఉంటుంది.

## దోచుకున్నా.. దాచేస్తున్నారు!

తిరుపతి : చంద్రగిరి మండలం ఎం.కొత్తపల్లిలో ఆప్షన్–3 కింద 713 ఇళ్లను గుత్తేదారు నిర్మించాల్సి ఉండగా.. గృహ నిర్మాణ సంస్థలోని ఓ డీఈఈ.. అతని భార్య, తల్లి పేరిట పనులు దక్కించుకున్నారు. ఇదేవిధంగా రేణిగుంట మండలం జీపాళ్యం, వడమాలపేట మండలం కల్లూరులోనూ ఆ సంస్థ సిబ్బందే పనులు చేశారు. నిబంధనలు ఉల్లంఘించారని విజిలెన్స్ అధికారులు గుర్తించినా ఇప్పటివరకూ చర్యలు తీసుకోలేదు.

పుంగనూరు నియోజకవర్గంలోనూ గతంలో ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం కింద నిర్మించిన ఇళ్లకు వైకాపా హయాంలో బిల్లులు చేసుకున్నారు. ఇది వాస్తవమేనని జగన్ పాలనలోనే గుర్తించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ సంస్థ అధికారులు, విజిలెన్స్ బృందాలు నిర్ధారించినా బాధ్యులపై చర్యలు లేవు.

వైకాపా హయాంలో గృహ నిర్మాణ సంస్థలో అవినీతి రాజ్యమేలింది. కొందరు అధికారులు, ఆ పార్టీ నాయకులు నిబంధనలకు యథేచ్ఛగా తూట్లు పొడిచారని ఆనాడే అక్రమాలన్నీ వెలుగు చూసినా ఉన్నతాధికారుల వరకు అంతా చోద్యం చూశారు. కూటమి ప్రభుత్వం కొలువు దీరిన తర్వాత అప్పటి బాగోతాలపై విజిలెన్స్ యంత్రాంగం విచారణ జరిపింది. అక్రమాలు నిజమేనని తేల్చింది. అయితే ఆ నివేదికలను ఉన్నతాధికారులు బుట్టదాఖలు చేయడంపై విస్మయం



వ్యక్తమవుతోంది. బాధ్యులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడంతోపాటు నిధులు రాబడితే భవిష్యత్తులో తప్పులు చేయాలంటే ఎవరైనా భయపడతారు. సొంతంగా ఇల్లు కట్టుకోలేని పేదలకు గృహాలు నిర్మించేందుకు ఆసక్తి ఉన్న సంస్థల నుంచి వైకాపా ప్రభుత్వం టెండర్లు పిలిచింది. వీటిని ఆప్షన్– 3 ఇళ్లుగా పేర్కొన్నారు. తిరుపతి జిల్లాలో 16,393 గృహాలున్నాయి. వాస్తవంగా ఇవి గుత్తేదారులు కట్టాలి. ఇందుకు భిన్నంగా 2,180 ఇళ్లను గృహ నిర్మాణ సంస్థలోని ఇద్దరు డీఈఈలు, వార్డు సచివాలయ ఉద్యోగి, డేటా ఎంట్రీ ఆపరేటర్ ఒకరు కాంట్రాక్టర్ల అవతారం ఎత్తారు. మొత్తంగా రూ.12.05 కోట్లు వారికి బిల్లుల రూపేణా చెల్లించారు. సిమెంట్, స్టీల్, నిర్మాణ సామగ్రి పేరుతో మరో రూ.4.04 కోట్లు.. వెరసి రూ.16.09 కోట్లు సమర్పించారు.

**ప్రారంభంలో హడావుడి చేసి**

ఈ బాగోతంపై రెండు నెలల క్రితం గృహ నిర్మాణ సంస్థలోని విజిలెన్స్ అధికారులు విచారణ జరిపారు. అంతకుముందు కూటమి ప్రభుత్వం వచ్చిన తొలినాళ్లలోనే రాష్ట్ర విజిలెన్స్ యంత్రాంగం సైతం ఆప్షన్–3 గృహాల నాణ్యత, చెల్లింపుల గురించి ఆరా తీసింది. బాధ్యులెవరో గుర్తించి క్రమశిక్షణ చర్యలకు సిఫార్సు చేశారు. ప్రజాధనం ఎంత దుర్వినియోగమైందో స్పష్టంగా పేర్కొన్నారు. ఇప్పటివరకూ ఆ నివేదిక ప్రకారం ఎవరిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

**రోజుల వ్యవధిలోనే పూర్తయ్యాయంటూ..:** పుంగనూరు నియోజకవర్గంలో అవినీతి కొత్త పుంతలు తొక్కింది. 2014– 19 మధ్య తెదేపా హయాంలో నిర్మించిన, అర్ధంతరంగా ఆగిపోయిన గృహాలకు కూడా ఇక్కడ బిల్లులు చేశారు. రోజుల వ్యవధిలోనే గోడల దశ నుంచి ఇంటి నిర్మాణం పూర్తయిందంటూ ఫొటోలు తీసి అప్‌లోడ్ చేశారు. అధికారులు, సిబ్బంది వాటాలు తీసుకొని వైకాపా అనుకూల వ్యక్తుల ఖాతాల్లో డబ్బులు జమ చేశారు. దీనిపై సైతం ప్రభుత్వానికి నివేదిక అందింది. ఇదే తరహాలో వరదయ్యపాళెం మండలం ఇందిరానగర్ కాలనీలోనూ రూ.13.75 లక్షల అవినీతి జరిగిందని తేటతెల్లమైంది. 53 ఇళ్లు పూర్తి చేయకుండానే పూర్తి బిల్లులు చెల్లించేశారు.

**ఏ అవకాశాన్ని వదలకుండా దోచి..**

జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 2020 డిసెంబరులో పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. అనంతరం 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' పథకం కింద గృహాలు మంజూరు చేశారు. తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో ఈ రెండు వ్యవహారాల్లోనూ అవినీతి జరిగింది. వీటితోపాటు స్థలాల కొనుగోలు, చదునులోనూ అవకతవకలు చోటుచేసుకున్నాయి. ఉదాహరణకు వెదురుకుప్పం మండలంలోని కొండ కింద ఉన్న ఓ లే అవుట్‌ను చదును చేసేందుకు రూ.80 లక్షలు ఖర్చు చేశారు. ఇదే ఖర్చుతో అనువైన ప్రాంతంలో మంచి స్థలం కొనుగోలు చేయవచ్చని తెలిసినా ఆ దిశగా అడుగులు పడలేదు. ఇలా అడుగడుగునా వైకాపా నేతలు ప్రభుత్వ సొమ్మును దోచేశారు. సందట్లో సడేమియా అన్నట్టు పలువురు అధికారులు సైతం చేతివాటం ప్రదర్శించారు.

## ఇంతెందుకు.. తగ్గిద్దాం!

తిరుపతి : తిరుపతిలోని గోవిందరాజస్వామి సత్రాల స్థానం లో శ్రీపాదం, అచ్యుతం వసతి సముదాయాల నిర్మాణాలకు వైకాపా హయాంలో ఏకకాలంలో రూ.600 కోట్లకు టెండర్లు ఖరారు చేయడాన్ని విజిలెన్స్ విభాగం గతేడాది ఇచ్చిన నివేదికలో తప్పు పట్టింది. ఎక్కువ కొటేషన్ల టెండర్లు ఆమోదించారని పేర్కొంది. తితిదే గణాంక అధికారి, ఇంజినీరింగ్ విభాగం ఏకకాలంలో రూ.300 కోట్లు అచ్యుతం, రూ.300 కోట్లు శ్రీపాదం వసతి భవనాలకు అనుమతులు ఇవ్వడంలో గత పాలకుల అవినీతి మరకలు ఉన్నాయంటూ నివేదిక సమర్పించింది. ఈ విషయాలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. ఈ రెండు సముదాయాల పనులు 2024 మార్చి 15 నుంచి ప్రారంభమయ్యాయి. ఇప్పటికే రెండు వసతి కేంద్రాలకు సంబంధించి రూ.300 కోట్లకు పైగా చెల్లింపులు జరిగినట్లు సమాచారం. ఈ క్రమంలో రెండు వసతి



గృహాలకు సంబంధించి నిర్మాణ వ్యయం తగ్గించే అవకాశాలు ఉన్నాయంటూ ఇటీవల జరిగిన తితిదే పాలక మండలి సమావేశంలో చర్చించారు. ఈ నేపథ్యంలో కొన్ని అంశాల్లో వ్యయం తగ్గించేందుకు ఇంజినీరింగ్ విభాగం నివేదికలు రూపొందించే పనిలో నిమగ్నమైనట్లు తెలుస్తోంది.

**సదుపాయాలు ఇలా..**శ్రీపాదం, అచ్యుతం తొమ్మిది అంతస్తులతో నిర్మిస్తున్నారు. ఒక్కో భవనంలో 532 గదులు ఉంటాయి. ఒకటో అంతస్తులో పార్కింగ్, 2వ అంతస్తులో రిసెప్షన్, అన్నదాన కేంద్రం ఉంటాయి. 3, 4 అంతస్తుల్లో 48 డార్మెటరీలు, 5 నుంచి 9 అంతస్తుల్లో 532 గదులు నిర్మిస్తున్నారు.

# వినియోగం పెరిగి.. సరఫరా తగ్గి

పి.గన్నవరం: ఎండలు మండిపోతున్నాయి. వేసవిలో సాధారణంగా తాగునీటి వినియోగం ఎక్కువగా ఉంటుంది. ప్రభుత్వ పథకాల ద్వారా పూర్తిస్థాయిలో తాగునీరు సరఫరా కాకపోవటంతో ప్రజలు ప్రయివేటు ఆర్వో ప్లాంట్ల నుంచి తెచ్చుకుంటున్నారు. ఏప్రిల్ 27న కాలువలు కట్టేశారు. జూన్ 1న నామమాత్రంగా తెరిచారు. పంట కాలువలకు పూర్తిస్థాయిలో నీరు రాకపోవటంతో సమగ్ర రక్షిత తాగునీటి పథకాలు, గ్రామ పంచాయతీలు నిర్వహించే పథకాల నుంచి కొళాయిలకు నీరందడం లేదు.

**జిల్లాలో 31 పథకాలు..**

జిల్లాలో 31 సమగ్ర రక్షిత తాగునీటి పథకాలు ఉన్నాయి. ఒక వ్యక్తికి 40 లీటర్ల శుద్ధ జలాలు అందించే విధంగా పథకాలను నిర్మించారు. జల్‌జీవన్ మిషన్ నిధులతో చేపట్టే పథకాలను ఒక వ్యక్తికి రోజుకు 55 లీటర్లు సరఫరా చేసేవిధంగా రూపకల్పన చేశారు. ఇవి కొన్నిచోట్ల అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం ఉన్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను



55 లీటర్ల సామర్థ్యంతో విస్తరించాలి. రూ.1,650 కోట్లతో చేపట్టే వాటర్‌గ్రిడ్ పథకం అందుబాటులోకి వస్తే సమస్య పరిష్కారమవుతుందని అధికారులు చెబుతున్నారు.

**రోజు విడిచి రోజు..**

ముంగండలోని పథకంపై 10 గ్రామాలకు చెందిన 25 ఆవాసప్రాంతాల్లో సుమారు 36 వేల మంది జనాభా ఆధారపడి ఉన్నారు. రోజూ 14 లక్షల లీటర్ల శుద్ధజలాలు సరఫరా చేస్తున్నారు. వేసవిలో సుమారు నాలుగు లక్షల లీటర్ల వినియోగం పెరిగింది. మానేపల్లిలోని పథకం ద్వారా ఆరుగ్రామల్లో 22 ఆవాస ప్రాంతాలకు చెందిన సుమారు 25 వేల మందికి రోజుకు తొమ్మిది లక్షల లీటర్ల శుద్ధజలాలను సరఫరా చేస్తున్నప్పటికీ తాగునీటి సమస్య నెలకొంది. పి.గన్నవరంలో రోజు విడిచి రోజు నీరు సరఫరా చేస్తున్నారు.

**రూ.200 కోట్లతో పనులు- సీహెచ్ఎన్‌వీ కృష్ణారెడ్డి, ఈఈ, ఆర్‌డబ్ల్యూఎస్** జల్‌జీవన్‌మిషన్ నిధులు రూ.200 కోట్లతో పనులు చేస్తున్నాం. గుత్తేదారులకు రూ.55 కోట్ల మేర బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఈ పనులు పూర్తయిన తరువాత ప్రజలకు పూర్తిస్థాయిలో తాగునీరు సరఫరా అవుతుంది.

# ఆట.. అవినీతి మేట!

అమలాపురం : వైకాపా పాలనలో 2024 సార్వత్రిక ఎన్నికల ముందు క్రీడాకారులను, యువతను ఆకర్షించేందుకు ఆడుదాం.. ఆంధ్ర కార్యక్రమాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. దీనికి సంబంధించి కొనుగోలు చేసిన క్రీడా సామగ్రిలో పలు అవకతవకలు జరిగినట్లు కూటమి ప్రభుత్వం గుర్తించింది. వీటిని నిగ్గు తేల్చాలని విజిలెన్స్ విచారణకు ఆదేశించారు.

**అంతా వారిష్టం..**

15 ఏళ్లు పైబడిన వారికి క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ డబుల్స్ విభాగంలో డిసెంబరు 2023 నుంచి 2024 ఫిబ్రవరి వరకు క్రీడలు నిర్వహించారు. దీనికి పెద్దఎత్తున క్రీడా సామగ్రి కొనుగోలు చేశారు. అందులో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి.

**నాసిరకం సామగ్రి**

క్రీడా సామగ్రి కొనేందుకు రూ.కోట్లు కుమ్మరించారు. ఉన్నత స్థాయిలో పర్యవేక్షణ లేక పోవడంతో నాసిరకం సామగ్రి సరఫరా చేశారు. కొన్ని చోట్ల ప్రారంభం రోజునే క్రికెట్ బ్యాట్లు విరిగి పోవడం, వాలీబాల్స్ పగిలి పోవడం, నెట్‌లు చిరిగి పోవడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. ఆటలు ముగిసిన తర్వాత వాటిని పాఠశాలల్లో భద్రపరచాలని



ఆదేశాలు ఉన్నా వైకాపా నాయకులు, కార్యకర్తలు ఇళ్లకు పట్టుకెళ్లిపోయారు.

**ఈ వివరాలపై ఆరా:** అక్రమాలు తేల్చేందుకు విజిలెన్స్ రంగంలోకి దిగింది. అప్పట్లో ఎవరెవరు విధులు నిర్వహించారు..? ఇప్పుడు వారెక్కడ పని చేస్తున్నారు.? ఏ రకం క్రీడా సామగ్రి సరఫరా చేశారు.? ఏ ఆటలో ఎంత మంది క్రీడాకారుల వివరాలు నమోదు చేశారు? ఎంత మంది పాల్గొన్నారు.? ఎన్ని నిధులు కేటాయించారు.? తదితర వివరాలు అందజేయాలని ఆదేశించారు.

**సచివాలయాల వారీగా..**

గ్రామ, వార్డు సచివాలయాల వారీగా జరిగిన అన్ని రకాల ఆర్థిక లావాదేవీల వివరాలను అందించాలని విజిలెన్స్ అధికారులు కోరినట్లు సమాచారం. ఈ క్రీడలు ముగిసిన తర్వాత ఈ సామగ్రిని ఎవరికి అప్పగించారో తెలియజేయాలని సూచించారు.

**విచారణ జరుగుతోంది..-సురేష్‌కుమార్, జిల్లా క్రీడా ప్రాధికారిక సంస్థ అధికారి**

గత ప్రభుత్వ హయాంలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై విజిలెన్స్ విచారణ జరుగుతుంది. దీంతో సమగ్ర వివరాలు తెలియజేశాం. విచారణ ముగిసిన అనంతరం పూర్తి వివరాలు వెల్లడించే వీలు కలుగుతుంది.

# బడులు తెరిచే వేళ.. బాధ్యత మరిచారేల?



పుట్టపర్తి: వేసవి సెలవుల అనంతరం ఉమ్మడి అనంత జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలలు ప్రారంభం కానున్నాయి. ఈసారి ప్రభుత్వ బడుల్లో పిల్లలకు సమస్యలే స్వాగతం పలకనున్నాయి. దాదాపు 50 రోజులపాటు మూతపడటంతో ఆవరణలు చెత్తాచెదారంతో నిండిపోయాయి. కొన్నిచోట్ల అపరిశుభ్రత నెలకొంది. ప్రారంభానికి వారం రోజుల ముందు నుంచే తరగతి గదులు, ఆవరణలు శుభ్రం చేయించాల్సిన అధికారులు పట్టించుకోలేదు. పాఠశాలల ప్రారంభానికి ముందే సంసిద్ధతా కార్యక్రమం ప్రకటించారు. ఉపాధ్యాయుల బదిలీలు, ఇతరత్రా కారణాలతో కార్యక్రమాన్ని వాయిదా వేశారు. దీంతో పరిశీలించేవారు లేకపోవడం సమస్యగా మారింది.నీటి నిల్వతో ఇబ్బందులుఅనంత నగరంలోని కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణ ఇది. పాఠశాల పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. గోడలకు ఆనుకొని చెత్త కుప్పలున్నాయి. చిన్నపాటి వర్షానికే నీరు నిలిచిపోయింది. తాగునీటి కొళాయిల వద్ద అపరిశుభ్రత నెలకొంది. ఇక్కడ 388 మంది విద్యార్థులున్నారు. బాలికలకు మాత్రమే మరుగుదొడ్లు ఉన్నాయి.

**బదిలీల ప్రక్రియలో నిమగ్నమై..**

గడచిన పది రోజుల నుంచి ఉపాధ్యాయుల బదిలీలు కొనసాగుతున్నాయి. ఎవరికి ఏ ప్రాంతం దక్కుతుందోనని ఉపాధ్యాయులు ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు. విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులతో సహా అందరూ బదిలీల ప్రక్రియలో మునిగిపోయారు. ఈ నేపథ్యంలో చాలావరకు ఎవరూ బడులవైపు చూడలేదు.

**ప్రమాదాలు జరగకముందే..**

బడుల్లో ఎక్కడికక్కడ చెత్తాచెదారం పేరుకుపోవడంతో విషపురుగులు తిరుగుతున్నాయి. చెన్నేకొత్తపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో విష సర్పం కనిపించింది. ఇక పలుచోట్ల నాడు-నేడు కింద చేపట్టిన పనులు ఇప్పటికీ అసంపూర్తిగా ఉన్నాయి. అసౌకర్యాల నడుమ ఉపాధ్యాయులు పాఠాలు చెప్పాల్సి రావడం.. విద్యార్థులు చదువుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి సాధ్యమైన మేరకు కనీస వసతులు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# చదువుల గుడి.. వసతుల ఒడి



కర్నూలు : ఉచిత విద్యకు నిలయాలైన ప్రభుత్వ పాఠశాలలు మెరుగైన వసతులతో విద్యార్థులకు స్వాగతం పలుకుతున్నాయి. ఇక్కడ సుశిక్షితులు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు పాఠాలు చెబుతారు. రుచికరమైన మధ్యాహ్న భోజనం, ఏకరూప దుస్తులు, పుస్తకాలను ప్రభుత్వమే ఉచితంగా అందిస్తుంది. దీంతోపాటు తల్లికి వందనం పథకం కింద ఒక్కో విద్యార్థికి రూ.15 వేలు చొప్పున ప్రభుత్వం నేరుగా తల్లుల ఖాతాల్లో జమ చేస్తుంది. ఇన్ని సౌకర్యాలు, ప్రయోజనాలు కలిగిన ప్రభుత్వ పాఠశాలల్లో చదివితే విద్యార్థి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

**రూ.135.76 కోట్లతో ఏకరూప దుస్తులు, పుస్తకాలు**

ఉమ్మడి జిల్లాలోని 5,95,722 మంది విద్యార్థులకు పుస్తకాలతో పాటు ఏకరూప దుస్తులను పంపిణీ చేస్తున్నారు. ఒక్కొక్కరికి రూ.2,279 విలువ చేసే సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్రకిట్లను అందజేస్తున్నారు. ఇందులో పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, వర్కుబుక్స్, బెల్టులు, బ్యాగులు, నిఘంటువులు అందించనున్నారు. వీటితో పాటు ఏకరూప దుస్తులను కూడా ఇవ్వనున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వీటికయ్యే రూ.137,76,50,438 ఖర్చును ప్రభుత్వమే భరిస్తుంది.

**నిపుణులైన ఉపాధ్యాయులు**

నిపుణులైన ఉపాధ్యాయులతో ప్రభుత్వ పాఠశాలల్లో బోధన సాగుతోంది. నంద్యాలలో ప్రాథమిక పాఠశాలల్లో 3,590, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 1,699, ఉన్నత పాఠశాలల్లో 6,004 మంది, కర్నూలు జిల్లాలో ప్రాథమిక పాఠశాలల్లో 4,077, ప్రాథమికోన్నత బడుల్లో 2,046, ఉన్నత పాఠశాలల్లో 5,387 మంది పనిచేస్తున్నారు.

**పరిశుభ్రతకు ప్రాధాన్యం**

కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలల శుభ్రతకు విద్యార్థుల సంఖ్యను బట్టి 3245 మంది ఆయాలను నియమించారు. వీరికి నెలకు రూ.6 వేల చొప్పున చెల్లిస్తున్నారు. ఈ లెక్కన నెలకు రూ.1,94,70,000 గౌరవ వేతనం చెల్లిస్తున్నారు.

**స్మార్ట్ తెరలపై డిజిటల్ బోధన**

ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విద్యా విధానం అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా నంద్యాల జిల్లాలో 1108, కర్నూలు జిల్లాలో 1287 పాఠశాలల్లో ఇంటరాక్టివ్ ప్యానెల్స్, స్మార్ట్ టీవీలను ఏర్పాటు చేశారు. 10,321 గ్రీన్‌చాక్ బోర్డులను ఏర్పాటు చేశారు.

**మధ్యాహ్న భోజనానికి నిత్యం రూ.41.90 లక్షలు**

డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కింద ఉమ్మడి జిల్లాలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఒక్కొక్కరికి 100 గ్రాముల చొప్పున అన్నం అందిస్తున్నారు. ఇందుకు రూ.5.88 వ్యయం చేస్తున్నారు. ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఒక్కొక్కరికి రోజుకు 150 గ్రాముల ఆహారం ఇస్తున్నారు. ఇందుకు రూ.8.57 ఖర్చవుతోంది.

ఈ లెక్కన రెండు జిల్లాల్లో కలిపి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు 1,95,475 మందికి రోజుకు రూ.11,49,393, ప్రాథమికోన్నత విద్యార్థులు 1,05,316 మందికి రూ.11,80,406, ఉన్నత పాఠశాలల విద్యార్థులు 2,17,132 మందికి రూ.18,60,821 వ్యయం చేస్తున్నారు. ఇలా ఉమ్మడి జిల్లాలో సగటున మధ్యాహ్న భోజనానికి రోజుకు రూ.41,90,620 ఖర్చవుతోంది. భోజనం కాకుండా ఒక్కో విద్యార్థికి వారానికి ఐదు కోడిగుడ్లు ఇస్తున్నారు. వారంలో మూడు రోజులు 450 మిల్లీగ్రాములు చొప్పున రాగి జావ ఇస్తున్నారు.

# రూ.99 కోట్లతో ప్రగతి ప్రణాళిక

గుంతకల్లు : గుంతకల్లు మున్సిపాలిటీలో ఏ కాలనీకి వెళ్లినా సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. శివారు కాలనీల్లో పరిస్థితి అత్యంత దారుణంగా ఉంది. ఈక్రమంలో 20 రోజుల పాటు ఎమ్మెల్యే గుమ్మనూరు, తెదేపా నాయకులు ఆయా కాలనీల్లో పర్యటించి పలు ప్రధాన సమస్యల్ని గుర్తించారు. ఆ వివరాలన్నీ పురపాలక కమిషనర్‌కు అందజేశారు. తద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు.

**పురపాలక మంత్రి దృష్టికి సమస్యలు**

అన్ని కాలనీల్లోని సమస్యలను పరిష్కరించడానికి మున్సిపల్ అధికారులు సమగ్ర ప్రణాళికను రూపొందించి దాన్ని ఎమ్మెల్యే జయరాంకు అందజేశారు. ఎమ్మెల్యే నిధుల మంజూరు కోసం పురపాలక శాఖామంత్రి నారాయణకు అందజేశారు. కాలనీల్లో రోడ్లు, మురుగు కాలువలు, కల్వర్టులు, తాగునీటి పైపులైన్, విద్యుత్తు దీపాల సౌకర్యం తదితర 454 పనులకు రూ.99 కోట్ల ఖర్చు అవుతుందన్న అంచనాతో ప్రణాళికను రూపొందించారు. పురపాలికకు ఇంటి పన్నులు, నీటి పన్నులు, వాణిజ్య సముదాయాల నుంచి లభిస్తున్న అద్దెలు విద్యుత్తు ఛార్జీలు, పారిశుద్ధ్య కార్మికులు, ఇంజినీరింగ్ కార్మికులకు జీత భత్యాలు చెల్లించడానికే సరిపోతోంది. అభివృద్ధి పనులు చేపట్టడానికి సాధారణ నిధులు లేని కారణంగా ప్రభుత్వ గ్రాంట్ల కోసం అధికారులు ఎదురు



చూస్తున్నారు. ముఖ్యంగా ప్రధాన రహదారుల పక్కన మురుగు కాలువలు లేని కారణంగా పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మురుగు నీటిలోనే వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. ఎమ్మెల్యే అందజేసిన ప్రణాళికకు సంబంధించి ప్రభుత్వం విడుదల చేసే నిధుల కోసం అధికారులు ఎదురు చూస్తున్నారు.

**నిధులు విడుదలైతేనే పనులు** పురపాలక సంఘం రూపొందించిన ప్రణాళికను ఎమ్మెల్యేకు అందజేశాం. ఆయన ప్రభుత్వానికి సమర్పించారు. నిధుల విడుదల విషయాన్ని ఉన్నతాధికారులు పరిశీలిస్తున్నారు. నిధులు రాగానే పనులు పూర్తి చేస్తే పట్టణ ప్రజల సమస్యలు అన్నీ పరిష్కారమవుతాయి. నయీం అహమ్మద్, కమిషనర్

# కూరగాయలు దరిచేరవా..?

పుత్తూరు : ఉద్యోగ, ఉపాధి కోసం పిల్లల చదువుల నిమిత్తం పట్టణాలకు వచ్చి నివసిస్తున్న, స్థిరపడుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతున్నా సరిపడా రైతుబజార్లు అందుబాటులో లేవు. ప్రస్తుతం ఉమ్మడి చిత్తూరు జిల్లాలో చిత్తూరు, తిరుపతి, పలమనేరు, గూడూరులో తప్ప మరెక్కడా ఇవి లేవు. గత ప్రభుత్వ హయాంలో పుత్తూరు, నగరి, పలమనేరు, తిరుచానూరు, చంద్రగిరిలో వీటి ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. పలమనేరులో పూర్తిచేసి ప్రారంభించారు. తిరుచానూరులో నిర్మాణం పూర్తయినా నేటికీ ప్రారంభించ లేదు. ప్రస్తుతం వాటి ప్రాంగణాల్లో పిచ్చిమొక్కలు మొలుస్తున్నాయి. చంద్రగిరిలో పునాదుల దశలోనే వదిలేశారు. పుత్తూరులో స్థల పరిశీలన చేశారు. నగరిలో స్థలం కూడా చూపలేదు. ప్రజాప్రతినిధులు చొరవ చూపకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది.

**ప్రజలకు ఒనగూరే మేలు..**

మార్కెటింగ్ శాఖ నిధులతో నిర్మించే ఈ రైతుబజార్లలో నామమాత్రపు అద్దెలకు రైతులు, స్వయం సహాయక సంఘాలకు దుకాణాలు కేటాయిస్తారు. వీటి నిర్వహణకు ఎస్టేట్ ఆఫీసర్, ఒక అటెండర్ ఉంటారు. జేసీ, డీఎస్వో, మార్కెటింగ్, ఉద్యానశాఖల అధికారులతో కమిటీ ఉంటుంది. బహిరంగ మార్కెట్‌తో పోలిస్తే కిలోకి రూ.5 నుంచి రూ.10 తక్కువ ధరకు ఇక్కడ కూరగాయలు లభ్యమవుతాయి.



టమాటా, ఉల్లిపాయలు తదితరాల ధరలు పెరిగినపుడు రాయితీపై ఆయా ఉత్పత్తులు ప్రజలకు అందించే వెసులుబాటు ఉంటుంది.

**నిధుల కొరతతోనే..**

ప్రభుత్వం మార్కెట్ యార్డుల నిర్మాణాలకు పచ్చజెండా ఊపింది. అయితే సీఎంఎఫ్ ద్వారా బ్యాంకు రుణాలు తీసుకుని నిర్మాణాలు చేపట్టాలని ఆదేశాలు ఇచ్చారు. దీంతో మంజూరు అయినా నిర్మాణాలు పూర్తి చేయలేదు. ఈ నేపథ్యంలో వీటి నిర్మాణంలో జాప్యం జరుగుతోంది. స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని నిధులు మంజూరయ్యేలా కృషిచేస్తేనే ఆయా ప్రాంతాల్లో రైతుబజార్లు ప్రజలకు అందుబాటులోకి వస్తాయి.

ఉమ్మడి జిల్లాలో నగరపాలక సంస్థలు: 2

పురపాలికలు: 10

ప్రస్తుతం ఉన్న రైతుబజార్లు: 4

నిత్యం వినియోగదారులు: 2 వేలకు పైబలుకు

అవసరమైన ప్రదేశాలు: శ్రీకాళహస్తి, వెంకటగిరి, సూళ్లూరుపేట, నాయుడుపేట, కుప్పం, పుంగనూరు, పుత్తూరు, నగరి

# ఉపాధి.. సంతృప్తి

కర్నూలు : నలుగురు మహిళా సభ్యులను ఒక యూనిట్‌గా ఏర్పాటుచేసి తృప్తి క్యాంటీన్లు అప్పగిస్తారు. దీనిని నడిపేందుకుగాను 20 మీటర్ల పొడవు, 12 మీటర్ల వెడల్పుతో కంటెయినర్‌ను ప్రభుత్వం సమకూరుస్తుంది. వంట, నిర్వహణ అంశాలపై శిక్షణ ఇస్తుంది. పర్యావరణ హితాన్ని కాంక్షిస్తూ ఎలక్ట్రిక్ పరికరాలు అందిస్తారు. సౌరశక్తిని ఉపయోగిస్తారు. ప్రస్తుతం విపణిలో ఆహార పదార్థాలకు మంచి డిమాండు ఉంది. ఉమ్మడి జిల్లాలో ప్రతిరోజూ రూ.కోట్లల్లో వ్యాపారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో మహిళలకు ఉపాధి చూపేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా పట్టణ ప్రాంతాల్లో 'తృప్తి' క్యాంటీన్లను అందుబాటులోకి తీసుకొస్తోంది. ఏపీ మెప్మా, ఓ సంస్థ ఉమ్మడి భాగస్వామ్యంతో వీటిని అందుబాటులోకి తీసుకురానున్నారు. ఉమ్మడి జిల్లాలో కర్నూలు నగరపాలక సంస్థ, నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరు, డోన్, ఆళ్లగడ్డ, ఆత్మకూరు, నందికొట్కూరు, గూడూరు పురపాలక సంఘాలతోపాటు బేతంచెర్ల నగర పంచాయతీలో కలిపి 25,300 స్వయం సహాయక పొదుపు సంఘాలున్నాయి. 2,58,823 మంది మహిళలున్నారు.

**ఒక్కొక్కరు రూ.3.10 లక్షల చొప్పున..**

క్యాంటీన్ నిర్వహణకు పెట్టుబడి రూ.16.40 లక్షలుగా నిర్ణయించారు. ఒక్కో క్యాంటీన్‌కు సంబంధించి నలుగురు స్వయం సహాయక సంఘాల సభ్యులుంటే ఒక్కొక్కరు రూ.3.10 లక్షల చొప్పున రూ.12.40 లక్షలు పెట్టుబడి పెట్టాలి. మిగతా పెట్టుబడి మొత్తం.. కంటెయినర్, యంత్ర పరికరాలు, సౌర విద్యుత్తు, ఇతర అవసరాల రూపంలో మెప్మా, ఓ



సంస్థ ప్రతినిధులు చేయూతనిస్తారు. ఒక్కో క్యాంటీన్ నెలవారీ టర్నోవర్ రూ.6.39 లక్షలు ఉండేలా.. ప్రతినెలా లాభం రూ.2.46 లక్షలు వచ్చేలా ప్రణాళికలు రూపొందిస్తోంది.

**కాలుష్య రహితంగా..**

వంట కోసం వంద శాతం ఎలక్ట్రిక్, పీఎం సూర్యఘర్ కింద సౌర విద్యుత్తు వినియోగిస్తారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజన సదుపాయం ఉంటుంది. అనుభవజ్ఞులైన చెఫ్‌లు, ఎప్పటికప్పుడు ఆహార తనిఖీలు నిర్వహించి పలు సూచనలు అందిస్తారు. ఎప్పటికప్పుడు ఖాతాదారుల అభిప్రాయాలు తెలుసుకుని క్యాంటీన్లను సమర్థంగా నడిపిస్తారు. సంతృప్తి చెందేలా ఆహారం అందిస్తారు.

**24 గంటలు పనిచేసేలా..**

ఈ ఏడాది మార్చి 8 నుంచి జూన్ 8వ తేదీలోగా కర్నూలులో 10, ఆదోని 02, ఎమ్మిగనూరు 01 తృప్తి క్యాంటీన్లను స్వయం సహాయక పొదుపు మహిళలతో ఏర్పాటు చేయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. నంద్యాల జిల్లాలోనూ పది వరకు ఏర్పాటు చేయనున్నారు. వీటిని నగరంతోపాటు పట్టణ ప్రాంతాల్లోని ముఖ్యమైన ప్రాంతం కూడళ్లు, హైవేను ఆనుకుని ఉన్న ప్రదేశాలను ఎంపిక చేయడంతోపాటు 24 గంటలు పనిచేసేలా చూస్తారు.




## నెవ్వర్ బిఫోర్ అనేలా స్పై పాప గ్లామర్ ఎటాక్..

తమిళం, తెలుగు, కన్నడ భాషల్లో నటించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న హీరోయిన్ ఐశ్వర్య మెనన్ సోషల్ మీడియాలో మళ్లీ హాట్ టాపిక్ అవుతోంది. తెల్లటి టాప్, షార్ట్ ప్యాంట్‌లో స్టన్నింగ్ లుక్‌తో పోజులిచ్చిన ఈ లేటెస్ట్ ఫోటోషూట్ ఇప్పుడు ఇంటర్నెట్‌ను షేక్ చేస్తోంది. 'గ్రేస్ ఇన్ ఎవరీ గ్లాన్స్, పీస్ ఇన్ ఎవరీ బ్రీత్' అనే క్యాప్షన్‌తో షేర్ చేసిన ఈ స్టిల్స్‌కి అభిమానుల నుంచి భారీ రెస్పాన్స్ వస్తోంది. ఐశ్వర్య మెనన్ కెరీర్ విషయానికి వస్తే.. 2012లో తమిళ సినిమాతో సినీ రంగ ప్రవేశం చేసిన ఆమె తరువాత కేవలం గ్లామర్‌కు పరిమితం కాకుండా, ప్రామాణికమైన పాత్రలతోనూ మెప్పిస్తోంది. కన్నడ తెలుగులో నటించి ఆకట్టుకుంది. తెలుగులో ఆమధ్య స్పై, భజే వాయు వేగం వంటి సినిమాలలో మంచి పాత్రలు



చేసింది. అయితే ఆమెకు భారీ మార్కెట్ ఉండకపోయినా, తన సొగసుతో, హావభావాలతో యువతలో మంచి క్రేజ్ సంపాదించుకుంది. తాజాగా షేర్ చేసిన ఫోటోల్లో ఆమె చూపించిన స్టైలింగ్, హేర్‌స్టైల్, ఎక్స్‌ప్రెషన్స్ అన్నీ పర్‌ఫెక్ట్‌గా ఉండటమే కాకుండా, యూత్‌ను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. తెల్లటి కాస్ట్యూమ్‌లో ఆమె చూపించిన క్యాషువల్ యెట్ గ్లామరస్ లుక్‌కి వావ్ అంటున్నారు నెటిజన్లు. నేచురల్ లైటింగ్‌లో తీసిన ఈ ఫోటోలు ఐశ్వర్య మెనన్ అందాన్ని మరో లెవెల్‌లో చూపిస్తున్నాయనడం అతిశయోక్తి కాదు. ప్రస్తుతం ఆమె తమిళ, తెలుగు చిత్రాలతో పాటు ఓ వెబ్ సిరీస్ ప్రాజెక్ట్‌లోనూ బిజీగా ఉంది. కొంతకాలంగా సరైన హిట్ లేక పోయినా.. సోషల్ మీడియా పాపులారిటీతో మళ్లీ అవకాశాలు అందుకుంటోంది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమె పోస్ట్ చేసిన ప్రతి ఫోటోకి వేల సంఖ్యలో లైక్స్, కామెంట్లు రావడం గమనించదగ్గ విషయం. ఐశ్వర్య మెనన్ కెరీర్ పుంజుకోవడం కోసం మంచి స్క్రిప్ట్ కోసం ఎదురుచూస్తోంది. ఇక ఫ్యాషన్, ఫొటోషూట్‌లతో యూత్‌ను కట్టిపడేస్తోంది.

## అప్పటికీ ఇప్పటికీ అమ్మడు అదే డిమాండ్..!

వారానికో సినిమా రిలీజ్ అవుతుంది. అందులో నటించేందుకు హీరోయిన్స్ వస్తున్నారు. కానీ వారిలో సక్సెస్ అయ్యే హీరోయిన్స్ మాత్రం చాలా తక్కువ. అలాంటి పరిశ్రమలో తమకంటూ ఒక స్టార్ స్టేటస్ తెచ్చుకుని మెప్పించడం అంటే మామూలు విషయం కాదు. అంతేకాదు ఆ స్టార్ డం ని దశాబ్దాలుగా కొనసాగించడం మరీ కష్టం. అలా స్టార్స్ కి ఏమాత్రం తగ్గని విధంగా తన సత్తా చాటుతూ హీరోయిన్స్ లో చాలా ప్రత్యేకంగా ఉంటుంది కోలీవుడ్ స్టార్ హీరోయిన్ నయనతార. ఓ పక్క కమర్షియల్ సినిమాల్లో నటిస్తూనే మరోపక్క ఫిమేల్ సెంట్రిక్ సినిమాలతో అదరగొట్టేస్తుంది. కోలీవుడ్ లో ఒకదశలో నయనతార సినిమా వస్తుంది అంటే స్టార్ హీరోలు కూడా భయపడే పరిస్థితి వచ్చింది. ఐతే తమిళ్ తో పాటు తెలుగులో కూడా నయనతార సినిమాలు చేస్తూ వచ్చింది. తెలుగులో స్టార్ హీరోలతో నటిస్తూ అదరగొట్టేస్తుంది. ఐతే కొన్నాళ్లుగా తమిళ




సినిమాలకే పరిమితమైంది నయనతార. ఈమధ్యనే బాలీవుడ్ లో కూడా తన మార్క్ చూపించే ప్రయత్నం చేసింది. షారుఖ్ ఖాన్ జవాన్ లో నటించి బీ టౌన్ ఆడియన్స్ ని మెప్పించింది నయనతార. ఇక ఈమధ్యలోనే ఒక తెలుగు సినిమా కోసం నయనతారని కలిశారట మేకర్స్. అనిల్ రావిపూడి డైరెక్షన్ లో చిరంజీవి చేస్తున్న సినిమాలో హీరోయిన్ గా నయన్ ని తీసుకునే ప్లాన్ లో ఉన్నారట. చిరుతో ఆల్రెడీ సైరా నరసింహా రెడ్డి, గాడ్ ఫాదర్ సినిమాల్లో నటించింది నయనతార. ఇప్పుడు అనిల్ తో చేసే సినిమాలో కూడా నయన్ నటిస్తుందని టాక్. ఐతే ఈ సినిమాలో నటించేందుకు గాను అమ్మడు 18 కోట్ల దాకా డిమాండ్ చేస్తుందని తెలుస్తుంది. రెమ్యునరేషన్ విషయంలో ఎలాంటి కాంప్రమైజ్ అవ్వని నయన్ అంత ఇస్తేనే సినిమా చేస్తానని అంటుందట. ఐతే నయన్ ఉంటే సినిమాకు మంచి బజ్ వస్తుందని ఆమెతో చర్చిస్తున్నారని తెలుస్తుంది. మెగా మూవీలో నయన్ కన్ఫర్మ్ అయితే తప్పకుండా సినిమాకు ప్లస్ అవుతుందని చెప్పొచ్చు. చిరుతో నయనతార నటించడం గురించి త్వరలోనే అఫీషియల్ అప్డేట్ వస్తుంది. ఈ సినిమాను 2026 సంక్రాంతికి రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారని తెలుస్తుంది. సంక్రాంతికి వస్తున్నాం తో 300 కోట్లు కొట్టిన అనిల్ రావిపూడి డైరెక్షన్ లో మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న ఈ సినిమా ఎలాంటి మ్యాజిక్ చేస్తుందో చూడాలి.

## ఈడీ ఎంట్రీ.. విజయదేవరకొండతో పాటు 29 మందికి తాజా నోటీసులు



కొద్ది వారాల క్రితం వరకు హాట్ టాపిక్ గా మారటమే కాదు సినీ ప్రముఖులు.. సెలబ్రిటీలకు షాకుల మీద షాకులు ఇచ్చిన బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ వ్యవహారం ఇప్పుడు మరో మలుపు తిరిగింది. పలువురి ఆత్మహత్యలకు మాత్రమే కాదు.. ఆర్థికంగా దెబ్బ తీసిన ఈ బెట్టింగ్ యాప్స్ ఇష్యూలోకి ఈడీ (ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్) ఎంట్రీ ఇచ్చింది. తెలుగు రాష్ట్రాల్లో వేలాది మందిని వేధిస్తున్న ఈ బెట్టింగ్ యాప్స్ పై చర్యలు తీసుకోవటంలో సైబర్ పోలీసులు ఎంట్రీ ఇవ్వటం.. కేసునమోదు చేయటం.. నోటీసులు ఇవ్వటం తెలిసిందే. ఈ క్రమంలో చట్టవిరుద్ధంగా నడిచే ఈ బెట్టింగ్ యాప్స్ కు ప్రచారం చేసిన పలువురు సినీ ప్రముఖుల వ్యవహారశైలిపై చర్చ జరిగింది. తమకు అవగాహన లేదని.. తాము తెలియకుండానే ప్రచారం చేసినట్లుగా ప్రముఖులు ఒప్పుకోవటం తెలిసిందే. అయితే.. చేసింది తప్పే అయినప్పుడు కేసులు నమోదు కాక తప్పవు. ఈ క్రమంలో సినీ ప్రముఖులు విజయ దేవరకొండ లాంటి యూత్ ఫుల్ హీరో మాత్రమే కాదు.. మేధావిగా.. పలు సామాజిక అంశాలపై అవగాహన కల్పించేలా వ్యాఖ్యలు చేసే సీనియర్ నటుడు ప్రకాశ్ రాజ్ తోపాటు రానా.. మంచు లక్ష్మి.. నిధి అగర్వాల్.. అనన్య నాగళ్ల.. శ్రీముఖి ఇలా దాదాపు 29 మంది ప్రముఖులపైనా.. కంపెనీల పైనా కేసులు నమోదు చేసిన ఈడీ.. తాజాగా వారికి నోటీసులు జారీ చేసింది. తాజాగా కేసులు నమోదు చేసిన వారిలో యూట్యూబర్స్.. సోషల్ మీడియా ఇన్ ఫ్లూయెన్సర్లు కూడా ఉన్నారు. త్వరలో వీరంతా ఈడీ విచారణను ఎదుర్కోనున్నారు. కొద్ది వారాల క్రితం సైబరాబాద్ పోలీసులు కేసులు నమోదు చేయటంతో అప్పట్లో ఈ అంశం హాట్ టాపిక్ గా మారింది. అనంతరం ఎలాంటి కదలిక లేకుండా పోయింది. తాజాగా ఈ అంశంలోకి ఈడీ ఎంట్రీ ఇవ్వటంతో.. సినీ ప్రముఖులు.. సెలబ్రిటీలకు కొత్త తలనొప్పులు వచ్చినట్లైంది. ఈ అంశంపై ఈడీ ఇంకేం చర్యలు తీసుకుంటుందో చూడాలి.

## ప్రభాస్ కామెడీ..వారంతం అదే పనా!




ప్రభాస్ కథానాయకుడిగా మారుతి దర్శకత్వంలో 'ది రాజాసాబ్' తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. డార్లింగ్ 'ఫౌజీ' షూటింగ్ తో పాటు ఏక కాలంలో రాజాసాబ్ చిత్రీకరణకు హాజరవుతున్నారు. ఇప్పటికే రాజాసాబ్ చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. సింహభాగం షూటింగ్ పూర్తయింది. తాజాగా కొత్త షెడ్యూల్ రామోజీ ఫిలిం సిటీలో జరుగుతోంది. దీనిలో భాగంగా ప్రభాస్ తో పాటు, వీటీవీ గణేష్, ప్రభాస్ సీన్ పై కామెడీ ట్రాక్ తెరకెక్కిస్తున్నారు. ఈ వారంతం వరకూ షూటింగ్ అక్కడే జరుగుతుంది. సినిమాలో ఈ కామెడీ ఎపిసోడ్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంటున్నారు. ప్రభాస్ కామెడీ సైతం పండిచగల నటుడు. కెరీర్ ఆరంభంలో ప్రభాస్ నటించిన చాలా చిత్రాల్లో కామెడీ ట్రాక్ లో నూ కనిపించారు. కాల క్రమంలో భారీ యాక్షన్ థ్రిల్లర్ల వైపు వెళ్లడంతో కామెడీ కి పూర్తిగా దూరమయ్యారు. ఈనేపథ్యంలో మారుతి హారర్ థ్రిల్లర్ కామెడీ కథ వినిపించడంతో డార్లింగ్ మరో ఆలోచన లేకుండా కమిట్ అయ్యారు. తాను పెద్ద పాన్ ఇండియా స్టార్ అయినా మారుతి ఇమేజ్ తో పనిలేకుండా కమిట్ అయ్యారు. వాస్తవానికి ఈ ప్రాజెక్ట్ విషయంలో మారుతి తొలుత కాన్ఫిడెంట్ గా లేకపోవడంతో సినిమా చేయకూడదనుకున్నాడు. కానీ ప్రభాస్ ఒత్తిడి తీసుకురావడంతో కమిట్ అయ్యారు. ఈ విషయాన్ని మారుతినే స్వయంగా ఓ సందర్భంలో రివీల్ చేసిన సంగతి తెలిసిందే. తాజా షెడ్యూల్ అనంతరం పాటల చిత్రీకరణ మొదలవుతుందని సమాచారం. ఇందులో ముగ్గురు భామలు హీరోయిన్లగా నటిస్తోన్న సంగతి తెలిసిందే. నిధి అగర్వాల్, మాళవికా మోహనన్, రిద్ధి కుమార్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. హీరోయిన్ల పాత్రల విషయంలోనూ డార్లింగ్ హస్తముంది. సినిమాలో తొలుత ఒకే హీరోయిన్ అనుకున్నారు. కానీ మరో నాయిక ఉంటే బాగుంటుంద ప్రభాస్ సూచించడంతో? ఇద్దరు కాదు...ముగ్గురని రిద్ధి కుమార్ ని థర్డ్ లీడ్ కి ఎంపిక చేసిన సంగతి తెలిసిందే.

## ఖిలాడీ బ్యూటీ గ్లామర్ షో

తెలుగు అమ్మాయిలు టాలీవుడ్‌లో హీరోయిన్స్‌గా రాణించడం సాధ్యం కాదని చాలా మంది అనుకుంటూ ఉంటారు. నిజంగానే తెలుగు మాట్లాడే హీరోయిన్స్ స్టార్ హీరోల సినిమాల్లో నటించడం చాలా అరుదుగా చూస్తూ ఉంటాం. అయితే కొద్ది మంది అమ్మాయిలు మాత్రం ఉత్తరాది ముద్దుగుమ్మలకు ఏ మాత్రం తీసి పోకుండా అందంగా కనిపించడంతో పాటు, స్కిన్ షో చేయడం ద్వారా ఇండస్ట్రీలో మంచి గుర్తింపు దక్కించుకుంటారు. ఏపీకి చెందిన డింపుల్ హయతి టాలీవుడ్‌లో పలు సినిమాల్లో నటించింది. రవితేజతో కలిసి 'ఖిలాడీ' సినిమాలో నటించడం ద్వారా పాపులారిటీని సొంతం చేసుకుంది. పలు సినిమాల్లో నటించిన డింపుల్ తమిళ్ సినిమాల్లోనూ నటించి మెప్పించేందుకు ప్రయత్నించింది. 19 ఏళ్ల వయసులోనే 'గల్ఫ్' అనే సినిమాలో నటించడం ద్వారా టాలీవుడ్‌లో అడుగు పెట్టింది. 2017లో విడుదల అయిన ఆ సినిమా డింపుల్‌కి నటిగా మంచి పేరును తెచ్చి పెట్టింది. 2019లో ఈమె నటించిన మూడు సినిమాలు ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. ముఖ్యంగా వరుణ్ తేజ్ హీరోగా హరీష్ శంకర్ దర్శకత్వంలో వచ్చిన గద్దలకొండ గణేష్ సినిమాలో చేసిన ఐటెం సాంగ్‌తో టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. జర్రా



జర్రా... అంటూ సాగే ఆ పాటకు మంచి రెస్పాన్స్ దక్కింది. దాంతో డింపుల్ హయతి కెరీర్ స్పీడ్ అందుకుంది. సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా ఈమె అందమైన ఫోటోలను షేర్ చేయడం ద్వారా వార్తల్లో నిలుస్తూ ఉంటుంది. తాజాగా బ్లాక్ అండ్ వైట్ సింపుల్ అండ్ గ్లామర్ ఔట్ ఫిట్‌ను ధరించింది. చూపు తిప్పుకోనివ్వకుండా హొయలు పోతూ ఫోటోలకు ఫోజ్ ఇచ్చింది. అందమైన ఈ ఖిలాడీ బ్యూటీని ఈ ఫోటోల్లో చూస్తూ ఉంటే గుండె జారి గల్లంతవుతుంది అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఈ స్థాయిలో ఖిలాడీ బ్యూటీ గ్లామర్ షో చేస్తున్నా కూడా టాలీవుడ్‌లో ఆశించిన స్థాయిలో ఆఫర్లు రావడం లేదనే అభిప్రాయంను కొందరు వ్యక్తం చేస్తున్నారు. డీ గ్లామర్ పాత్రలతో పాటు, గ్లామర్ పాత్రలకు రెడీ అంటూ అన్ని రకాలుగా నటించేందుకు సిద్ధ పడే ఈ అమ్మడు ముందు ముందు టాలీవుడ్‌లో పెద్ద సినిమాల్లో నటించే అవకాశాలు దక్కించుకుంటుందనే విశ్వాసం వ్యక్తం అవుతోంది. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో తమిళ తండ్రి, తెలుగు తల్లికి 1998లో ఆగస్టు 21న డింపుల్ హయతి జన్మించింది. పుట్టడం ఏపీలో అయినా పెరగడం మాత్రం హైదరాబాద్‌లోనే జరిగింది. ఇండస్ట్రీలో అడుగు పెట్టడం కోసం కొన్ని జాతకాలు, ఇతర విషయాల ను పరిగణలోకి తీసుకుని తన పేరుకు ముందు హయతిని జత చేసుకుంది. టాలీవుడ్‌లో ఈమెకు చాలా ప్రయత్నాల తర్వాత అవకాశం దక్కింది. మొదటి సినిమా విజయం దక్కించుకోక పోవడంతో ఆఫర్ల కోసం ఎక్కువ రోజులు వెయిట్ చేయాల్సి వచ్చింది. ఐటెం సాంగ్స్‌కి, వెబ్ సిరీస్‌లకు ఈ అమ్మడు మోస్ట్ వాంటెడ్‌గా మారే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. కాస్త సీరియస్‌గా ప్రయత్నాలు చేస్తే తమిళనాట ఈ అమ్మడికి వరుస ఆఫర్లు దక్కవచ్చు అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

## రష్మిక మందన్న రిప్లైకి అర్థం అదేనా?

వెండితెరపై కొన్ని జంటలకున్న క్రేజ్ మరే జంటకూ ఉండదు. కారణం వారిద్దరి మధ్య కనిపించే కెమిస్ట్రీనే. ఆ కెమిస్ట్రీ కారణంగానే ప్రేక్షకులు హిట్ పెయిర్ మళ్లీ మళ్లీ కలిసి నటిస్తే చూడాలని ముచ్చటపడుతుంటారు. ఇప్పుడు అలాంటి ఓ క్రేజీ జోడీ కలిసి నటించే చూడాలని అభిమానులు, సినీలవర్స్ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఆ జోడీ మరెవరో కాదు రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న. వీరిద్దరు కలిసి 'గీత గోవిందం'లో తొలిసారి నటించారు. వీరి కెమిస్ట్రీ వర్కవుట్ కావడంతో సినిమా వంద కోట్ల క్లబ్‌లో చేరి రికార్డు సృష్టించింది. ఇక ఆ తరువాత కలిసి చేసిన మూవీ 'డియర్ కామ్రేడ్'. ఇది కేవలం రష్మిక కోసమే విజయ్ చేసినట్టుగా ఉంటుంది. 'గీత గోవిందం' అంత కాకపోయినా ఆడియన్స్‌ని మాత్రం విశేషంగా ఆకట్టుకుని ఈ జంటకు హిట్ పెయిర్ అనే ముద్ర వేసింది. 2019లో ఈ మూవీ విడుదలైంది. ఆ తరువాత నుంచి వీరిద్దరు కలిసి మరో సినిమాలో నటించలేదు. మళ్లీ ఇన్నేళ్లకు వీరిద్దరు కలిసి నటించబోతున్నారనే వార్తలు తాజాగా వినిపిస్తున్నాయి. తాజాగా మైత్రీ మూవీమేకర్స్ వారు పెట్టిన ఓ పోస్ట్‌కు రష్మిక రిప్లై



ఇవ్వడంతో ఆ వార్తలు నిజమేనని క్లారిటీ వచ్చేసింది. విజయ్ దేవరకొండ ప్రస్తుతం గౌతమ్ తిన్ననూరి డైరెక్షన్‌లో రూపొందుతున్న 'కింగ్‌డమ్'లో నటిస్తున్న విషయం తెలిసిందే. పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటున్న ఈ సినిమాని ఈ నెల 30న భారీ స్థాయిలో పాన్ ఇండియా మూవీగా ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. దీని తరువాత రాహుల్ సంక్రీత్యన్ దర్శకత్వంలో తెరకెక్కనున్న పీరియాడిక్ డ్రామాలో నటించనున్నాడు. దీన్ని మైత్రీ మూవీ మేకర్స్ వారు నిర్మించబోతున్నారు. ఈ భారీ మూవీ వచ్చే నెల హైదరాబాద్‌లో ప్రారంభం కాబోతోంది. ఇందులో విజయ్‌కి జోడీగా రష్మిక నటించనుందనే వార్తలు వినిపిస్తున్నాయి. దీనిపై నిర్మాణ సంస్థ తాజాగా 'వేచి చూద్దాం' అని అర్థం వచ్చేలా ఓ పోస్ట్ పెట్టింది. దానికి రష్మికను ట్యాగ్ చేసింది. దీనికి రష్మిక రిప్లైగా 'ఓకె' అంటూ నవ్వుతున్న ఎమోజీలను పోస్ట్ చేసింది. దీంతో చాలా గ్యాప్ తరువాత రౌడీ, రష్మికల జోడీ ఖరారైందని అభిమానులు భావిస్తున్నారు. రష్మిక ఇదే విషయాన్ని తాజాగా కన్ఫర్మ్ చేసిందని చెబుతున్నారు. ఇదే నిజమైతే మరో సారి క్రేజీ జోడీ స్క్రీన్‌పై సందడి చేయడం ఇక లాంఛనమే.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536